# భారత్ శక్తి®



11లో

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 229 | హైదరాబాద్ | బుధవారం 04-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00

## జిల్లా కలెక్టర్లూ..మానవీయ కోణంలో
# నిర్ణయాలు తీసుకోండి

- ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయండి
- సంక్షేమాన్ని అభివృద్ధిని బ్యాలెన్స్ చేయండి
- కొత్తగా బాధ్యతలు చేపట్టిన కలెక్టర్లతో
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



11లో



11లో

## యూట్యూబ్‌లోనూ
# ప్రధాని మోదీ హవా..

- 3 కోట్ల సబ్‌స్క్రైబర్లతో ప్రపంచ రికార్డు
- ఇటీవలే ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల మంది ఫాలోవర్లను దాటిన తొలి నేత
- యూట్యూబ్‌లో రాహుల్ గాంధీ కన్నా మూడు రెట్లు అధిక సబ్‌స్క్రైబర్లు
- ఇన్‌స్టాలో ట్రంప్ కన్నా రెట్టింపు ఫాలోవర్లతో మోదీ



# నేపాల్ ఎన్నికల ఎఫెక్ట్..
## భారత్ సరిహద్దు 72 గంటల పాటు మూసివేత

11లో

- నేపాల్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత్ సరిహద్దు మూసివేత
- నిన్న అర్ధరాత్రి నుంచి అమల్లోకి వచ్చిన ఈ నిబంధనలు
- భద్రతా కారణాల దృష్ట్యా రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ప్రకటన
- నిత్యావసర సేవలు, విదేశీయులకు మినహాయింపు

## తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం..
# రికార్డుస్థాయిలో విద్యుత్ వినియోగం

- ఈరోజు 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ వెల్లడి
- భవిష్యత్తు విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించిన భట్టివిక్రమార్క
- డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు వెల్లడి



11లో



11లో


## టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై ప్రచారం..
# గాగ్ ఆర్డర్ ఇచ్చిన హైదరాబాద్ కోర్టు

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ..
# సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు

- ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లిన పవన్ కల్యాణ్
- గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై ప్రధానంగా చర్చ
- జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని నిర్ణయం

11లో





## ఇరాన్ యుద్ధం... ఢిల్లీలండన్ డైరెక్ట్ ఫ్లయిట్ కు
# భగ్గుమంటున్న టికెట్ ధరలు!

- ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలతో ఢిల్లీ లండన్ విమానాలు రద్దు
- ఒక్కో టికెట్ ధర రూ.7 లక్షల వరకు చేరిన వైనం
- 9 గంటల ప్రయాణం ఇప్పుడు 30 గంటల పైమాటే
- భారీగా పెరిగిన ఇంధన ఖర్చులు మెయింటెనెన్స్ వ్యయం
- ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

11లో

# మసకబారుతున్న ఎర్రజెండా

పశ్చిమ బెంగాల్ రాజకీయ చరిత్రలో 34 ఏళ్ల పాటు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్ష కూటమి , ఒక్కసారి అధికారం కోల్పోయాక తిరిగి కోలుకోలేనంతగా బలహీనపడటం భారత రాజకీయాల్లో ఒక హెచ్చరిక.కమ్యూనిస్టుల తొలినాళ్ల విజయానికి భూసంస్కరణలు వెన్నెముకగా నిలిచాయి. పేద రైతులకు భూమిని పంచడం ద్వారా వారు పటిష్టమైన ఓటు బ్యాంకును సృష్టించుకున్నారు. అయితే, కాలక్రమేణా ఆ భూమి చిన్న చిన్న ముక్కలై, వ్యవసాయం లాభసాటిగా లేక యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లడం ప్రారంభమైంది. వ్యవసాయంపై ఆధారపడిన పాత తరం తర్వాత వచ్చిన కొత్త తరం ఆకాంక్షలను గుర్తించడంలో సిపిఎం విఫలమైంది.దాదాపు మూడు దశాబ్దాల పాలన తర్వాత, రాష్ట్రంలో పారిశ్రామికీకరణ అవసరమని గుర్తించిన అప్పటి ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్య వేగంగా అడుగులు వేశారు. అయితే, టాటా నానో ప్లాంట్ కోసం సింగూర్‌లోనూ, కెమికల్ హబ్ కోసం నందిగ్రామ్‌లోనూ బలవంతంగా భూసేకరణ చేపట్టడం పార్టీకి శాపమైంది. వ్యవసాయం మన పునాది.. పరిశ్రమ మన భవిష్యత్తు అనే నినాదం క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరలేదు. ఫలితంగా, తమను నమ్ముకున్న రైతాంగం తమకు వ్యతిరేకంగా మారుతుంటే కమ్యూనిస్టులు గ్రహించలేకపోయారు.సుదీర్ఘ పాలన వల్ల పార్టీ క్యాడర్‌లో విపరీతమైన అహంకారం పెరిగింది. గ్రామాలు, పట్టణాల్లో చిన్న చిన్న సమస్యల నుండి పోలీసు స్టేషన్ల వరకు అంతా పార్టీ కనుసన్నల్లోనే నడిచేది. ఈ పార్టీతంత్రం సామాన్య ప్రజలకు భారంగా మారింది. చివరకు మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ మా-మతి-మానుష్ అంటే తల్లి-నేల-ప్రజలు నినాదంతో ప్రజల్లోకి వెళ్లినప్పుడు, కమ్యూనిస్టుల ఉక్కుకోటలు పేకమేడల్లా కూలిపోయాయి.2011లో అధికారం కోల్పోయిన తర్వాత, కమ్యూనిస్టుల ఓటు బ్యాంకును మమతా బెనర్జీ తన సంక్షేమ పథకాలతో పూర్తిగా తనవైపు తిప్పుకున్నారు. ఉచిత బియ్యం, సైకిళ్లు , కన్యాశ్రీ వంటి పథకాలు గ్రామీణ ఓటర్లను టిఎంసికి శాశ్వత మద్దతుదారులుగా మార్చాయి. కమ్యూనిస్టులు సిద్ధాంతాలకే పరిమితం కాగా, మమత ప్రత్యక్ష ప్రయోజనాలపై దృష్టి పెట్టారు.కమ్యూనిస్టులు బలహీనపడటంతో ఏర్పడిన రాజకీయ శూన్యాన్ని భర్తీ చేయడానికి బీజేపీకి అవకాశం దక్కింది. ముందు మమతను దించాలి, ఆ తర్వాత మనల్ని మనం చూసుకోవచ్చు అనే భావనతో కమ్యూనిస్టుల ఓటు బ్యాంకులో గణనీయమైన భాగం బీజేపీ వైపు మళ్లింది. 2019 ఎంపీ ఎన్నికలు, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో వామపక్షాలు ఒక్క సీటు కూడా గెలవలేక సున్నాకే పరిమితం కావడం వారి దయనీయ స్థితికి అద్దం పడుతోంది.సిద్ధాంతపరమైన మొండితనం, మారుతున్న కాలానికి అనుగుణంగా మారకపోవడం, ప్రజల మనోభావాల కంటే పార్టీ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వడం బెంగాల్ కమ్యూనిస్టులను పతనం అంచుకు నెట్టాయి. ప్రస్తుతం బెంగాల్ రాజకీయాల్లో వారు మనుగడ కోసం పోరాడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. శ్రామిక వర్గ జయకేతనం 'ఎర్రజెండా'భారత్‌లో శతవసంతాలుదాటి నూరేళ్ళ పండుగ జరుపుకుంటోంది. 1925డిసెంబర్ 25నపుట్టిన భారత కమ్యూనిస్ట్ పార్టీ ఈ ఏడాదితో వందేండ్ల ప్రస్థానాన్ని పూర్తిచేసుకుంది. మార్క్సిస్టు మూల సూత్రాల ఆధారంగా రూపుదిద్దుకున్న వర్గ పోరాటంతో ప్యారిస్ కమ్యూన్ ఏర్పడినప్పటికీ అది వేళ్ళమీద లెక్కబెట్టుకునే రోజులే మనుగడలో ఉంది. ప్యారిస్ కమ్యూన్ గుణపాఠం తీసుకొని వ్లాదిమిర్ ఇల్విచ్ లెనిన్ రష్యాలో శ్రామిక వర్గ రాజ్యాంగ యంత్రం అనే మార్క్సిస్టు సిద్ధాంతం వెలుగులో 1919 అక్టోబర్ విప్లవం విజయవంతం చేశాడు.సువిశాల భూభాగం,ప్రజాబాహుళ్యంగల రష్యాలో ఎర్రజెండా ఆవిర్భావంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రామిక వర్గంపై ఆ ప్రభావం పడింది. మార్క్సిస్టు సిద్ధాంత కర్తలు ఏర్పాటు చేసుకున్న 'కమ్యూనిస్టు ఇంటర్నేషనల్'కూడా ప్రపంచం అంతటా ఎర్రజెండా విస్తరణకు బాటలు వేసింది. రష్యా అక్టోబర్ విప్లవ ప్రభావంతోనే ఇండియాలో కూడా 1925లోనే రాడికల్ హ్యూమనిస్టు యంయన్.రాయ్, దత్,యస్ఏ డాంగే, తదితర కార్మిక నేతల నేతృత్వంలో "కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా" సీపీఐకి అంకురార్పణ జరిగింది. ఆనాటి బ్రిటిష్ వలసవాదులు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అప్పట్లో రహస్యంగా పనిచేయవలసి వచ్చింది. భారత స్వాతంత్ర ఉద్యమంలో కాంగ్రెస్‌తో కలిసి పని చేయడంతో పాటు బొంబాయి డాక్ కార్మికుల సమ్మె లాంటి చారిత్రక తిరుగుబాటుకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించింది. భారత దేశం కంటే ఆలస్యంగా ఎర్రజెండా ఆవిర్భావం జరిగిన పొరుగు దేశం చైనాలో మావో నేతృత్వంలో 1949లోనే విప్లవం విజయవంతమైంది . అక్కడ కమ్యూనిస్టులు అధికారంలోకి రాగలిగినప్పటికీ ఇండియాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణ దశలోనే ఉంది.విభిన్న భౌగోళిక వాతావరణం, విభిన్న జీవన విధానాలు, సంస్కృతి,వర్గ పొందికల్లో వ్యత్యాసాల మూలంగా దేశవ్యాప్తంగా అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ అధికారం లోకి రాలేకపోయింది. ఇదే సమయం లో తెలుగు నాట ముఖ్యంగా నైజాం రాజరికం ఉన్న తెలంగాణ రాష్ట్రం లో భూస్వామ్య శృంఖలాలు తెంచడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర కీలకమైనది.ఆంధ్రమహాసభ కార్యక్రమం లో రహస్యంగా ప్రవేశించి గ్రంధాలయ ఉద్యమం,రాత్రి బడులు లాంటి చిన్న చిన్న సంస్కరణలు ద్వారా రైతాంగ ఉద్యమానికి పునాదులు వేసింది.చివరకు అది 'తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం' గా మారి ఐదు లక్షల గ్రామాలకు ఎర్రజెండా విస్తరించింది."దున్నే వానికే భూమి"కీలక నినాదం ను ముందుకు తేవడం ద్వారా దేశంలో భూసంస్కరణలు అమలు జరపడానికి కమ్యూనిస్టుల పోరాటమే మూలం.దేశ స్వాతంత్ర్యం అనంతరం కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలే తొలిదశ ఎన్నికల్లో తలపడినప్పటికీ కమ్యూనిస్టు పార్టీ అధికారం లోకి రాకపోయినప్పటికీ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా నిలిచి పోరాడింది.బారత కార్మిక వర్గంలో తనదైన పునాదులు విస్తరించుకున్నది.

# గ్రామపంచాయితీలకు ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ ఆదాయాలు

విజయవాడ, మార్చి 3, (

గ్రామ పంచాయితీల ఆర్థిక ఇబ్బందులను దూరం చేసేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌ఆర్‌ఎస్ , బీపీఎస్ పథకాల ద్వారా వచ్చే ఆదాయంలో గ్రామ పంచాయితీలకు వాటా ఇవ్వాలని నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు 50 శాతం,, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం, ఏపీ టౌన్ ప్లానింగ్ విభాగానికి 20 శాతం నిధులు చొప్పున కేటాయించాలని నిర్ణయించింది. ఈ కొత్త విధానంతో గ్రామ పంచాయితీలకు నిధుల కొరత తగ్గుతుందని అధికారులు చెప్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గ్రామ పంచాయితీలకు మంచి రోజులు రానున్నాయి. లేఅవుట్ల క్రమబద్ధీకరణ పథకం బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని గ్రామ పంచాయితీలతో పంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామ పంచాయితీలకు ఆర్థిక ప్రోత్సాహం అందించేందుకు గానూ ఈ నిర్ణయం తీసుకుంది. కొత్త విధానం కింద గ్రామ పంచాయతీలు తమ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్, బీపీఎస్ పథకాల కింద సమీకరించిన ఆదాయంలో సగం వాటాను పొందుతాయి. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు 30 శాతం ఆదాయాన్ని కేటాయిస్తారు. మిగిలిన 20 శాతం రాష్ట్ర పట్టణ ప్రణాళిక విభాగానికి వెళ్తుంది. చాలా వరకూ గ్రామ పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో.. ఈ విధానం ప్రకారం వాటికి కావాల్సిన నిధులు అందజేయవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.స్థానిక సంస్థల సాధికారత విషయంలో ఏపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని ఈ నిర్ణయం తెలియజేస్తోందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ కుమార్ వెల్లడించారు. ఈ విధానం ప్రకారం క్రమబద్ధీకరణ పథకాల ద్వారా సమీకరించిన నిధులను తిరిగి అదే ప్రాంత అభివృద్ధి కోసం పెట్టుబడి పెట్టనున్నట్లు వివరించారు. గ్రామ పంచాయతీలకు సగం ఆదాయం కేటాయించడం ద్వారా, ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుందని వివరించారు.అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ వంటి కనీస అవసరాలైన పనులకు కూడా నిధులు లేక పంచాయితీలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. అనేక గ్రామ పంచాయతీలు సాధారణ పారిశుధ్య పనులను కూడా చేపట్టలేకపోతున్నాయి. ఎక్కువగా ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్లపై ఆధారపడతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఒఖీూ, ఃఖూ ఆదాయాలు స్థిరంగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో.. గ్రామ పంచాయతీలు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను చేపట్టేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సుదీర్ఘ చర్చల అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఉన్నతాధికారులు వెల్లడించారు. రెగ్యులరైజేషన్ పథకాల ద్వారా సేకరించిన నిధులను స్థానికంగానే ఖర్చు చేయనున్న నేపథ్యంలో ఎక్కువ మంది తమ ఆస్తుల రెగ్యులరైజేషన్ కోసం ముందుకు వచ్చే అవకాశం ఉందంటున్నారు. ఈ నిర్ణయం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# త్వరలో లోకేష్ కు పట్టాభిషేకం ఊహాగానాలు

విజయవాడ, మార్చి 3, (న్యూస్ పల్స్)



ఆంధ్రప్రదేశ్ లో నారా లోకేష్ సీఎం అనే చర్చ అప్పుడప్పుడూ తెరపైకివస్తోంది. ఇటీవలి కాలంలో లోకేష్ కు పట్టాభిషేకం చేస్తారన్న సోషల్ మీడియాలో తరచూ టాపిక్ వైరల్ అవుతోంది. నిజానికి లోకేష్ డిప్యూటీ సీఎం అనే ప్రచారం కొంత కాలం సాగింది. టీడీపీ నేతలు కూడా వరుసగా ప్రకటనలు చేశారు. కానీ ఇలాంటి ప్రకటనలు చేస్తే ఊరుకునేది లేదని హైకమాండ్ హెచ్చరించడంతో అందరూ సైలెంటు అయిపోయారు. కానీ ఇప్పుడు సీఎం చర్చ వస్తోంది. టీడీపీలో చంద్రబాబు తర్వాత లోకేష్ దే నాయకత్వం. చంద్రబాబు ఇప్పటికిప్పుడు వైదొలిగే అవకాశాలు లేవు. ఎందుకంటే చంద్రబాబుకు దీర్ఘకాలిక లక్ష్యాలు ఉన్నాయి. గతంలో లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలని తెలుగుదేశం పార్టీ శ్రేణుల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్ వినిపించింది. అప్పట్లో కొందరు నేతలు బహిరంగంగానే ప్రకటనలు చేసినప్పటికీ, పార్టీ అధిష్టానం జోక్యం చేసుకుని వారించడంతో ఆ చర్చ సద్దుమణిగింది. అయితే లోకేష్ సీఎం అనే చర్చ మళ్ళీ తెరపైకి రావడం వెనుక కేడర్‌లో ఉన్న ఉత్సాహమే ప్రధాన కారణం. యువగళం పాదయాత్ర ద్వారా తనను తాను నిరూపించుకున్న లోకేష్‌కు తగిన గుర్తింపు దక్కాలనేది అభిమానుల కోరిక. కానీ, పార్టీ క్రమశిక్షణ దృష్ట్యా ఇలాంటి కీలక అంశాలపై అధిష్టానం అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది.చంద్రబాబు నాయుడు రాజకీయ ప్రస్థానంలో ప్రస్తుతం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం అమరావతి నిర్మాణం. రాజధానిని ఒక కొలిక్కి తీసుకురావడమే తన జీవిత ఆశయమని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు. ఈ భారీ ప్రాజెక్టు పూర్తి కావాలన్నా, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గాడిలో పడాలన్నా మరో పదేళ్ల సుదీర్ఘ కాలం పడుతుందనేది వాస్తవం. ఇటువంటి క్లిష్ట సమయంలో అనుభవజ్ఞుడైన చంద్రబాబు పగ్గాలు వదిలిపెడతారనేది కేవలం ఊహ మాత్రమే. అమరావతి స్వప్నం సాకారం కాకుండా ఆయన సీఎం పీఠం నుంచి తప్పుకునే అవకాశం లేదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.చంద్రబాబు కేంద్ర రాజకీయాల్లోకి వెళ్తారని, అక్కడ కీలక పదవి చేపట్టి రాష్ట్రంలో లోకేష్‌కు బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో జోరుగా సాగుతోంది. అయితే, చరిత్రను పరిశీలిస్తే చంద్రబాబు ఎప్పుడూ పదవుల కోసం పాకులాడలేదు. కింగ్ మేకర్‌గా తనకున్న లోక్ సభ ఎంపీల బలాన్ని ఎప్పుడూ రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఉపయోగించారు తప్ప, తన సొంత పదవుల కోసం వాడలేదు. 1990లలోనే ప్రధాని పదవినే కాదనుకున్న ఆయనకు, ఇప్పుడు కేంద్ర మంత్రి పదవులపై ఆసక్తి ఉంటుందనుకోవడం పొరపాటే అవుతుందని టీడీపీ వర్గాలంటున్నాయి నిజానికి టీడీపీలో చంద్రబాబు తర్వాత వారసుడిగా లోకేష్ నాయకత్వంపై ఎవరికీ సందేహాలు లేవు. కానీ అది ఎప్పుడు జరగాలి? ఎలా జరగాలి? అనేదానికి కాలమే సమాధానం చెబుతుంది. ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న గాసిప్స్ మాత్రమే. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు పాలనపైనే రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంది కాబట్టి, లోకేష్ పట్టాభిషేకం అనే అంశం ప్రస్తుతానికి కార్యరూపం దాల్చడం అసాధ్యమని టీడీపీ వర్గాలు క్లారిటీ ఇస్తున్నాయి.

# బెజవాడలో కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్

విజయవాడ, మార్చి 3


విజయవాడ నగరంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడనుంది. ఈ మేరకు కొత్త ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించేందుకు ఏపీ ప్రభుత్వం రెడీ అయింది. హైదరాబాద్-మచిలీపట్నం జాతీయ రహదారిలో విజయవాడ నగర పరిధిలో ఉన్నంత మేరకు.. ఆ మార్గంలో ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మించే ప్రతిపాదనను సర్కార్ పరిశీలిస్తోంది. పండిట్ నెహ్రూ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ పార్క్ వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ నుంచి మె?దలుకొని మచిలీపట్నం వైపు వెళ్లే మార్గంలోని గంగూరు కూడలి వరకు మె?త్తంగా 14 కి.మీ. మేర ఈ ఫైవంతెన నిర్మించాలని భావిస్తున్నారు. ఆరు వరుసలతో నిర్మించే ఫ్లై ఓవర్ కారణంగా హైవేలో ప్రయాణించే వారికి ఏ ఆటంకాలూ ఉండవని, విజయవాడ నగర ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుందని అధికారులు యోచిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ను ఎలా చేపట్టవచ్చన్న భిన్న ప్రణాళికలపై ఢిల్లీ స్థాయిలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చర్చిస్తున్నారు.హైదరాబాద్-విజయవాడ- మచిలీపట్నం హైవే-65పై విజయవాడ పరిధిలో ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, భవానీపురం, కనకదుర్గ ఫ్లైఓవర్, కృష్ణలంక, వారధి జంక్షన్, బెంజ్ సర్కిల్, ఆటోనగర్ గేట్, కానూరు, పోరంకి, పెనమలూరు మీదుగా ఈ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్-విజయవాడ మధ్య ఎన్‌హెచ్-65ను నాలుగు నుంచి ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రాజెక్ట్ చేపట్టారు. దీన్ని గొల్లపూడి వద్ద విజయవాడ బైపాస్ క్రాస్ అయ్యే పాయింట్ వరకే విస్తరించాలని ముందుగా భావించారు. ఆ తర్వాతా రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు భవానీపురం వద్ద కనకదుర్గ ఫ్లైఓవర్ దాకా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పుకుంది. ఈ మేరకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

# రేషన్ షాపులో కందిపప్పు, రాగులు లేనట్లే..



విజయవాడ, మార్చి 3,

ఏపీ ప్రభుత్వం ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ రేషన్ దుకాణాల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ చేపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి నెల ప్రారంభం కావటంతో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. అయితే విశాఖపట్నం, అల్లూరి జిల్లా రేషన్ కార్డుదారులకు మాత్రం ఈ నెలలో కందిపప్పుతో పాటుగా రాగులు పంపిణీ కూడా జరగడం లేదు. కందిపప్పు పంపిణీ రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోగా.. గత మూడు నెలలుగా పంపిణీ చేసిన రాగులు కూడా విశాఖ, అల్లూరి జిల్లావాసులకు ఈసారికి అందుబాటులో లేకుండా పోయాయి.ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ కార్డుదారులకు రేషన్ సరుకుల పంపిణీ మొదలైంది. మార్చి ఒకటో తేదీ నుంచి నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా అందిస్తున్నారు. లబ్ధిదారులకు బియ్యంతో పాటుగా అరకిలో పంచదార, కిలో గోధుమపిండి కూడా అందించనున్నారు. కొన్ని చోట్ల జొన్నలు, రాగుల పంపిణీ కూడా జరుగుతోంది. అయితే విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వంటి చోట్ల రాగుల పంపిణీ జరగడం లేదు. గత మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు రాగులను పంపిణీ చేశారు. అయితే మార్చి నెలలో మాత్రం ఇచ్చే పరిస్థితి లేనట్లు తెలిసిందిఅవసరాలకు తగిన మొత్తంలో రాగులు సరఫరా కాలేదని సమాచారం. ముఖ్యంగా ఒడిశా నుంచి రావాల్సిన రాగులు రాలేదని.. దీంతో విశాఖపట్నం, అల్లూరి జిల్లాలలో రాగుల పంపిణీ జరగనట్లు సమాచారం. మరోవైపు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకూ ఆదివారాలతో సహా రేషన్ షాపులు.. లబ్ధిదారులకు అందుబాటులో ఉండనున్న సంగతి తెలిసిందే. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ, అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ దుకాణాలు ప్రజలకు అందుబాటులో ఉంటాయి.మరోవైపు ఏపీలో రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదార, గోధుమపిండి, రాగులు, జొన్నలు పంపిణీ చేస్తున్నప్పటికీ.. కందిపప్పు సరఫరా మాత్రం జరగడం లేదు. బహిరంగ మార్కెట్లో కందిపప్పు ధరలు



చుక్కలను తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా రాయితీపై కందిపప్పు అందిస్తే మధ్యతరగతి జీవికి కాస్త ఊరటగా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.అయితే ఏపీలో కందిపప్పు పంపిణీ నిలిచిపోయి సుమారుగా ఏడాది కావొస్తోంది.బహిరంగ మార్కెట్లో కిలో కందిపప్పు నాణ్యత ఆధారంగా ధర రూ.110 నుంచి రూ.120 వరకూ పలుకుతోంది. రేషన్ దుకాణాల్లో కిలో కందిపప్పు. రూ.67లకే అందించేవారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కందిపప్పు సరఫరా చేయాలని జనం కోరుతున్నారు. అయితే పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన కొత్తల్లో కొన్ని నెలలు పాటు కందిపప్పు సరఫరా చేశారు. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ నిలిచిపోయింది.

# చిలకలూరిపేటలో వీధి కుక్కల దాడి?.

## 10వ వార్డులో స్వైరవిహారం చేస్తున్న వీధికుక్కలు?

పల్నాడు మార్చి 3,

పల్నాడు జిల్లా చిలకలూరిపేట 10వ వార్డులో వీధికుక్కల దాడిలో పది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పిచ్చికుక్క వీధిలో వెళ్తున్న వారిని, వెంటాడి మరీ కరిచింది. ఈ దాడిలో సుమారు 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులందరినీ వెంటనే చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పట్టణ ప్రజలు బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. జిల్లాలో వీధి కుక్కలపై పశుసంవర్ధక శాఖ అధికారుల ఎటువంటి పర్యవేక్షణ లేకపోవడంతో కుక్కల సంతానోత్పత్తి పెరిగి వీధుల నిండా కుక్కల గుంపులు దర్శనమిస్తున్నాయి. వీటికి తోడు కుక్కలకు వింత వ్యాధులు ప్రబలడం ఆందోళన కలిగిస్తోంది. .

# ఏపీ పేరు మార్పు రచ్చ...

కాకినాడ, మార్చి 3,

ఇటీవల కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రం పేరును మార్చిన సంగతి తెలిసిందే. అక్కడి ప్రజల కోరిక మేరకు కేరళం అని పేరు మార్చారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరును కూడా మార్చాలని డిమాండ్ మొదలైంది. గతంలో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించింది. తరువాత తెలుగు నాడుగా మార్చాలన్న డిమాండ్ తెరపైకి వచ్చింది. అయితే ఇప్పుడు కేరళ పేరు మార్పుతో తెలుగు నాడుగా ఏపీని మార్చాలన్న వాదన వినిపిస్తోంది. అయితే ఎట్టి పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్ పేరు మార్పును ఊరుకోమని మరో వర్గం హెచ్చరిస్తోంది. అయితే తాజాగా ఈ తేనె తుట్టను కదిపారు ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు. గతంలో ఎన్టీ రామారావు ఉమ్మడి ఏపీ ని తెలుగు నాడుగా మార్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.ప్రముఖ ప్రవచన కర్తగా ఉన్నారు గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మికతతో పాటు చరిత్రను గుర్తుచేస్తూ ప్రవచనాలు చెబుతుంటారు. ఈ నేపథ్యంలో గతంలో ఏపీని తెలుగు నాడుగా మార్చేందుకు ఎన్టీఆర్ చేసిన ప్రయత్నాన్ని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు పదం కాదని.. ఆంధ్రప్రదేశ్ పేరులో తెలుగుదనం లేదు అని తేల్చేశారు. కేరళ వారికి ఉన్న పట్టుదల కూడా మనకు లేదని.. కేరళ ను కేరళంగా మార్చినట్టే.. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగు నాడుగా మార్చాలని గరికపాటి కోరారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ పేరు మార్పు పై చర్చ మొదలైంది.

ఇదే అంశంపై భువనేశ్వరి పీఠాధిపతి స్వామి కమలానంద భారతి స్పందించారు. ఈ కొత్త చర్చ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ అంటే తెలుగు కాదా? రామాయణ కాలం నుంచి ఆంధ్రా అనే పదం ఉందంటూ ఆయన గరికపాటికి కౌంటర్ ఇచ్చారు. అడిగేవాళ్లు లేరని అధిక ప్రసంగాలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా వింత పోకడలు, ఇంత ఆలోచనలు మంచిది కాదని.. తెలుగు నాడు అని మార్చినా ఎటువంటి సెంటిమెంటు ఉండదని.. ఇలాంటి మేధావులే ఏపీకి మద్రాస్ రాకుండా చేశారని విమర్శించారు. గరికపాటి తెలంగాణలో స్థిరపడ్డారని.. మా బ్రతుకులు ఎలా ఉండాలో మాకు తెలుసు అంటూ చురకలు అంటించారు. ఆంధ్రప్రదేశ్ పేరును తెలుగునాడుగా మార్చాలనే ఆలోచన ఇప్పటిది కాదు. దీనికి దశాబ్దాల చరిత్ర ఉంది. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పుడు ఎన్టీఆర్ తెలుగువారి ఆత్మగౌరవం అనే నినాదాన్ని ఎత్తుకున్నారు. ఆయన హయాంలోనే రాష్ట్రాన్ని తెలుగునాడుగా మార్చాలనే బలమైన ప్రతిపాదన వచ్చింది. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చలు జరిగాయి. కానీ అప్పట్లో రాజకీయ పరిణామాలు, రాజ్యాంగపరమైన ఇబ్బందుల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు వీరి మధ్య జరిగిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.మద్రాసు రాష్ట్రం నుంచి విడిపోయి 1953లో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అప్పట్లో దీనిని ఆంధ్ర అని మాత్రమే పిలిచేవారు. 1956లో హైదరాబాద్ రాష్ట్రంలోని తెలుగు ప్రాంతాలు కలిసిన తర్వాత, ఉమ్మడి రాష్ట్రానికి ఆంధ్రప్రదేశ్ అని పేరు పెట్టారు. అప్పుడే కొందరు మేధావులు తెలుగునాడు పేరును సూచించినా, ఆనాడు ఆంధ్ర అనే పదానికే మొగ్గు చూపారు. 1969లో మద్రాసు రాష్ట్రం తమిళనాడుగా మారింది. ఇటీవలే ఒరిస్సా ఒడిశాగా, పాండిచ్చేరి పుదుచ్చేరిగా మారాయి. ఇప్పుడు కేరళను కేరళంగా మార్చాలని ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసింది. ఈ క్రమంలోనే గరికపాటి వంటి వారు తెలుగు అస్తిత్వం కోసం పేరు మార్పును సమర్థిస్తున్నారు.భాషా పరంగా ఆంధ్ర అనేది ఒక జాతిని సూచించే పదం కాగా, తెలుగు అనేది భాషను సూచిస్తుంది. గరికపాటి వాదన ప్రకారం భాషా ప్రయుక్త రాష్ట్రంలో భాష పేరు ఉండాలి. చారిత్రక పరంగా చూస్తే శాతవాహనులను ఆంధ్రులు అని పురాణాలు పేర్కొన్నాయి. దాదాపు 2000 ఏళ్ల చరిత్ర ఈ పదానికి ఉంది. అందుకే దీనిని మార్చడం అంటే చరిత్రను చెరపడమే అని కమలానంద భారతి వంటి పండితుల వాదన. ఆర్టికల్ 3 ప్రకారం రాష్ట్రం పేరు మార్చాలంటే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపాలి. అనంతరం పార్లమెంటు ఆమోదంతో రాష్ట్రపతి సంతకం చేయాల్సి ఉంటుంది.ఆంధ్రప్రదేశ్ పేరు మార్పు అనేది కేవలం భావోద్వేగపూరితమైన అంశం మాత్రమే కాదు, అది తెలుగు వారి అస్తిత్వానికి సంబంధించిన చర్చ. ఒకవైపు పురాణ కాలం నాటి ఆంధ్ర పదాన్ని గౌరవించే వారు, మరోవైపు భాషా గుర్తింపు కోసం తెలుగునాడు కావాలనే వారు ? ఈ ఇద్దరి మధ్య జరుగుతున్న ఈ పోరు ప్రస్తుతం ఏం

## కూటమిలో మిత్రుల మధ్యే పోటీ

ఏలూరు, మార్చి 3,

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగకముందే రాజకీయ వాతావరణం వేడెక్కింది. అయితే ఈసారి పోరు అధికార, ప్రతిపక్షాల మధ్య కంటే.. అధికార కూటమిలోని పార్టీల మధ్యే ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ, ఈ ఎన్నికలను బహిష్కరించే యోచనలో ఉందన్న వార్తలు వినిపిస్తుండటంతో, ఇప్పుడు అందరి దృష్టి టీడీపీ–జనసేన–బీజేపీ పొత్తుపైనే పడింది. పైన నేతలు చేతులు కలిపినా, కింద కేడర్ మనసులు కలవడమే ఇప్పుడు అసలైన సవాల్‌గా మారింది.

కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ఈ సారి స్థానిక సంస్థల్లో సింహభాగం ఆశిస్తోంది. ఇటీవల రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ వంటి నేతలు కోనసీమ లాంటి ప్రాంతాల్లో 80 శాతం స్థానాల్లో తామే పోటీ చేస్తామని బహిరంగంగా ప్రకటించడం కూటమిలో కలకలం రేపుతోంది. జనసేన బలంగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఆ పార్టీ కేడర్ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను వదులుకోవడానికి సిద్ధంగా లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే మిత్రపక్షాల మధ్య ఫ్రెండ్లీ కాంటెస్ట్ పేరుతో అంతర్గత పోరు తప్పదని విశ్లేషకులు భావిస్తున్నారుదశాబ్దాలుగా గ్రామస్థాయిలో బలమైన వ్యవస్థ ఉన్న తెలుగుదేశం పార్టీకి, స్థానిక ఎన్నికలు చావో రేవో లాంటివి. తమ గ్రామంలో పట్టు కోల్పోవడానికి ఏ నాయకుడూ ఇష్టపడడు. సీట్ల సర్దుబాటులో భాగంగా తమకు పట్టున్న గ్రామాలను మిత్రపక్షాలకు కేటాయిస్తే, టీడీపీ కేడర్ తిరుగుబాటు చేసే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. పైస్థాయిలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మధ్య ఉన్న సఖ్యత క్షేత్రస్థాయిలో ఓటర్ల బదిలీకి ఎంతవరకు ఉపయోగపడుతుందనేది అసలు ప్రశ్న.జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసీపీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికలకు వెళ్లడం కంటే బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించడం ద్వారా ప్రభుత్వానికి వ్యతిరేకతను ప్రదర్శించాలని భావిస్తోంది. ఒకవేళ వైసీపీ బరిలో లేకపోతే, కూటమిలోని పార్టీలు ఒకరితో ఒకరు పోటీ పడటం ఖాయం. ప్రత్యర్థి లేని పోరాటంలో మిత్రపక్షాల మధ్య వైషమ్యాలు పెరిగి, అది ప్రభుత్వంపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కేవలం ఎమ్మెల్యేల స్థాయిలో కాకుండా, గ్రామ స్థాయిలో కమిటీలు వేసి సీట్ల సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడ ఎవరు బలంగా ఉన్నారో వారికే కేటాయించడం. నియోజకవర్గ స్థాయిలోనే మూడు పార్టీల నేతలతో కమిటీలు వేసి వివాదాలు పరిష్కరించడం. స్థానిక సమస్యలపై కూటమి తరపున ఒకే అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం వంటివి చేయాల్సి ఉంది. కూటమి నాయకత్వం ఈ చిక్కుముళ్లను విడదీయకపోతే, స్థానిక ఎన్నికలు మిత్రపక్షాల మధ్య విద్వేషాలకు దారితీసే ప్రమాదం ఉంది. అధికారాన్ని పంచుకోవడంలో చూపిన పరిణతిని, క్షేత్రస్థాయిలో సీట్ల పంపకంలో కూడా చూపిస్తేనే కూటమి ప్రయోగం విజయవంతమవుతుంది. లేనిపక్షంలో, ప్రత్యర్థి లేకపోయినా సొంత పార్టీల కుమ్ములాటలే కూటమికి అతిపెద్ద శత్రువులుగా మారతాయి.

## ఆదానీ ప్రాజెక్టుకు కండిషన్స్ అప్లై

విజయవాడ, మార్చి 3, (న

ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నాళ్లుగా రాజకీయ దుమారం రేపుతున్న అదానీ సోలార్ పవర్ ఒప్పందంపై చంద్రబాబు ప్రభుత్వం ఒక కీలకమైన, వ్యూహాత్మకమైన నిర్ణయం తీసుకుంది. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కుదుర్చుకున్న ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు కొన్ని కీలకమైన నిబంధనలు విధిస్తూ డీల్‌ను ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధమైంది.తాజా సమాచారం ప్రకారం, చంద్రబాబు ప్రభుత్వం 7,000 మెగావాట్ల పూర్తి స్థాయి ఒప్పందాన్ని కాకుండా, కేవలం 300 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు మాత్రమే ప్రస్తుతానికి అనుమతినిచ్చింది. ఇది ఒకరకంగా అదానీ గ్రూప్‌కు, సెకీ కి షాక్ ఇచ్చే నిర్ణయమే. ఫిబ్రవరి 26న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ప్రస్తుతానికి ఈ పరిమిత స్థాయి కొనుగోలు ద్వారా డీల్‌ను ఆపరేషనల్ మోడ్‌లోకి తెచ్చారు.ఈ ఒప్పందంలో ఏపీ ప్రభుత్వం విధించిన అతి పెద్ద నిబంధన ఏమిటంటే.. అంతర్రాష్ట్ర విద్యుత్ సరఫరా ఛార్జీలు, నష్టాలను రాష్ట్ర ప్రభుత్వం భరించదు. డెలివరీ పాయింట్ వరకు అయ్యే ఈ అదనపు ఖర్చులను సెకీ (రాఇఅఎ) భరించాలని ఏపీ స్పష్టం చేసింది. దీనివల్ల వాణిజ్యపరమైన రిస్క్ అంతా ఇప్పుడు సెకీ మీదే పడనుంది. ఒకవేళ సెకీ దీనికి అంగీకరిస్తేనే ఒప్పందం పూర్తి స్థాయిలో ముందుకు సాగుతుంది.గౌతమ్ అదానీ అప్పట్లో జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తర్వాతే ఈ డీల్ కుదిరిందని, ఇందులో సుమారు రూ. 1,750 కోట్ల ముడుపులు చేతులు మారాయని అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణల నేపథ్యంలోనే చంద్రబాబు ప్రభుత్వం ఈ ఒప్పందాన్ని రద్దు చేసే అంశంపై తీవ్రంగా మల్లగుల్లాలు పడింది. అయితే, ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేస్తే చట్టపరమైన చిక్కులు, భారీ జరిమానాలు పడే అవకాశం ఉండటంతో, ప్రభుత్వం ఈ 'మధ్యేమార్గం' ఎంచుకున్నట్లు కనిపిస్తోంది.నాడు ఈ డీల్‌ను పెద్ద స్కామ్ అని తిట్టిన టీడీపీ, ఇప్పుడు అదే డీల్‌కు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పిస్తోంది. "అప్పుడు లంచాలు అన్నారు కదా, మరి ఇప్పుడు ఏ ప్రాతిపదికన ఒకే చేశారు?" అని వైసీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. దీనికి సమాధానంగా.. తాము ఒప్పందాన్ని గుడ్డిగా అంగీకరించలేదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కఠినమైన షరతులు విధించామని టీడీపీ సమర్థించుకుంటోంది.చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం వెనుక లోతైన రాజకీయ, ఆర్థిక వ్యూహం ఉంది. ట్రాన్స్‌మిషన్ ఛార్జీలను సెకీ మీదకు నెట్టడం ద్వారా రాష్ట్ర ఖజానాపై పడే అదనపు భారాన్ని తగ్గించారు. అదానీపై ఉన్న ముడుపుల ఆరోపణల నేపథ్యంలో డీల్‌ను పూర్తిగా అంగీకరించకుండా, పరిమిత స్థాయికి తగ్గించడం ద్వారా విమర్శల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశారు. డీల్‌ను రద్దు చేసి ఉంటే అంతర్జాతీయ పెట్టుబడిదారుల్లో రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతినే అవకాశం ఉండేది. అది జరగకుండా జాగ్రత్త పడ్డారు.మొత్తానికి, అదానీ పవర్ డీల్ వ్యవహారంలో ఏపీ ప్రభుత్వం వేచి చూసే ధోరణిని అవలంబిస్తూనే, బంతిని సెకీ, అదానీ కోర్టులోకి నెట్టేసింది. ఈ షరతులకు అదానీ గ్రూప్, కేంద్ర సంస్థ సెకీ ఎలా స్పందిస్తాయనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## టమాట రైతుల ఆవేదన

విజయనగరం, మార్చి 3, (

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్నట్టు ఉంది ఏపీలో టమాటా రైతుల వ్యవహారం. పంట గిట్టుబాటు అయినప్పుడు మద్దతు ధర ఉండదు. మద్దతు ధర ఉన్నప్పుడు పంట పండదు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, చీడపీడలు వెరసి రైతు పండిస్తున్న



టమాటాకు సరైన గిట్టుబాటు దక్కడం లేదు. ఇప్పుడు టమాటా పరిస్థితి చూస్తుంటే.. పండించిన రైతు దుస్థితి చూస్తుంటే ప్రతి ఒక్కరికి గుండె తరుక్కుపోతుంది. పంట లేనప్పుడు కిలో 100 రూపాయలు ఉండే టమాటా ధర ప్రస్తుతం రెండు రూపాయలకు పడిపోయింది. కప్పు టీ కి నాలుగో వంతు అన్నమాట. పండించిన పాపానికి టమాటా పారేయలేక.. అమ్ముకోలేక అన్నదాత పడే బాధ అంతా కాదు. నెలరోజుల వ్యవధిలోనే టమాటా రైతు పరిస్థితి తలకిందులైంది.టమాటా పంటకు పెట్టింది పేరు మదనపల్లి. చిత్తూరు జిల్లాలో చాలా ప్రాంతాల్లో టమాటాను ఎక్కువగా పండిస్తారు. అలాగే ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లాలో సైతం ఈ ఏడాది రికార్డు స్థాయిలో పండించారు. అతి పెద్ద మార్కెట్ గా ఉన్న రామభద్రపురంలో ధర లేక టమాటా రైతులు బేల చూపులు చూస్తున్నారు. అయితే గత అనుభవాల దృష్ట్యా ఈసారి టమాటా పంటను అధికంగా వేశారు. గతంలో నష్టాలు అధికంగా రావడంతో.. వాటిని భర్తీ చేసేందుకు గాను ఈసారి పంటను ఎక్కువగా వేసుకున్నారు. దిగుబడి కూడా భారీగా వచ్చింది. ఎకరాకు 15 టన్నుల పంట వస్తుందని అంచనా వేస్తే.. ఏకంగా 20 టన్నుల దిగుబడి రావడం విశేషం. అయితే ఈ దిగుబడిని సాకుగా చూపి తక్కువ ధరకు అడుగుతున్నారు వ్యాపారులు. దీంతో రైతులకు ఏం చేయాలో తెలియడం లేదు. ఆరుగాలం కష్టపడి రైతులు పంటను పండించుకున్నారు. ఎక్కడ సాగుకు మందులు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి సుమారు 50 వేలు వరకు ఖర్చు పెట్టారు. కానీ ప్రస్తుత టమాటా ధరలు చూస్తుంటే కనీసం 20వేల రూపాయల కూడా రాని దుస్థితి. దీంతో తనకు తీవ్ర నష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. కనీసం మార్కెట్ వరకు తీసుకురావడానికి అయ్యే రవాణా ఖర్చులు కూడా దొరకడం లేదు. ఆ రెండు రూపాయల కూడా మిగిలే పరిస్థితి లేదు. దీంతో పంటను కోయలేక రైతులు పొలాల్లోనే వాటిని విడిచిపెట్టారు. కొందరైతే పొలాల్లోనే కుప్పలుగా పోస్తూ వదిలేశారు. విజయనగరం జిల్లా రామభద్రపురం మార్కెట్లో రోజంతా నిరీక్షించినా టమాటా గురించి అడిగే నాధుడే కరువయ్యారని రైతులు చెబుతున్నారు. అయితే ఈ సంక్షోభం నుంచి గట్టెక్కించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

=============

## అమరావతిలో హైకోర్టు జస్టిస్ బంగ్లాలు

విజయవాడ, మార్చి 3,

అమరావతి రాజధాని ప్రాంతంలోని గవర్నమెంట్ కాంప్లెక్స్ లోని సూపర్ బ్లాక్ కె ఎఫ్ ప్రాంతంలో ఈ జస్టిస్ బంగ్లాను నిర్మించారు. ప్రతి బంగ్లా దాదాపు 2019 గజాల విస్తీర్ణలో మొత్తం 775 చదరపు అడుగుల నిర్మాణంతో విస్తృతంగా రూపొందించారు. అన్ని బంగ్లాలు ఒకే వరుసలో చక్కని ప్రణాళికతో నిర్మించారు. అయితే ఇటీవలే భారత ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. న్యాయమూర్తుల హోదాకు తగినట్టుగా ఈ నివాసాల్లో అన్ని అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ప్రతి బంగ్లాను గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ గా నిర్మించారు. విశాలమైన హాల్, బెడ్ రూమ్స్ నూతన టెక్నాలజీ వసతులతో ఈ బిల్డింగులు సిద్ధమయ్యాయి.జస్టిస్ బంగ్లా మధ్యలో సుమారు 1.5 ఎకరాల విస్తీర్ణలో ఒక పెద్ద సెంట్రల్ పార్కును అభివృద్ధి చేస్తున్నారు. పిల్లలు ఆడుకునేందుకు స్థలం, పెద్దల కోసం జిమ్ ఏరియా నరకమార్గాలు ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. చుట్టూ పచ్చదనంతో ప్రశాంత వాతావరణ ఉండేలా ఈ పార్కును ప్లాన్ చేశారు. జస్టిస్ అవసరాల కోసం ప్రత్యేకంగా క్లబ్ హౌస్, గెస్ట్ హౌస్ నిర్మాణానికి కూడా పునాది వేశారు. ఇది సుమారు 6300 గజాల స్థలంలో 50వేల చదరపు అడుగుల విస్తీర్ణతో మూడు అంతస్తులో నిర్మిస్తున్నారు.ఇక పిచ్చుకల పాలెం ప్రాంతంలో జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణం కూడా వేగంగా కొనసాగుతుంది. సుమారు 4.83 ఎకరాల విస్తీర్ణలు ఈ అకాడమీ నిర్మిస్తున్నారు. ఇక్కడ 500 మంది కూర్చోనే ఆడిటోరియం, క్లాస్ రూమ్స్, సెమినార్ హాళ్లు, మూడ్ కోర్టు హాల్, లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఎనిమిది అంతస్తుల హాస్టల్ భవనం కూడా నిర్మిస్తున్నారు. జస్టిస్ సిటీ ప్రాంతం.. ఔ1,ఔ2, ఇ5, ఇ6 రోడ్ల మధ్యలో ఉంది. సీడ్ ఆక్సిస్ రోడ్ నుంచి ఈ ప్రాంతానికి చేరుకునేలా 2.5 కిలోమీటర్ల కొత్త తారు రోడ్లు వేశారు. లోపల 12 మీటర్ల వెడల్పుతో అంతర్గత రోడ్లు ఏర్పాటు చేశారు. మొత్తంగా చూస్తే ఒకప్పుడు గ్రాఫిక్స్ అని విమర్శించిన అమరావతి ఇప్పుడు నిజమైన కట్టడాలతో తన ఉనికిని చాటుకుంటుంది. జస్టిస్ సిటీలో జస్టిస్ బంగ్లాల ప్రారంభం రాజధాని అభివృద్ధిలో మరో కీలక ముందడుగుగా మారింది.

## గల్ఫ్ దేశాల్లో ఇండియన్స్ కోసం భారత్ వ్యూహాలు

న్యూఢిల్లీ, మార్చి 3, (

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధ వాతావణం నెలకొంది. దీంతో గల్ఫ్ దేశాల్లో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. వాళ్ల చదువులకు ఆటంకం ఏర్పడటమే కాకా భద్రతాపరంగా ముప్పును ఎదుర్కొంటున్నారు. 2025 నాటి గణాంకాల ప్రకారం 150 దేశాల్లోని యూనివర్సిటీలు, స్కూళ్లలో మొత్తంగా 18.80 లక్షల మంది భారతీయు విద్యార్థులు చదువుకుంటున్నారు. వీళ్లలో పశ్చిమాసియాలోనే దాదాపు 5 లక్షల మంది ఇండియన్ స్టూడెంట్స్ ఉన్నారు. ఈ ప్రాంతంలో దాదాపు లక్షల మంది భారతీయులు నివసిస్తున్నారు. దీంతో ఇక్కడ భారతీయులకు అనుగుణంగా ఉండే సిలబస్‌నే బోధిస్తారు. అందుకే భారతీయ విద్యార్థులు ఇక్కడ చదవుకునేందుకు ప్రాధాన్యం చూపిస్తారుకేంద్ర గణాంకాల ప్రకారం చూసుకుంటే జంఇలో అత్యధికంగా 2,53,832 మంది భారతీయ విద్యార్థులు చదువుకుంటున్నారు. తర్వాతి స్థానాల్లో సౌదీ అరేబియా (75,830), కువైట్(50,000), ఖతార్(49,346), ఒమన్ (44,847), బహ్రెయిన్ (28,620), ఇజ్రాయెల్(900) దేశాలు ఉన్నాయి. దాదాపు 5 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఈ దేశాల్లో చదువుకుంటున్నారు. అక్కడ మార్చి 2న 10వ తరగతి, 12వ తరగతి సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు జరగాల్సి ఉంది. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వాటిని కూడా వాయిదా వేశారు. మరోవైపు ఉపాధి కోసం పశ్చిమాసియాకు వచ్చిన భారతీయుల సంఖ్య దాదాపు 80 లక్షలు ఉంటుంది

==========================

# త్రిశూల్ వ్యూహంతో అమెరికా ఇజ్రాయిల్

న్యూఢిల్లీ, మార్చి 3, స్)

యుద్ధం అంటే గగనతలంలో గర్జించే జెట్లు, నేలపై పేలే బాంబులు అనుకుంటాం. కానీ ఈసారి కథ అక్కడి నుంచి మొదలుకాలేదు. ఇరాన్‌పై దాడి చేయాలనుకున్న ఇజ్రాయెల్–అమెరికా అద్భుతమైన స్కెచ్ వేశాయి. బాంబర్లు, జెట్లు ఇలా దాడిచేస్తే.. ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ వారిని అడ్డుకుంటుందని తెలుసు. ఇందుకోసం మూడంచెల వ్యూహాన్ని అమలు చేశాయి. అసలు యుద్ధం మొదలైంది ఆకాశంలో కాదు... రాడార్ స్క్రీన్‌లపైనే.. ఇజ్రాయెల్–అమెరికా చేపట్టిన సైబర్, డెకాయ్, ఎయిర్ అటాక్‌లకు ఇరాన్ బిత్తరపోయింది. ఆధునిక వార్‌ఫేర్ ఏలా మారిపోతోందో ఈ అటాక్ కళ్లకు కట్టింది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ఎందుకు పనిచేయలేకపోయింది? సూటిగా చెప్పాలంటే ? ప్రత్యర్థి సాంకేతిక సామర్థ్యం పూర్తిగా ఇరాన్‌కు అందనంత స్థాయిలో ఉంది. ఇరాన్ ఎయిర్ డిఫెన్స్‌ను చేధించడం కోసం యుఎస్ సైబర్ వార్‌ఫేర్‌ను ఉపయోగించింది. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్, సైబర్ ఆపరేషన్లు కలిసి రాడార్‌లలోకి నకిలీ డేటాను పంపించాయి. అంటే పదుల సంఖ్యలో యుద్ధ విమానాలు ఇరాన్ వైపు దూసుకొస్తున్నట్లుగా స్క్రీన్‌పై కనిపిస్తుంది. కానీ అవన్నీ వాస్తవాలు కావు. ఇరాన్‌లోని స్వదేశీ బావర్ వ్యవస్థలైనా, రష్యా నుంచి వచ్చిన ఎస్–300, ఎస్–400 బ్యాటరీలైనా ? ఒకేసారి వచ్చిన డిజిటల్ దాడిని తట్టుకోలేకపోయాయి. రాడార్ ఆపరేటర్‌కు ఏది నిజం? ఏది మోసం? అర్థం కాని పరిస్థితి. ఇదే సమయంలో వందల సంఖ్యలో డీకాయ్ డ్రోన్లు ప్రయోగించారు. ఇవి చిన్నవే. కానీ రాడార్‌కు మాత్రం ఎఫ్–15లు, ఎఫ్–16ల పెద్ద స్క్వాడ్రన్‌లా కనిపిస్తాయి. టెహ్రాన్ వైపు భారీ దళం దూసుకొస్తున్నట్టే సిగ్నల్ వస్తుంది. ఇక ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ పూర్తిగా వాళ్ల వెంట పడుతుంది. డెకాయి డ్రోన్లను డీల్ చేయడంలో ఇరాన్ ఎయిర్‌డిఫెన్స్ సిస్టమ్ బిజీగా ఉన్న సమయంలోనే ఎఫ్–35, ఎఫ్–22లు ఇరాన్ భూభాగంపైకి వెళ్తాయి. అసలేం జరుగుతుందో ఇరాన్‌కు అర్థమయ్యే లోపు వారి రక్షణ ముఖద్వారం బద్ధలైపోయింది.

మొదటి దశ: టెహ్రాన్, ఇలామ్, ఖుజెస్టాన్ ప్రాంతాల్లోని సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ సైట్లు, రాడార్ స్టేషన్లు, గాలి రక్షణ హెడ్‌క్వార్టర్స్‌ను టార్గెట్ చేశారు.

రెండో దశ: బ్యాలిస్టిక్ మిస్సైల్ లాంచర్లు, నిల్వ కేంద్రాలపై దాడులు.

మూడో దశ: సైనిక తయారీ పరిశ్రమలపై దృష్టి. దీర్ఘకాల యుద్ధ సామర్థ్యాన్ని బలహీనపరచడం లక్ష్యం.

ఇక అసలైన భౌతిక దాడి సముద్రంపై నుంచి మొదలైంది. ఇరాన్‌కు దగ్గరలో ఉన్న అమెరికన్ మిస్సైల్స్ పైకి లేచాయి. ఇవి శత్రు రాడార్‌లకు దొరక్కుండా చాలా తక్కువ ఎత్తులో దూసుకెళ్లాయి. అంతకుముందే ఎఫ్–35, ఎఫ్–22 రాప్టర్లు వెళ్లడంతో అప్పటికే రాడార్‌లపై తప్పుడు లక్ష్యాలు, ఎలక్ట్రానిక్ జ్యామింగ్ ? ఈ కలయికతో ఎయిర్ డిఫెన్స్ నెట్‌వర్క్ విచ్ఛిన్నం అయింది. ఆ సమయంలో చాలా తక్కువ ఎత్తులో వచ్చి టామ్‌హాక్స్ ఎస్–300, ఎస్–400 రాడార్ సైట్లు, కమాండ్ బంకర్లపై దాడి చేశాయి. సో.. శత్రుదేశాల ఎటాక్స్‌ను డేగకళ్లతో పర్యవేక్షించే డిఫెన్స్ సిస్టమ్‌కు కళ్లే లేకుండా పోయాయి. ఇరాన్ గగనతలంపైకి తమ ఫైటర్‌జెట్లు దూసుకువెళ్లేలా సేఫ్ కారిడార్‌ను విజయవంతంగా సృష్టించిన తర్వాత అసలు కథ మొదలైంది.

ఎయిర్‌డిఫెన్స్, మిలటరీ స్థావరాలను ధ్వంసం చేశాక.. ఇక మిగిలిన లక్ష్యాలను చేధించడానికి బాంబర్స్ వచ్చేశాయి. అవి ఒకేసారి జెడామ్ బాంబులు, మిస్సైళ్లను తీసుకెళ్లగలవు. ఇందుకోసం ః–2 స్పిరిట్ స్టెల్త్ బాంబర్లను తెచ్చారు. ఇవి భూమి మీదనే కాదు.. భూమిలోపల ఉండే బంకర్లను కూడా ధ్వంసం చేయగలుగుతాయి. అదే సమయంలో జోర్డాన్, యూఏఈ లోని అమెరికన్ బేస్‌ల నుంచి.. ఎఫ్–15ఇ స్ట్రయిక్ ఈగల్స్ దూసుకొచ్చాయి. ఒక్కో జెట్ 19 జెడామ్ లు లేదా 28 చిన్న డయామీటర్ బాంబులు మోసుకెళ్లగలదు. ఇవి ప్రధానంగా మూవింగ్ టార్గెట్స్ ను చేధిస్తాయి. అంటే వాహనాలపై నుంచి ప్రయోగించే సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్స్ సిస్టమ్‌ను గుర్తించి దానని ధ్వంసం చేస్తుందన్నమాట.. లోయల్లో దాగి ఉన్న మొబైల్ మిస్సైల్ లాంచర్లు, కమాండ్ సెంటర్లపై దాడులు జరిపాయి. ఎంతగా ప్లాన్ చేశారు అంటే ఒకసారి దాడి చేసిన తర్వాత ఇవి తిరిగి వెళ్లవు. మళ్లీ దాడి చేయడానికి వీలుగా వీటికి ఆకాశంలోనే ఇంధనాన్ని నింపే కూడా చేశారు. అందుకే ఇంధనాన్ని నింపుకుని వచ్చి మళ్లీ మళ్లీ దాడులు చేశాయి. ఇజ్రాయెల్, యుఎస్ అంత కచ్చితమైన స్కెచ్ వేశాయి. ఓ పక్క వైమానిక దళం డిస్ట్రక్షన్ చేసేస్తుంటే.. దానికి సపోర్ట్‌గా యూ ఎస్ నేవీ రంగంలోకి వచ్చింది. రెండు గంటల తర్వాత జూ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్‌లు అరేబియా సముద్రం నుంచి ఆపరేషన్ మొదలుపెట్టింది. దూరంగా ఉన్న అమెరికాను ఏం చేయలేక యుఎస్ మిత్రదేశాలపై దాడులు మొదలు పెట్టింది. యూఏఈలోని ఎయిర్ బేస్ పై దాడి చేశారు. బహ్రెయిన్‌లోని యూఎస్ నేవీ ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయాన్ని కూడా టార్గెట్ చేశారు. సోమవారం సాయంత్రానికి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ కార్యాలయంపై కూడా దాడి చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. డికాయ్ ఆపరేషన్స్, సైబర్ ఎటాక్, వంటివి ఫ్యూచర్ వార్‌ఫేర్‌లో ఏ రీతిలో ప్రాధాన్యం వహిస్తున్నాయో ఈ ఆపరేషన్ చెబుతోంది.

# ఫీజుల నియంత్రణకు కసరత్తు..

హైదరాబాద్, మార్చి 3,

ప్రస్తుత కాలంలో పిల్లల స్కూల్ ఫీజులు తల్లిదండ్రులకు మోయలేని భారంగా మారిపోతున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీలకే లక్షలకు లక్షలు డొనేషన్లు, ఫీజులు వసూళ్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. దీంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు ప్రైవేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల నియంత్రణపై చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్కూళ్ల పరిస్థితి.. అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అక్కడ అందున్న విద్యాబోధన తదితర అంశాలను, ఆ పాఠశాలకు సంబంధించి గత రికార్డులను బేరీజు వేసుకొని ఫీజులను నిర్ణయించేందుకు సర్కార్ సిద్ధమైంది. తెలంగాణ వ్యాప్తంగా 11వేల ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. మరో నెల రోజుల్లో 2025–26 విద్యా సంవత్సరం ముగియనుంది. వచ్చే విద్యా సంవత్సరంకు సంబంధించి పలు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభంకానున్నాయి. అయితే, కొన్ని పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచే ఆనవాయితీకి బ్రేక్ వేస్తూ.. శాస్త్రీయంగా ఫీజులను నిర్ణయించే ప్రక్రియను స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వేగవంతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ప్రస్తుతం వసూలు చేస్తున్న ఫీజులు, గత మూడేళ్ల ఆదాయ, వ్యయాల వివరాలను సేకరించాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ప్రతి రెండేళ్లకోసారి 8శాతం మాత్రమే ఫీజు పెంచుకునేలా ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన విధివిధానాలపై కసరత్తు ముమ్మరమైంది. ఎంఈవోలు, డీఈవోల ద్వారా ఏ స్కూళ్లో ఎంత ఫీజు ఉంది..? ఏఏ క్లాసులకు ఎంతెంత తీసుకుంటున్నారు..? అనే వివరాలను ప్రభుత్వం సేకరిస్తోంది. ప్రైవేటు స్కూళ్లలో దేని ఆధారంగా బేస్ ఫీజులను నిర్ణయించాలనేదానిపై అధికారులు కసరత్తు చేశారు. ఆయా స్కూళ్ల నిర్వహణ ఖర్చుల ఆధారంగానే స్కూళ్ల ఫీజులు ఉండాలని విద్యాశాఖ భావిస్తోంది. దీనికోసం గత మూడేళ్ల ఆడిట్ రిపోర్టులు, టీచర్ల జీతాలు, ఇతర నిర్వహణ ఖర్చులను పరిగణలోకి తీసుకోనున్నారు. ఈ లెక్కల ఆధారంగానే ఒక బేస్ ఫీజును నిర్ణయిస్తారు. దానికి తగ్గట్టుగా తర్వాతి రెండేళ్ల ఫీజు డిసైడ్ చేయనున్నారు. విద్యాశాఖపై తాజాగా సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణకు విశ్రాంత న్యాయమూర్తి లేదా ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాట్లు చేస్తామని అన్నారు. నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు సంబంధిత సొమ్మును విద్యా సంస్థల నుంచి తిరిగి రాబట్టేలా చూడాలని నిర్దేశించారు. ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. మరోవైపు.. ఫీజుల నియంత్రణ పక్కాగా అమలు చేసేందుకు స్టేట్ లెవల్ ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీకి చైర్మన్‌గా హైకోర్టు రిటైర్డ్ జడ్జిని గానీ, రిటైర్డ్ చీఫ్ సెక్రటరీనిగాని నియమించాలని ప్రభుత్వం డిసైడ్ అయింది. కాగా వచ్చే విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణను చేపట్టాలని ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేపట్టింది.

# రాజ్యసభ రేసులో 12 మంది




హైదరాబాద్, మార్చి 3, (న్యూస్ పల్స్)

తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల కోసం తీవ్ర పోటీనే నడుస్తోంది. దాదాపు డజను మంది నేతలు రేసులో ఉన్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడు, రాజకీయ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డిలు పోటీ పడుతున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు, ఈరవత్రి అనిల్ కుమార్, మహిళా కోటాలో ఇటీవలే ఉమెన్ కమిషన్ ఛైర్మన్‌గా పదవీకాలం పూర్తి చేసుకున్న నేరెళ్ల శారదలు ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి బెల్లయ్య నాయక్, దొమ్మాటి సాంబయ్య, మైనారిటీ నుండి అజ్మతుల్లా హుస్సేన్ ఉన్నారు. కమ్మ సామాజికవర్గం నుంచి కుసుమకుమార్ ఢిల్లీ స్థాయిలో పైరవీ చేస్తున్నారు. ఖాళీ అవుతున్న రెండు సీట్లలో ఒకటి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, సుప్రీంకోర్టు అడ్వకేట్ అభిషేక్ మను సింఘ్వీకి ఇవ్వాలని హైకమాండ్ ఎప్పుడో డిసైడ్ అయిందంటున్నారు. ఇప్పటికే తెలంగాణ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయనను కంటిన్యూ చేయడం ఖాయమైపోయింది. ఇక రెండో సీటు కోసం పోటీ మామూలుగా లేదు. అయితే ఈ సీటు కూడా ఇప్పటికే పార్టీ అధిష్టానం డిసైడ్ చేసిందనే చర్చ పార్టీలో జోరుగా వినిపిస్తోంది. రెండో రాజ్యసభ సీటుకు పార్టీ అధిష్టానం వంశీచంద్ రెడ్డి పేరును ప్రతిపాదిస్తోందట. వంశీచంద్ గత పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. పార్టీ పాలసీ ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసిన వారికి మళ్లీ పదవులు ఇవ్వొద్దని..టికెట్ త్యాగం చేసిన వారికే ప్రయారిటీ ఇవ్వాలని ఒక నిర్ణయం తీసుకున్నారు. కానీ వంశీచంద్ పేరును అధిష్టానం ప్రపోజ్ చేసేసరికి..రాష్ట్ర నాయకత్వం గతంలో అనుకున్న విషయాన్ని తెరపైకి తెచ్చిందట. అయితే వంశీచంద్‌కు ఇవ్వాలంటూ ఏకంగా ఏఐసీసీ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీనే సూచిస్తుండటంతో రాష్ట్ర నాయకత్వం కూడా ఏమీ చేయలేని పరిస్థితుల్లో పడిపోయిందట. తన విషయంలో రాష్ట్ర నాయకత్వం సహకరించదనే ఆలోచనతో..వంశీ..ప్రియాంక గాంధీతో చెప్పిస్తున్నారని హస్తం పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పార్టీకి జాతీయ స్థాయిలో వంశీ అవసరాలున్నాయని..రాజ్యసభ ఎంపీగా ఉంటే పార్టీకి మరింత ఉపయోగం ఉంటుందని ప్రియాంక గాంధీ చెబుతున్నారట. గతంలో జగిత్యాల ఎమ్మెల్యేగా ఓడిన జీవన్‌రెడ్డికి ఎంపీ సీటు ఇవ్వలేదా అంటూ గుర్తు చేస్తున్నారట హస్తం పార్టీ పెద్దలు. రాజ్యసభ రేసులోకి వంశీచంద్ రావడంతో..కొత్త కొత్త ఆశావహులు తెరమీదకు వస్తున్నారట. వంశీచంద్‌ను సాకుగా చూపి..గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన నేతల్లో చాలామంది రాజ్యసభ సీటు కోసం..తమ పేరును పరిశీలించాలని విజ్ఞప్తులు చేస్తున్నారట. ఇదే విషయాన్ని రాష్ట్ర నాయకత్వం పార్టీ అధిష్టానానికి చెబుతున్నా.. ప్రియాంకగాంధీ ససేమిరా అంటున్నారట. పార్టీకి ప్రస్తుతం దేశవ్యాప్తంగా డీసీసీల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్నందున వంశీకి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. అలా తెలంగాణ నుంచి ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ సీట్లను భర్తీ చేసేందుకు..కాంగ్రెస్ అధిష్టానమే ఇప్పటికే అభ్యర్థులను ఫైనల్ చేసిందన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనందున..నామినేషన్ల గడువులోపు ఈక్వేషన్లు ఏమైనా మారుతాయా? లేక అభిషేక్ మను సింఘ్వీ, వంశీచంద్‌రెడ్డి పేర్లు ఫైనల్ అయినట్లేనా అన్నది చూడాలి.

# గుడిసెల కూల్చివేత చుట్టూ రాజకీయ దుమారం

ఖమ్మం, మార్చి 3,

ఖమ్మంలోని వెలుగుమట్ల భూదాన్ భూముల్లో ఉన్న పేదల ఇళ్ల కూల్చివేత పొలిటికల్ హైడ్రామాకు దారితీసింది. భూదాన్ భూములు రెవెన్యూశాఖ పరిధిలో ఉంటాయి. అందులో కూల్చివేతలు చేపడితే..సంబంధిత శాఖ మంత్రికి సమాచారం ఉంటుంది. పైగా రెవెన్యూ శాఖ మంత్రి ఖమ్మం జిల్లాకే చెందిన మినిస్టర్. దీంతో పలువురు ప్రజా సంఘాల నేతలు భూదాన్ భూముల్లో కూల్చివేతలపై మంత్రి పొంగులేటి దృష్టికి




తీసుకెళ్లారట. అయితే కూల్చివేతల విషయం తనకు తెలియదని..ఖమ్మం కలెక్టర్‌కు ఫోన్ చేసి ఆరా తీశారట మంత్రి పొంగులేటి. దీంతో రెవెన్యూ శాఖ మంత్రి, పైగా జిల్లా మినిస్టర్ పొంగులేటికి తెలియకుండా కూల్చివేతలు చేపట్టే అవకాశం ఉంటుందా అన్న చర్చ జరుగుతోంది. అలా అయితే పొంగులేటిని కాదని కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? అధికారులే సొంత నిర్ణయం తీసుకుని డిమాలిషన్ చేశారా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వెలుగుమట్ల ప్రాంతంలో గజం లక్షల రూపాయలు, ఎకరం కోట్ల రూపాయలు పలుకుతుందట. ఆ ప్రాంతంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరులకు భూములు ఉన్నాయని..లేదు మంత్రి పొంగులేటి సంబంధికులకే అక్కడ ల్యాండ్స్ ఉన్నాయని మరొకరు ఆరోపణలు చేసుకుంటుడం చర్చకు దారితీస్తోంది. తమ ల్యాండ్ పక్కనే భూదాన్ భూముల్లో పేదలు గుడిసెలు ఉంటే..తమ భూముల ధర పడిపోతుందనే సాకుతో ఆ భూముల్లో ఉంటున్న పేదల ఇళ్లను తొలిగించారనే ఆరోపణలు రాజకీయ దుమారాన్ని లేపుతున్నాయి. అయితే పేదల ఇళ్ల తొలగింపుకు మంత్రికి ఎటువంటి సంబంధం లేదని తుమ్మల అనుచరులు కొట్టిపారేస్తున్నారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై రాజకీయ జోక్యం ఎలా ఉంటుందని ఎదరు ప్రశ్నలు వేస్తున్నారట. కూల్చివేతలపై తనకు సమాచారమే లేదని పొంగులేటి చెబుతున్నారు. ఖమ్మం జిల్లాలోనే ముగ్గురు మంత్రులు ఉన్నారు. వీరిలో అందరికి కీలకమైన మంత్రి పదవులే ఉన్నాయి. అయితే పాలేరు ఎమ్మెల్యే, రెవన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెవన్యూ శాఖ మంత్రికి తెలియకుండా భూదాన్ భూముల్లో కూల్చివేతలు సాధ్యమేనా.? అన్న డౌట్స్ వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలు కూల్చివేతపై సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మంత్రి పొంగులేటిని ప్రశ్నించారు. కలెక్టర్ అనుదీప్‌కు ఫోన్ చేసి పేదల ఇళ్ల కూల్చివేతపై సీరియస్ అయ్యారు పొంగులేటి. తన శాఖకు సంబంధించి తనకు తెలియకుండా ఎలా కూల్చివేస్తారు..ఇదేం పద్దతి అంటూ మండిపడ్డారు. ఇళ్లు కూల్చివేసిన భూదాన్ భూములు ఖమ్మం నియోజకవర్గ పరిధిలో ఉన్నాయని..ఖమ్మం నియోజకవర్గం మంత్రి తుమ్మలది కాబట్టి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొస్తున్నారట మంత్రి పొంగులేటి. ఇళ్లు కూల్చివేసిన తర్వాత పలు రాజకీయ పార్టీలు రంగంలోకి దిగాయి. ఘటనాస్థలిని సందర్శించి ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్నాయి. అధికార పార్టీ మాత్రం తమకు ఎటువంటి సంబంధం లేదు..కోర్టు తీర్పును అధికారులు అమలు చేశారని చెప్పుకొస్తోంది. మంత్రి పొంగులేటి తనకేం సంబంధం లేదంటూ కలెక్టర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఇటు తుమ్మలకు సంబంధం లేదని ఆయన అనుచరులు చెబుతున్నారు. అలాంటప్పుడు భూదాన్ భూముల్లో కూల్చివేతలకు ఆదేశాలు ఇచ్చిందెవరు.? రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటికి తెలియకుండానే డిమాలిషన్ చేపట్టారా.? తుమ్మల ప్రమేయం ఉందా? లేక ఆయన నియోజకవర్గ పరిధిలో కూల్చివేతలు జరిగాయి కాబట్టి అలిగేషన్స్ వస్తున్నాయా? అధికారులే కోర్టు ఆర్డర్స్ ప్రకారం ముందుకెళ్లారా అన్నది హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికైతే కూల్చివేతల వెనుక ఎవరున్నరన్నది క్లారిటీ లేదు. కాకపోతే ఖమ్మం జిల్లా మంత్రుల మధ్య మాత్రం కూల్చివేతలు కొత్త చిచ్చు పెట్టినట్లు అయిందన్న చర్చ జరుగుతోంది. భూదాన్ భూముల్లో పేదల కూల్చివేత ఇష్యూ ఎటుదారితీస్తుందో చూడాలి మరి.

# వరంగల్ క్రికెట్ ప్రేమికులకు తీపి కబురు

వరంగల్, మార్చి 3,

వరంగల్ జిల్లాలోని క్రికెట్ ప్రేమికులకు, యువతకు గుడ్‌న్యూస్. త్వరలోనే అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియం అందుబాటులోకి రానుంది. ఈ మేరకు చురుగ్గా పనులు జరుగుతున్నాయని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మె?ల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులో ఈ స్టేడియం అందుబాటులోకి రానుందని చెప్పారు. క్రికెట్ స్టేడియం అందుబాటులోకి వస్తే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా జరిగే ఛాన్స్ ఉందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. తెలంగాణను దేశపు క్రీడా రాజధాని మార్చడమే లక్ష్యంగా సీఎం రేవంత్.. తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ 2025ను ప్రవేశపెట్టారు. ఈ పాలసీలో భాగంగా 2036 ఒలింపిక్స్‌లో మన రాష్ట్ర క్రీడాకారులు పతకాలు సాధించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్ గచ్చిబౌలిలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నారు. దీని కోసం సుమారు 200 ఎకరాల భూమిని కేటాయించారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు, ప్రతి లోక్‌సభ నియోజకవర్గంలో స్పోర్ట్స్ స్కూల్స్ నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా.. వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు రెడీ అయ్యారు. ఈ విషయాన్ని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. త్వరలోనే జిల్లాకు క్రికెట్ స్టేడియం వస్తుందని చెప్పారు. జిల్లాలో క్రికెట్ స్టేడియం ఆవశ్యకతను సీఎం రేవంత్ రెడ్డికి వివరించగా.. ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే కడియం తెలిపారు. ప్రస్తుతం స్టేడియం నిర్మాణానికి సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఉందని అన్నారు.

కాగా, జిల్లా యువత చాలా కాలంగా క్రికెట్ స్టేడియం కోసం ఎదురు చూస్తోంది. ఈ మేరకు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి నేతృత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు ఈ విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల శివారులోని 163 నేషనల్ హైవేకు సమీపంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా)కు భూమి ఉంది. దీంతో ఆ ప్రాంతంలోనే స్టేడియం నిర్మాణం చేపడితే అనుకూలంగా ఉంటుందనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. దీంతో కుడా పరిధిలోని 30 ఎకరాల భూమి వివరాలను ఎమ్మెల్యేలు, ఎంపీలు రాష్ట్ర స్పోర్ట్స్ అండ్ యూత్ సర్వీసెస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేశ్‌రంజన్‌కు అందజేశారు. ప్రస్తుతం ఈ ఫైల్ పెండింగ్‌లో ఉండగా.. త్వరలోనే స్టేడియం నిర్మాణానికి అనుమతులు రానున్నాయి. అదే జరిగితే క్రికెట్ ప్రేమికుల చిరకాల కోరిక తీరనుంది. వరంగల్ కేంద్రంగా అంతర్జాతీయస్థాయి మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చే ఛాన్స్ ఉంటుంది.

# యాదాద్రి ఆలయం మూసివేత

యాదాద్రి మార్చి 3,

చంద్రగ్రహణం సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయ ద్వారాలు మూసివేసారు. మంగళవారం ఉదయం 7 గంటల నుండి మరుసటి రోజు 8.45 ని. వరకు భక్తులకు దర్శనాలు నిలిపివేసారు. మంగళవారం మధ్యాహ్నం3.30 నిమిషాల నుండి సాయంత్రం 6:47 చంద్రగ్రహణం వున్న నేపథ్యంలో మార్చి 4 న ఉదయం 3.30 కు యాదాద్రి ఆలయ ప్రధాన ద్వారాలు తెరుచుకోనున్నాయి. ఆలయ శుద్ధి సంప్రోక్షణ కార్యక్రమం తరువాత ఉదయనీ 8.45 ని నుండి భక్తులకు సర్వ దర్శనాల పునరుద్ధరణ వుంటుంది.

# పిల్లలను చంపి తల్లి సూసైడ్

యాదాద్రి భువనగిరి మార్చి 3,

ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుంది. బీబీనగర్ మండలం గొల్లగూడెంలో తెల్లవారుజామున ఘోరం జరిగింది. వివాహిత తన ఇద్దరు పిల్లలను చంపి, అనంతరం తాను ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో గ్రామస్థులు ఒక్కసారిగాగ్భ్రాంతికి గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే కారణమా లేక మరేదైనా సమస్య ఉందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అక్రమ రవాణా అవుతున్న రేషన్ బియ్యం పట్టివేత

ఏలూరు మార్చి 3,

ఏలూరు రూరల్ మండలం, తంగెళ్ల మూడి పంచాయతి పరిధి లో రత్నాస్ దాభా బిల్డింగ్ అశోక్ లైలాండ్ 14 చక్రాల లారీ ఆపి విజిలెన్సు, రెవిన్యూ, పౌర సరఫరా అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసారు. లారీలో 25.80 టన్నులు రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుచున్నట్లుగా గుర్తించారు. బియ్యను స్వాధీనం చేసుకున్నారు.

# ఇరాన్ పార్లమెంట్పై ఇజ్రాయెల్ దాడి


న్యూఢిల్లీ మార్చి 3,

ఇరాన్?ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న యుద్ధం మరింత ఉధృతమైంది. ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ పార్లమెంట్ భవనం లక్ష్యంగా మారినట్లు సమాచారం. దీనికి ప్రతిగా ఇరాన్ క్షిపణి, డ్రోన్ దాడులతో జోర్డాన్, కువైట్, ఇజ్రాయెల్లోని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని దాడులకు తెగబడింది. ఇక రియాద్లోని అమెరికా ఎంబసీపై కూడా ఇరాన్ దాడి చేసింది. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి.

# తమ్మినేనిపై వేటు

హైదరాబాద్, మార్చి 3, (

తెలంగాణకు చెందిన సీపీఎం సీనియర్ నేత, పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంపై ఆ పార్టీ కేంద్ర కమిటీ క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. ఆయన్ను అభిశంసిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. 2024లో జరిగిన రాష్ట్ర పార్టీ నూతన కార్యదర్శి ఎన్నికల సమయంలో ఆయన అనుసరించిన తప్పుడు రాజకీయ వైఖరి, పార్టీ నిబంధనల ఉల్లంఘనలే ఈ చర్యకు కారణంగా పేర్కొంది.రాష్ట్ర కార్యదర్శి ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యయుత చర్చకు బదులుగా లాబీయింగ్, ప్రలోభాలు, అస్తిత్వవాద రాజకీయాలు నడిచాయని కేంద్ర కమిటీ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాలతో పార్టీ రాష్ట్ర కమిటీ నిట్టనిలువునా చీలిపోయిందని, ముఠాతత్వం ఆందోళనకర స్థాయికి చేరిందని తన నివేదికలో స్పష్టం చేసింది. పార్టీలో ఐక్యతను నెలకొల్పేందుకు పొలిట్బ్యూరో సభ్యులు చేసిన ప్రయత్నాలు



ఫలించలేదని, తమ్మినేని సహా నాయకత్వంలోని ఒక వర్గం వెనక్కి తగ్గడానికి నిరాకరించిందని తెలిపింది.సీనియర్ నాయకులే తెరవెనుక మంత్రాంగాలు, ప్రచారాలు చేయడం పార్టీ సంప్రదాయాలకు పూర్తి విరుద్ధమని కేంద్ర కమిటీ దుయ్యబట్టింది. ఈ పరిణామాలపై తమ్మినేని వీరభద్రంతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు సైలాబ్బాబు, ప్రసాద్ల నుంచి వివరణ కోరినట్లు వెల్లడించింది. అయితే, వారు సమర్పించిన వివరణలు అసమగ్రంగా ఉండటంతో పాటు వాటిలో ఆత్మవిమర్శ లోపించిందని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే ముగ్గురినీ అభిశంసిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈ చర్యతో తెలంగాణ సీపీఎంలో నెలకొన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి.

# సనత్నగర్ టిమ్స్లో 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్

హైదరాబాద్, మార్చి 3,

తెలంగాణ ప్రభుత్వం సనత్నగర్ టిమ్స్ హాస్పిటల్ను ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 1000 పడకల సామర్థ్యంతో ఈ హాస్పిటల్ నిర్మిస్తుండగా.. ఉగాది నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక టిమ్స్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నారు. పేషెంట్లకు సత్వర వైద్యం అందించేందుకు న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్కు ఏర్పాటు చేస్తున్నారు. ఓ గవర్నమెంట్ హాస్పిటల్లో ఇటువంటి టెక్నాలజీ తీసుకురావటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి.తెలంగాణలోని నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందించే లక్ష్యంతో హైదరాబాద్ సనత్నగర్లో ప్రభుత్వం తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ హాస్పిటల్ ప్రారంభానికి ఇటీవల ముహుర్తం కూడా ఖరారు చేశారు. ఉగాది పండుగ రోజున అంటే మార్చి 19న ఈ ప్రతిష్టాత్మక 1000 పడకల ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలకు అంకితం చేయాలని ప్రభుత్వం డిసైడ్ అయింది.ఈలోగా సివిల్ పనులు, ఎక్విప్మెంట్ ట్రయల్స్ అన్నీ పూర్తి చేసి హాస్పిటల్ను వైద్య సేవలు అందించేందుకు సిద్ధం చేయాలని ఇప్పటికే ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ఇక టిమ్స్ హాస్పిటల్ అందుబాటులోకి వస్తే తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో ఒక సరికొత్త అధ్యాయం మొదలుకానుంది. టిమ్స్ ఆసుపత్రిలో అత్యాధునిక 'న్యూమాటిక్ ట్యూబ్ సిస్టమ్' అందుబాటులోకి రానుంది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ తరహా సాంకేతికతను ప్రవేశపెట్టడం రాష్ట్రంలోనే ఇదే తొలిసారిసాధారణంగా కార్పొరేట్ ఆసుపత్రుల్లో కనిపించే ఈ విధానంలో గాలి పీడనం ద్వారా పనిచేసే పైప్లైన్ నెట్వర్క్ ఉ ంటుంది. దీని ద్వారా బ్లడ్ శాంపిల్స్ లేదా ఇతర మెడికల్ శాంపిల్స్ను హాస్పిటల్లోని ఒక విభాగం నుంచి మరొక విభాగానికి సెకన్ల వ్యవధిలో చేరవేయవచ్చు. అత్యవసర సమయాల్లో సిబ్బంది స్వయంగా ల్యాబ్కు వెళ్లాల్సిన అవసరం లేకుండా, నిర్దేశిత స్టేషన్లలో శాంపిల్స్ ఉంచితే అవి నేరుగా ల్యాబ్కు చేరుకుంటాయి. ల్యాబ్ టెక్నీషియన్లు వెంటనే టెస్టులు నిర్వహించి, డిజిటల్ రూపంలో రిపోర్టులను క్షణాల వ్యవధిలోనే డాక్టర్లకు పంపుతారు. దీనివల్ల రోగుల నిరీక్షణ సమయం గణనీయంగా తగ్గుతుంది.ముఖ్యంగా యాక్సిడెంట్లు, గుండెపోటు వంటి అత్యవసర సమయాల్లో లేదా ఆపరేషన్ థియేటర్లలో రోగికి రక్తం ఎక్కించాల్సి వచ్చినప్పుడు ఈ వ్యవస్థ ప్రాణదాతగా మారుతుంది. తక్కువ సమయంలోనే క్లినికల్ నిర్ణయాలు తీసుకునేందుకు ఇది డాక్టర్లకు తోడ్పడుతుందని టిమ్స్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ మహబూబ్ ఖాన్ వెల్లడించారు. ప్రభుత్వ వైద్య సేవలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని రూపొందించినట్లు మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఏ నరేంద్ర తెలిపారు. న్యుమాటిక్ ట్యూబ్ సిస్టమ్తో పాటు, ఇన్ఫెక్షన్లు సోకకుండా ఉండేందుకు ప్రత్యేకమైన 'డర్టీ కారిడార్స్' వంటి నూతన డిజైన్లను ఈ ఆసుపత్రిలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సనత్నగర్ టిమ్స్ అందుబాటులోకి వస్తే సామాన్యులకు అత్యున్నత స్థాయి సాంకేతిక వైద్య సేవలు వేగంగా అందనున్నాయని అన్నారు.

# కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపాను

హైదరాబాద్, మార్చి 3,

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుదీర్ఘ కాలం సాగిన ఉత్కంఠకు రౌస్ అవెన్యూ కోర్టు తీర్పుతో తెరపడింది. మాజీ ఎమ్మెల్సీ కవితకు ఈ కేసులో క్లీన్ చిట్ లభించడం బీఆర్ఎస్ శ్రేణులకు పెద్ద ఊరటనిచ్చినప్పటికీ, ఈ తీర్పు అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు పార్టీలోనూ, కల్వకుంట్ల కుటుంబంలోనూ పెను తుపానును సృష్టించాయి. ముఖ్యంగా కేటీఆర్ చేసిన ఒక ట్వీట్, దానికి కవిత ఇచ్చిన కౌంటర్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారాయి.కోర్టు తీర్పు వెలువడిన వెంటనే కేటీఆర్ స్పందించారు. ఈ కేసు కేవలం రాజకీయ కక్ష సాధింపు అని కొట్టిపారేశారు. అయితే, తన విశ్లేషణలో ఆయన ఒక కీలక వ్యాఖ్య చేశారు. "ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనే కల్పిత గాథ వల్ల అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ రాజకీయంగా బలి అయింది అని పేర్కొన్నారు. కవితకు న్యాయం జరిగిందని చెబుతూనే, ఈ కేసు వల్లే పార్టీ ఓడిపోయిందనే అర్థం వచ్చేలా ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి.కేటీఆర్ చేసిన విశ్లేషణపై కవిత తీవ్రంగా మండిపడ్డారు. పార్టీ ఓటమిని తన ఖాతాలో వేయడంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. "బీఆర్ఎస్ ఓటమికి నీ అహంకారమే కారణం, నాపై తప్పుడు ప్రచారాలు ఆపాలి'' అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఘాటుగా స్పందించారు.తాను జైలులో ఉన్న సమయంలో పార్టీ గానీ, అగ్ర నాయకత్వం గానీ కనీసం ఒక ప్రెస్ మీట్ పెట్టి కూడా తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసు తన వ్యక్తిగత లాభం కోసం జరిగింది కాదని, పార్టీ ప్రయోజనాల కోసం పోరాడుతుంటే తనను ఒంటరిని చేశారని ఆమె ఆరోపించారు. నిరుద్యోగం, హామీల అమలులో వైఫల్యం వంటి కారణాల వల్ల పార్టీ ఓడిపోతే, ఇప్పుడు ఆ నెపాన్ని తనపైకి నెట్టడం సరికాదని ఆమె స్పష్టం చేశారు.ఈ వివాదం కేవలం అన్నాచెల్లెళ్ల మధ్య చిన్నపాటి ఘర్షణ మాత్రమే కాదు, దీని వెనుక లోతైన రాజకీయ కోణాలు ఉన్నాయి. కేసు గెలిచిన తర్వాత కవిత తన రాజకీయ ఇమేజ్ను తిరిగి పుంజుకోవాలని చూస్తున్నారు. కానీ కేటీఆర్ వ్యాఖ్యలు ఆమెను పార్టీకి నష్టం కలిగించిన వ్యక్తిగా చిత్రించేలా ఉన్నాయని ఆమె భావిస్తున్నారు. కవిత త్వరలో సొంతంగా రాజకీయ అడుగులు వేయబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఆమె తనపై ఉన్న లిక్కర్ స్కామ్ ముద్రను కోర్టు ద్వారా చెరిపేసుకున్న తరుణంలో, సొంత అన్నయ్యే దాన్ని పార్టీ ఓటమికి కారణంగా చూపడం ఆమెకు మింగుడుపడటం లేదు.లిక్కర్ స్కామ్ కేసులో న్యాయపరంగా కవిత విజయం సాధించినా, రాజకీయంగా మాత్రం కుటుంబంలో చిచ్చు రేపింది. కేటీఆర్ అహంకారం వల్ల ఓడిపోయామని కవిత, కవిత కేసు వల్లే పార్టీ దెబ్బతిందని కేటీఆర్ పరోక్షంగా వాదించుకోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మరి ఢిల్లీ లిక్కర్ స్కాంలో క్లీన్ చిట్ వచ్చిన తర్వాత కూడా అన్నాచెల్లెళ్లు ఇలా బహిరంగంగా విమర్శించుకోవడం ఆసక్తి రేపుతోంది.

# శ్రీకాకుళం ఏబీసీ డబ్ల్యూవో ఇంట్లో కోట్లు

## ఏసీబీ సోదాల్లో భారీగా అక్రమాస్తులు

ఏబీసీడబ్ల్యూవో బాల ముకుందరావు ఇళ్లపై ఏసీబీ దాడులుసోదాల్లో రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తుల గుర్తింపుమెస్ బిల్లుల మంజూరుకు లంచాలు తీసుకుంటున్నట్లు ఆరోపణలు. బంగారం, వెండి, స్థిరాస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్న అధికారులుశ్రీకాకుళం జిల్లాలో ఓ అవినీతి అధికారి బాగోతం వెలుగులోకి వచ్చింది. నరసన్నపేట వెనుకబడిన తరగతుల సహాయ సంక్షేమ అధికారి (ఏబీసీడబ్ల్యూవో) గడ్డి బాల ముకుందరావు నివాసాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.1.10 కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. నరసన్నపేటతో పాటు సోంపేట విభాగానికి కూడా బాల ముకుందరావు ఇన్ఛార్జ్గా వ్యవహరిస్తున్నారు. వసతిగృహాల మెస్ బిల్లులు మంజూరు చేయడానికి, ప్రతి విద్యార్థికి రూ.15 చొప్పున వార్డెన్ల నుంచి ఆయన లంచం వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఏసీబీకి ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలోనే ఈ ఏడాది జనవరి 28న అధికారులు ఆయన కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టగా, లెక్కల్లో చూపని రూ.1,84,070 నగదు పట్టుబడింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నిన్న శ్రీకాకుళం పట్టణంలోని బాల ముకుందరావుకు చెందిన రెండు ఇళ్లలో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాల్లో రాజాం, శ్రీకాకుళం, కొత్తవలస సబ్రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోని 4 స్థిరాస్తుల పత్రాలు, 322 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.75 కిలోల వెండి వస్తువులు, కొంత నగదు, ఒక కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ రూ.1.10 కోట్లుగా ఉంటుందని, కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు

# రంగుల మయంగా జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయం

నిర్మల్ మార్చి 3,

నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పరస్పర స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. అలాగే పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ఈ హోలీ వేడుకల్లో అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా, నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్ ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు,ఎస్ఐ లు, ఆర్ ఎస్.ఐ లు, సిబ్బంది ఉన్నారు.

# కూల్చివేతలపై తీవ్రమవుతున్న విమర్శలు

నల్గొండ, మార్చి 3, (న్యూస్ పల్స్)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ప్రస్తుతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. చెరువుల పరిరక్షణ, మూసీ పునరుజ్జీవం వంటి ఉన్నత లక్ష్యాలతో మొదలైన ఈ ప్రస్థానం, క్షేత్రస్థాయిలో అమలు తీరు, ప్రతిపక్షాల వ్యూహాల వల్ల ప్రభుత్వానికి ప్రతికూలంగా మారుతోందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం తొలుత హైడ్రా ద్వారా హైదరాబాద్లోని చెరువుల ఆక్రమణలను తొలగించి ప్రజల ప్రశంసలు పొందింది. అయితే, ఆ తర్వాత పలు విమర్శలు ఎదుర్కొంది. తాజాగా ఖమ్మం జిల్లాలో ఆక్రమణల తొలగింపు, ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు కోసం చేపడతారని ప్రచారం జరుగుతున్న కూల్చివేతలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఆక్రమణలు తొలగించడం చట్టబద్ధమే అయినప్పటికీ, బాధితుల ఆవేదనను ప్రతిపక్షాలు తమకు అనుకూలంగా మార్చుకోవడంలో సఫలమవుతున్నాయి. పేదల ఇళ్లను కూల్చుతున్నారు అనే ప్రచారం ప్రజల్లోకి బలంగా వెళ్లడం కాంగ్రెస్ వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.ఏ ప్రభుత్వానికైనా ఆక్రమణల తొలగింపు అనేది కత్తిమీద సాము వంటిది. చట్టం తన పని తాను చేసుకుపోతుందని ప్రభుత్వం చెబుతున్నా, మానవీయ కోణాన్ని విస్మరించడం వల్ల సామాన్యుల్లో అభద్రతా భావం పెరుగుతోంది. ముఖ్యంగా మధ్యతరగతి, పేద వర్గాల ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటున్నారనే భావన కలిగితే, అది దీర్ఘకాలంలో ఓటు బ్యాంకుపై ప్రభావం చూపుతుంది. ఖమ్మంలోనూ, హైదరాబాద్ మూసీ తీరంలోనూ బాధితుల నిరసనలు ఉధృతం కావడం, వారికి ప్రతిపక్ష నేతలు అండగా నిలవడం ప్రభుత్వానికి రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది.ప్రస్తుతం తెలంగాణలో జరుగుతున్నది అసలు కంటే కొసరు ఎక్కువ అన్నట్లుగా ఉంది. అంటే, ప్రభుత్వం చేస్తున్న పని కంటే దానిపై జరుగుతున్న వ్యతిరేక ప్రచారమే ఎక్కువగా వినిపిస్తోంది. ప్రభుత్వం తన ఉద్దేశాలను ప్రజలకు స్పష్టంగా వివరించడంలో వెనుకబడిందనేది రాజకీయ వర్గాల అభిప్రాయం. కూల్చివేతలకు ముందే పునరావాస ప్యాకేజీలను ప్రకటించి, ప్రజలతో మమేకమై ఉంటే ఇంతటి వ్యతిరేకత వచ్చేది కాదు. కానీ, యంత్రాలతో నేరుగా రంగంలోకి దిగడం వల్ల ప్రతిపక్షాలకు ప్రభుత్వం అస్త్రాలను అందించినట్లయింది. ప్రభుత్వ యంత్రాంగం , రాజకీయ విభాగం మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. అధికారులు కేవలం నిబంధనల ప్రకారమే వెళ్తారు, కానీ రాజకీయ నేతలు ప్రజల నాడిని పట్టుకోవాలి. మూసీ ప్రాజెక్టు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం కంటే, కూల్చివేతల వార్తలే ఎక్కువగా హైలైట్ అవ్వడం ప్రభుత్వ వైఫల్యమే. ముందుముందు కీలక ప్రాజెక్టులు చేపట్టాలంటే ప్రభుత్వం తన వ్యూహాన్ని మార్చుకోవాలి. కేవలం కూల్చివేతలు అనే ముద్ర పడకుండా, పునర్నిర్మాణం, సుందరీకరణ అనే సానుకూల అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బాధితులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు లేదా మెరుగైన పరిహారం ఇచ్చి, వారిని ఒప్పించిన తర్వాతే చర్యలు తీసుకోవడం శ్రేయస్కరం. లేనిపక్షంలో, ఈ కూల్చివేతల వ్యతిరేక ప్రచారం కాంగ్రెస్ ప్రభుత్వానికి భారీ రాజకీయ మూల్యాన్ని మిగిల్చే ప్రమాదం ఉంది.

# డబుల్ కష్టాలు

నల్గొండ, మార్చి 3,

ప్రజల కనీస అవసరాలు తీర్చేందుకు ఏ ప్రభుత్వమైనా సంక్షేమ పథకాలను అందజేస్తుంది. దానిలో భాగంగానే గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు కట్టించి అందజేసింది. ఇంతవరకు బానే ఉన్నా వాటి నిర్మాణంలో నాణ్యతతో కూడిన పనులు చేయకపోవడం, అక్కడ సరైన వసతులు కల్పించకపోవడంతో లబ్ధిదారులు అనేక చోట్ల అవస్థలు పడుతూనే ఉన్నారు. ఇదే విధానం మండలంలోని విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లోనూ కొనసాగుతోంది. 2020లో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. ఇండ్లు పూర్తయి రెండు సంవత్సరాలైనా అర్హులైన పేదలకు పంపిణీ చేయాలేదు. దీంతో సిపిఎం ఆధ్వర్యంలో 2023లో ధర్నా నిర్వహించగా అప్పుడు అర్హులను గుర్తించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పంపిణీ చేశారు. కాంట్రాక్టర్ నాణ్యతలేని సిమెంటుతో కట్టడంతో ఆ ఇండ్లు ఇప్పుడు శిధిలావస్థకు చేరాయి.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు వచ్చిన సంతోషం లేకుండా కారు చీకట్లో మగ్గుతున్న కాలనీ వాసుల దుస్థితి కి నిదర్శనం మండల కేంద్రంతో పాటు విభళ్ళ పురం, అప్పన్నగూడెం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు గత ప్రభుత్వం నిరుపేదలను గుర్తించి ఇచ్చిన ఇండ్లు ఆర్భాటంగా ప్రారంభించి చేతులు దులుపుకొన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో కనీస సౌకర్యాలైన కరెంట్, త్రాగునీటి సౌకర్యం , సి సి రోడ్లు లేక వచ్చిపోయే వర్షాలతో పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగి బురదతో కంపు కొడుతున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. అలాగే ఈగలు, దోమలు, స్వైరవిహారం చేస్తున్నాయని, కారుచీకట్లో పాములు, తేళ్ళ బెడదతో సతమతం అవుతున్నామని లబ్ధిదారులు ఇప్పటికే పలుసార్లు మండల అధికారులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శి లకు పిర్యాదు చేసిన పలితం లేకుండా పోయిందని ఆరోపిస్తున్నారు.కనీసం గ్రామ పంచాయతీ సిబ్బంది కూడా చెత్త సేకరణకు రావడం లేదని దీంతో ఎక్కడ చెత్త అక్కడే పేరుకపోయి కంపు కొడుతున్నదని డబుల్ బెడ్ రూమ్ గృహ నివాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు డబుల్ బెడ్ రూమ్ నివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని అన్ని వసతులు కల్పించి అవస్థలు లేకుండా చూడాలని కోరుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసి త్రాగునీరు, విద్యుత్తు, సైడ్ డ్రైనేజీలు, సిసి రోడ్లు వసతులను కల్పించకుండా వదిలేసిసింధీ. అప్పటి నుండి ఇప్పటి వరకు సమస్యలు మాత్రం తేలడం లేదు. డబల్ బెడ్ రూమ్ గృహనివాసులు పడుతున్న ఇబ్బందులను అర్థం చేసుకొని ఈ ప్రభుత్వమైనా వసతులను కల్పించాలి.

# పశ్చిమాసియా ప్రాంతంలో సంఘర్షణలపై అధికార ప్రతినిధి ప్రకటన

న్యూ ఢిల్లీ, మార్చి 03,(భారత శక్తి):

ఇరాన్ సహా గల్ఫ్ ప్రాంతంలో 2026 ఫిబ్రవరి 28న సంఘర్షణాత్మక సంఘటనలు మొదలు కావడంపై భారత్ తీవ్ర ఆందోళన ప్రకటించింది. అదే సమయంలో సంయమనం పాటించాలని, ఉద్రిక్తతల నివారణకు కృషి చేయాలని, పౌరుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అన్ని పక్షాలకూ విజ్ఞప్తి చేసింది. దురదృష్టవశాత్తూ పవిత్ర రంజాన్ మాసంలో ఈ ప్రాంతంలోని పరిస్థితులు గణనీయంగా దిగజారుతూ వచ్చాయి.

2. ఇటీవలి కాలంలో సంఘర్షణలు తీవ్రం కావడంతోపాటు ఇతర దేశాలకూ వ్యాపించడాన్ని మనం చూస్తున్నాం. సాధారణ జన జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్తంభించడమే కాకుండా విధ్వంసం మరణాల సంఖ్య పెరుగుతోంది. ఈ ప్రాంత భద్రత, స్థిరత్వంలో కీలక భాగస్వామ్యం గల సమీప, పొరుగు దేశంగా మనకూ ఈ పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

3. గల్ఫ్ ప్రాంతంలో ఉంటున్న, పనిచేస్తున్న దాదాపు కోటి మంది భారతీయ పౌరుల భద్రత, శ్రేయస్సు మాకు అత్యంత ప్రధానం. వారిపై ప్రతికూల ప్రభావం చూపే పరిణామాలపై మనం ఎంతమాత్రం ఉదాసీనత వహించలేం. మన వాణిజ్య, ఇంధన వ్యవస్థలు కూడా ఈ భౌగోళిక ప్రాంతం మీదుగానే కార్యకలాపాలు నిర్వహిస్తాయి. ఏదైనా పెద్ద అవరోధం ఏర్పడితే అది భారత ఆర్థిక వ్యవస్థలో తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది. ప్రపంచ శ్రామికశక్తిలో అగ్రస్థానాన గల దేశంగా వాణిజ్య నౌకలపై దాడులను భారత్ కచ్చితంగా ఖండిస్తోంది. కొన్ని రోజులుగా ఇలాంటి దాడులలో కొందరు భారత పౌరులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరి ఆచూకీ తెలియడం లేదు.

4. ఈ నేపథ్యంలో చర్చలు, దౌత్య మార్గంలో పరిష్కారం దిశగా భారత్ తన ఆకాంక్షను పునరుద్ఘాటిస్తోంది. సంఘర్షణ త్వరగా స్వస్తి చెప్పాల్సిందిగా మన గళాన్ని స్పష్టంగా వినిపిస్తున్నాం. ఇప్పటికే, ఎన్నో ప్రాణనష్టం వాటిల్లడంపై మేం తీవ్ర ఆవేదన ప్రకటిస్తున్నాం.

5. ఈ సంఘర్షణ ప్రభావిత దేశాల్లోని భారత పౌరులు, సామాజిక సంస్థలతో భారత రాయబార, దౌత్య కార్యాలయాలు సన్నిహిత సంబంధాలు నిర్వర్తిస్తున్నాయి. ఈ మేరకు తగురీతిలో క్రమం తప్పకుండా సలహాలు, సూచనలిస్తాయి. సంఘర్షణలో చిక్కుకున్న వారికి అన్నివిధాలా అవసరమైన సహాయం అందిస్తున్నాయి. అలాగే, వివిధ దౌత్య అంశాల పరిష్కారంలో రాయబార, దౌత్య కార్యాలయాలు చురుగ్గా వ్యవహరిస్తాయి.

6. పశ్చిమాసియా ప్రాంత దేశాల ప్రభుత్వాలతోపాటు ఇతర కీలక భాగస్వాములతో మేం నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తున్నాం. ఈ మేరకు ప్రధానమంత్రితోపాటు విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఆయా దేశాల ప్రధానమంత్రులు, అధ్యక్షులు, విదేశాంగ మంత్రులతో చర్చించారు.

7. ఈ నేపథ్యంలో మారుతున్న పరిస్థితులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తూ, జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్దిష్ట నిర్ణయాలు తీసుకుంటుంది.

# వేములవాడలో పిచ్చి కుక్కలు బీభత్సం.. 25 మందికి పైగా గాయాలు

## --బాధితులను పరామర్శించిన మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు -- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందిస్తాం" -- చైర్మన్ హామీ

వేములవాడ, మార్చి 03 (భారత శక్తి) : వేములవాడ పట్టణంలో మంగళవారం ఉదయం స్వైర విహారం చేసిన ఓ పిచ్చి కుక్క పలు కాలనీలు, ప్రధాన వీధుల్లో సంచరిస్తూ సుమారు 25 మందికి పైగా ప్రజలను కరిచి గాయపరిచిన ఘటన పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. అకస్మాత్తుగా జరిగిన ఈ దాడులతో ప్రజలు భయాందోళనలకు గురై ప్రాణభయంతో పరుగులు తీశారు. గాయపడిన వారిలో రాజన్న దర్శనానికి వచ్చిన భక్తులు కూడా ఉన్నారు.గాయపడిన వారిని వెంటనే ఏరియా ఆసుపత్రికి తరలించి రేబీస్ నిరోధక టీకాలు, అత్యవసర చికిత్స అందిస్తున్నారు.కొందరికి తీవ్ర గాయాలు కావడంతో ప్రత్యేక వైద్య పర్యవేక్షణలో ఉంచినట్లు వైద్యులు వెల్లడించారు.విషయం తెలుసుకున్న వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కౌన్సిలర్లతో కలిసి ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.వారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకుని, మెరుగైన, సంపూర్ణ వైద్యం అందించాలని వైద్యులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్



మాట్లాడుతూ, బాధితుల చికిత్సలో ఎలాంటి లోటు ఉండనీయమని స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలో కుక్కల బెడదను తగ్గించేందుకు ఇప్పటికే 15 రోజుల క్రితం 40 కుక్కలను ఏ.బి.సి కేంద్రానికి తరలించామని, తాజా ఘటన నేపథ్యంలో మరిన్ని కుక్కలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.చైర్మన్ ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పట్టణ వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టి కుక్కల నియంత్రణ చర్యలను వేగవంతం చేశారు.

# న్యాయ విజ్ఞాన సదస్సు/అవగాహన కార్యక్రమాలు

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 03: డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప మరియు సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ సూచనల మేరకు లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే కడప నగరము మృత్యుంజయకుంట నందు 3వ తేదీన " నల్సా (ఆశ-




అవగాహన, మద్దతు, సహాయం మరియు చర్య) ప్రామాణిక ఆపరేటింగ్ విధానం -- బాల్య వివాహాలను నిర్మూలించడానికి, 2025, నల్సా పథకములు మొదలగు అంశాలపై అవగాహన కార్యక్రమం" నిర్వహించడం జరిగినది.

ఈ సందర్భంగా నీలకంఠేశ్వర రెడ్డి అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కల్పించడం.

మద్దతు: బాల్య వివాహాల నుండి రక్షించబడిన వారికి మానసిక, సామాజిక మద్దతు అందించడం.

సహాయం: బాధితులకు ఉచిత చట్టపరమైన సలహా, కోర్టులో ప్రాతినిధ్యం, పునరావాసం (విద్య, వృత్తి శిక్షణ) కల్పించడం.

చర్య: ఫిర్యాదులు స్వీకరించడం, చట్టపరమైన చర్యలు తీసుకోవడం, అధికారులతో సమన్వయం చేయడం, లోక్ అదాలత్‌ల ద్వారా పరిష్కారం చూపడం.

ఆశ యొక్క యూనిట్ నిర్మాణం:

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ నేతృత్వంలో ఈ యూనిట్ ఏర్పాటు చేయబడుతుంది. ఇందులో జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి, ఫ్యామిలీ కోర్టు జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సభ్యులుగా ఉంటారు.

నల్సా పాత్ర:

నల్సా అనేది బలహీన వర్గాల వారికి ఉచిత న్యాయ సేవలు అందించే సంస్థ. ఆశ ప్రోగ్రామ్ ద్వారా బాల్య వివాహాల నిర్మూలనలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

సంక్షిప్తంగా: ఆశ అనేది బాల్య వివాహాల నివారణకు నల్సా ప్రారంభించిన ఒక సమగ్ర కార్యక్రమం, ఇది చట్టపరమైన, సామాజిక, మానసిక సహాయాన్ని అందిస్తూ, బాధితులకు అండగా నిలుస్తుంది. చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 మొదలగంశాలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నీలకంఠేశ్వర రెడ్డి మరియు దశరథ రామిరెడ్డి, ఈశ్వరయ్య, పారా లీగల్ వాలంటీర్స్ మరియు ప్రజలు పాల్గొన్నారు.

# వీబీ జీ రామ్ జీ పథకం గ్రామీణాభివృద్ధికి గణనీయమైన అవకాశాలను అందిస్తుంది: చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద్ రావు

చిత్తూరు.భారత శక్తి ప్రతినిధి, మార్చి 03:

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేరవేయడంలో మీడియా కీలక వారధిగా పనిచేయాలని చిత్తూరు పార్లమెంటు సభ్యుడు దగ్గుమల్ల ప్రసాద్ రావు మీడియా ప్రతినిధులను కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, వీబీ జీ రామ్ జీ పథకంపై ఈ రోజు (03 మార్చి 2026)



చిత్తూరులో నిర్వహించిన "వార్తాలాప్ మీడియా వర్క్ షాప్"లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భారత ప్రభుత్వ ప్రచార విభాగమైన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పిఐబి), విజయవాడ ఈ వార్తాలాప్ కార్యక్రమాన్ని నిర్వహించింది. విలేకరులు ఖచ్చితమైన, బాధ్యతాయుతమైన, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే వార్తలను ప్రజలకు చేరువ చేయాలని ఆయన కోరారు. ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాల వారికి తెలిపేలా, అవగాహన పెంపొందించేలా వాస్తవ సమాచారాన్ని అందించేందుకు కృషి చేయాలని ఎంపీ ప్రసాద రావు సూచించారు.

వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా గ్రామీణాభివృద్ధి. సామాజికాభివృద్ధి. గ్రామీణ జీవనోపాధికి మెరుగైన అవకాశాలు దక్కుతాయని ఎంపీ ప్రసాద రావు అన్నారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్లో తగినన్ని నిధులను కేటాయించిందని వెల్లడించిన ఆయన బ్యాంకింగ్ వ్యవస్థ మద్దతుతో నడిచే స్వయం ఉపాధి పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక సాధికారతను ప్రోత్సహించే వివిధ కేంద్ర పథకాల గురించి ప్రస్తావించారు.

వివిధ అంశాలపై ప్రాంతీయ జర్నలిస్టులకు అవగాహన కల్పించడంలో ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో చేస్తున్న ప్రయత్నాలను ఎంపీ ప్రసాదరావు అభినందించారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని గ్రామీణ ప్రజలకు సమర్థవంతంగా చేరవేసేందుకు మీడియాను బలోపేతం చేయడమే ఈ వర్క్షాప్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ మీడియా వర్క్ షాప్లో పాల్గొన్న వివిధ మీడియా సంస్థల ప్రతినిధులను ఎంపీ అభినందించారు.

ప్రజాస్వామ్యంలో మీడియాను నాలుగో స్తంభంగా పరిగణిస్తారని.. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా మీడియా కీలక పాత్ర పోషిస్తుందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో, విజయవాడ డైరెక్టర్ శ్రీ జి. సురేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలు, కొత్త నిర్ణయాలు, ప్రజాప్రతినిధుల పర్యటనల పై విలేకరులకు ప్రామాణికమైన సమాచారాన్ని సకాలంలో అందిచడంలో పిఐబి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలపై మీడియాకు మరింత అవగాహన కల్పించేందుకు వార్తాలాప్ వంటి కార్యక్రమాలు సహాయ పడతాయని వివరించారు.

శ్రీ గోపి చంద్, ఉపాధి పథక రాష్ట్ర చీఫ్ క్వాలిటీ అండ్ కంట్రోల్ ఆఫీసర్, మాట్లాతూ వికసిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్ గార్ అజీవిక మిషన్ (గ్రామీణ్) పథకం ( ఏబీ జీ రామ్ గ్రామీణ్) గ్రామీణ కుటుంబాలకు ఒక ఆర్థిక ఏడాదికి 125 రోజుల వేతనంతో కూడిన ఉపాధికి చట్టబద్ధమైన హామీని అందిస్తుందని తెలిపారు. ఉపాధికి దరఖాస్తు చేసుకున్న 15 రోజుల్లోపు పని లభించకపోతే నిరుద్యోగ భృతిని అందిచడంతో పాటు, చేసిన పనికి సకాలంలో వేతనం పొందేందుకు స్పష్టమైన నిబంధనలున్నాయని వివరించారు. వ్యవసాయ రంగంలో కీలక సాగు సమయాల్లో కూలీన కొరతను నివారించేందుకు తప్పనిసరి 60 రోజుల "వ్యవసాయ విరామం" వంటి నిబంధనల గురించి మీడియా ప్రతినిధులకు వివరించారు.

ఉపాధి హామి పథకాన్ని సమర్ధవంతంగా అమలు చేసేందుకు. పారదర్శకతను నిర్ధారించేందుకు ముఖ గుర్తింపు సాంకేతికత, ఏఐ సాధనాలు, జియో స్పేషియల్ మ్యాపింగ్ వంటి ఆధునాతన డిజిటల్ వ్యవస్థలను ఉపయోగించనున్నారు. దీంతో అవినీతికి తావులేకుండా నిధులు నేరుగా లబ్దిదారులకు చేరుతాయి. గ్రామ పంచాయతీలే ఈ పథకానికి ప్రాథమిక అమలు సంస్థలుగా వ్యవహరించనున్నాయి. ఈ పథకానికి అయ్యే వ్యయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరిస్తాయి. ఇందులో నీటి భద్రత, గ్రామీణ మౌలిక సదుపాయాలు. విపత్తు నిర్వహణా సంసిద్ధత, సోలార్ లైటింగ్. గ్రామీణ గ్రంథాలయాలు వంటి కొత్త కార్యక్రమాలకు ప్రాధాన్యతనిచ్చారు.

ఈ వార్తాలాప్ కార్యక్రమంలో ఎంజిఎన్ఆర్ఈజిఎస్ చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శ్రీ గోపీచంద్, చిత్తూరు లీడ్ బ్యాంక్ అధికారులు శ్రీ ఎ. హరీష్, చిత్తూరు జిల్లా నీటి నిర్వహణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# నిందితునికి 7 సంవత్సరాల శిక్ష,2500 రూపాయల జరిమానా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 03 (భారత శక్తి) నిర్మల్ పట్టణం లో 2024 సంవత్సరంలో బంగల్ పేట్ కి చెందిన రాపాని శ్రీను, నిజామాబాద్ కి చెందిన వేముల సుజాత అనే ఇద్దరు వ్యక్తులు,నిర్మల్ పట్టణం లోని బస్టాండ్ సమీపంలో ఒక వ్యక్తి మెడ లో నుండి 6 గ్రాముల బంగారు గొలుసు, మొబైల్ ఫోన్ ను దొంగిలించడం జరిగింది.దీంతో బాధిత వ్యక్తి నిర్మల్ పట్టణ పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు, ఆధారాలను పరిశీలించిన తరువాత, ఈరోజు నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు గౌరవ న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి గారు, నిందితుడికి 7 సంవత్సరాల జైలు శిక్షతో పాటు,2500 రూపాయల జరిమానా విధించారు.లిఈ సందర్భంగా ఎస్పీ డా.జి.జానకి షర్మిల మాట్లాడుతూ...లి

.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకొలేరని ఎస్పీ తెలిపారు.నిర్మల్ పోలీసులు, ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్ష లు పడేలా చేస్తారని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టటానికి నిర్మల్ పోలీసులు కృషి చేస్తున్నారు..



నిందితుడి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వినోద్ రావు, విచారణ అధికారులు ఎం. ప్రవీణ్ కుమార్ (ఇన్స్పెక్టర్), డి.రమేష్ (ఎస్ఐ), కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ అయిన చూ× - డల్లు సింగ్, అనిల్ కుమార్ాజ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ ల విజిట్

కడప, భారత శక్తి ప్రతినిధి, మార్చి 03: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశానుసారంగా, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప డాక్టర్ సి యామిని సూచనల మేరకు



సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప ఎస్.బాబా ఫక్రుద్దీన్ ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ మరియు లీగల్ ఎయిడ్ క్లినిక్ లను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప ను సంప్రదించవచ్చును అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు సబ్ జైల్స్ సూపరింటెండెంట్లు , ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# నూతన చైర్మన్ వైస్ చైర్మన్ లకు ఘన సన్మానం: మాజీ కౌన్సిల్ సయ్యద్ ఇర్ఫాన్ .

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 03(భారత శక్తి)నూతనంగా ఎన్నికైన భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తత్రి మరియు వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ లకు మాజీ కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ అభినందనలు తెలిపారు.

పూలమాలలు శాలువా వేసి ఘనంగా సన్మానించారు, వారి అద్భుతమైన విజయంపై ఉత్సాహభరితమైన సంతోషం వ్యక్తం చేశారు. తన నివాసంలో ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎన్నికైన మున్సిపల్ కొత్త చైర్మన్ దత్తు మరియు వైస్ చైర్మన్ నాయకత్వంపై ప్రజలు గొప్ప నమ్మకాన్ని ఉంచారని మరియు వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ వారు భైంసా మునిసిపాలిటీని దృఢంగా తీసుకుంటారని ఆశిస్తున్నట్లు చెప్పారు.




భైంసా పట్టణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. వార్డ్ నెంబర్ 5కు చెందిన మాజీ ఎంఐఎం కౌన్సిలర్ సయ్యద్ ఇర్ఫాన్ తన ఎంఐఎం పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి, తన అనుచరులతో కలిసి స్వతంత్ర వర్గంలో చేరినట్లు అధికారికంగా ప్రకటించారు.ఆదివారం భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్ మీర్జా ఇద్దరిస్ బేగ్, చైర్మన్ తుమ్మల దత్తాత్రి సమక్షంలో ఆయన ఈ నిర్ణయం వెల్లడించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్వతంత్ర వర్గ నాయకులు, కార్యకర్తలు సయ్యద్ ఇర్ఫాన్కు పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఘన స్వాగతం పలికారు. గత నెలలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు భైంసా మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోవడం గమనార్హం. పట్టణ ప్రజలు యువ నాయకత్వంపై ఉంచిన విశ్వాసానికి ఇది నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత పాలకుల పనితీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు మార్పు కోరుకుంటూ యువ అభ్యర్థులకు పట్టం కట్టినట్లు పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇర్ఫాన్ మాట్లాడుతూ"పట్టణ అభివృద్ధి కోసం ప్రజలు యువతపై విశ్వాసం ఉంచారు. ఆ విశ్వాసాన్ని నిలబెట్టే దిశగా నేను కూడా యువ నాయకత్వానికి మద్దతుగా నిలుస్తున్నాను. స్వతంత్ర వర్గం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు నా వంతు సహకారం అందిస్తాను" అని తెలిపారు. ఈ చేరికతో భైంసా పట్టణ రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భైంసా పట్టణ అభివృద్ధి, పారదర్శక పాలన లక్ష్యంగా స్వతంత్ర వర్గం ముందుకు సాగుతుండగా తాజా రాజకీయ పరిణామాలు ఆసక్తికరంగా మారాయి.

అభివృద్ధికి అడుగులు

సహచర బృందం మరియు మద్దతుదారులతో కలిసి, చైర్మన్ దత్తత్రి సయ్యద్ ఇర్ఫాన్ కు కృతజ్ఞతలు తెలుపుతూ వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ నివాసానికి వెళ్లారు, అక్కడ నాయకులను అధికారికంగా సత్కరించారు.సయ్యద్ ఇర్ఫాన్ మరియు అతని యువ బృందం భైంసా ఛైర్మన్ మరియు శ్రేయస్సును సత్కరించింది.

ఇర్ఫాన్ మరియు అతని యువ బృందం హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.మరియు సర్వతోముఖాభివృద్ధికి, ప్రాథమిక సౌకర్యాలను అందించడం మరియు ప్రజా సమస్యలను పరిష్కరించడానికి తాను నిజాయితీగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. వైస్ చైర్మన్ మీర్జా ఇద్రిస్ బేగ్ శుభాకాంక్షలను స్వాగతించారు.

మరియు ఐక్యత ద్వారా భైంసాను పురోగతి వైపు నడిపించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించారు. పట్టణ అభివృద్ధిలో మున్సిపల్ చైర్మన్ మరియు వైస్ చైర్మన్‌లకు పూర్తిగా మద్దతు ఇవ్వాలనే తన సంకల్పాన్ని సయ్యద్ ఇర్ఫాన్ పునరుద్ఘాటించారు. వేడుకల్లో, మున్సిపల్ ప్రతినిధి సయ్యద్ అమెర్, షేక్ కలీం, షేక్ నోమాన్. మరియు యువ ప్రముఖులకు శాలువాలు మరియు పుష్పగుచ్ఛాలు సమర్పించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది

## బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్

హైదరాబాద్ మార్చ్ 3

గత మూడు నాలుగు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వింతవింత రాజకీయ చేష్టలకు పాల్పడుతోంది. అధికారంలోకి వచ్చి 26 నెలలు కావొస్తున్నా, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో మాత్రం పూర్తిగా విఫలమైందని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్ విమర్శించారు. మంగళవారం పార్టీ రాష్ట్ర కార్యాలయం లో మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే 6 గ్యారంటీలు సహా అన్ని హామీలు అమలు చేస్తామని గొప్పగా ప్రకటించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారు. ప్రజలు ఇప్పుడు "ఎందుకు కాంగ్రెస్‌కు ఓటేశామా?" అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా మూసీ పునరుజ్జీవం పేరుతో, గాంధీ సరోవర్ ప్రాజెక్టు పేరిట ప్రజల భూములపై కాంగ్రెస్ ప్రభుత్వం కన్నేసింది. మూసీ, ఈసా నదులు కలిసే ప్రాంతానికి సమీపంలో ఉన్న ప్రైవేట్ వ్యక్తుల భూములను అగ్గువ ధరలకు స్వాధీనం చేసుకుని కాంట్రాక్టర్లకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందన్నారు. తరతరాలుగా వారసత్వంగా వచ్చిన ఖరీదైన పట్టా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తోందని ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపాదిత గాంధీ సరోవర్‌కు దూరంగా ఉన్న భూములను కూడా కాజేసే ప్రయత్నం జరుగుతోంది మూసీ బఫర్ జోన్ విషయంలో ప్రభుత్వం ఇప్పుడు రకరకాల ప్రకటనలు చేస్తోంది. కానీ ఇదే ప్రాంతాల్లో గతంలో అధికారంలో ఉన్నప్పుడు అపార్ట్‌మెంట్లకు అనుమతులు ఇచ్చింది. ఇప్పుడు అన్ని పర్మిషన్లు ఉన్న పేదల ఇళ్లను కూల్చివేయడం అన్యాయం. కొందరు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ గారిని, రేవంత్ రెడ్డిని పోలుస్తూ చిల్లర వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు.. యూపీలో బుల్డోజర్ చర్యలు ప్రభుత్వ భూములను ఆక్రమించినవారిపై, మాఫియా, క్రిమినల్ ఎలిమెంట్స్‌పై మాత్రమే జరుగుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ గారు ప్రజా హక్కులను కాపాడుతూ, నేరస్థులపై, ఇల్లీగల్ స్ట్రక్చర్స్‌పై మాత్రమే బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపైనే చర్యలు తీసుకుంటున్నారు. కానీ తెలంగాణలో మాత్రం లీగల్ నిర్మాణాలపైనా, పేదల ఇండ్లను కూల్చుతూ గడ్డపార ప్రభుత్వంగా వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. కేరళలో ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ నుంచి గాంధీ కుటుంబానికి వెయ్యి కోట్లు పంపాలంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం దారుణం. తెలంగాణలో ప్రజలు ఆత్మహత్యలు? కాంగ్రెస్ మాత్రం వసూళ్లు వైద్యం చేయించుకోలేక, రిటైర్మెంట్ డబ్బులు రాక, అప్పుల భారం తట్టుకోలేక ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సీఎం "రూ.1000 కోట్లు" అంటున్నాడు. ఇంత దారుణం మరెక్కడాలేదు. సీఎం రేవంత్ రెడ్డి "రాహుల్ గాంధీని ప్రధాని చేస్తామని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉంది. కాబట్టి రేవంత్ ఆశ నెరవేరదనే విషయం గుర్తుంచుకోవాలి. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కనుమరుగవుతోంది. కేవలం కొన్ని రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ పరిస్థితి దిగజారింది. ప్రస్తుతం కొన్ని రాష్ట్రాలకు మాత్రమే పరిమితమై ఉంది. కర్ణాటకలో కిస్సా కుర్సీకా అనే మాదిరిగా సీఎం, డిప్యూటీ సీఎం మధ్య కుర్చీ కొట్లాట జరుగుతోంది. అధికార పోరు, అంతర్గత విభేదాలు బహిరంగంగానే కనిపిస్తున్నాయి. ఇటు తెలంగాణలో ఖమ్మం బ్యాచ్, మరోవైపు నల్లగొండ బ్యాచ్ రేవంత్ రెడ్డి సీటుకు ఎసరు పెట్టి ఎప్పుడు సీఎం అవుదామనే ఎదురుచూస్తున్నరు. ఇలా కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రధాని దేశ ప్రజలలో గొప్ప విశ్వాసాన్ని పొందారు. ప్రపంచ దేశాలు కూడా ఆయనను స్ట్రాంగ్ లీడర్‌గా చూస్తున్నాయి. దేశంలో సుపరిపాలన, అభివృద్ధి, భద్రత అందించడం ఆయనకే సాధ్యమైంది. ఈ క్రమంలో వరుసగా మూడుసార్లు ప్రధానమంత్రి అయ్యారు. మోదీ ప్రభుత్వంలో దేశం అభివృద్ధిలో దూసుకెళ్తోంది. అందుకే 2047 వరకు దేశ ప్రజల విశ్వాసంతో ప్రధానమంత్రి పదవి బలంగా కొనసాగుతుంది. 2047 వరకు ప్రధానమంత్రి సీటు ఖాళీ లేదు. కాని సీఎం రేవంత్ రెడ్డి ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి.. వైఫల్యాలతో, ఫెయిల్యూర్ పాలనతో, గడ్డపార పాలనతో తెలంగాణ రాష్ట్రాన్ని నాశనం చేస్తున్నందుకు ప్రజలు తగిన సమాధానం చెప్పే రోజు దూరంలో లేదు. 2028లో మార్పు ఖాయం. భారతీయ జనతా పార్టీ విజయం సాధిస్తుంది. బీజేపీ అభ్యర్థే తెలంగాణ ముఖ్యమంత్రి అవుతారు. రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటనకు వచ్చి ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఢిల్లీకి వెళ్లిపోయారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదు.× ఎన్నికల ముందు అశోక్‌నగర్ కు వచ్చిన రాహుల్ గాంధీ నిరుద్యోగులతో సమావేశమై రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కాని ఆ హామీని నెరవేర్చలేదు. రాహుల్ గాంధీకి, అదే నిరుద్యోగుల ముందుకు వెళ్లే ధైర్యం ఉందా? అందుకే ప్రజలకు మొహం చూపించే ధైర్యంలేక తోకముడిచారు.× అబద్ధాలతో రాజ్యాంగాన్ని పదేపదే అవమానపరుస్తూ, రాజ్యాంగ వ్యవస్థలను, ఎన్నికల కమిషన్ ను అవమానపర్చేలా, కించపర్చేలా మాట్లాడుతున్న రాహుల్ గాంధీకి అర్హత లేదు. గ్యారంటీలు, హామీలు నెరవేర్చలేని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సీఎం కుర్చీని కాపాడుకునేందుకు... రాహుల్ గాంధీని పొగడ్తలతో ముంచెత్తి భజన చేస్తున్నారని ఎద్దేవా చేసారు.. 150 డివిజన్లు ఉన్న జీహెచ్‌ఎంసీని 300 డివిజన్లుగా విభజించి, ఒక్క కార్పొరేషన్‌ను అశాస్త్రీయంగా మూడు ముక్కలుగా చేయడం వెనుక భారతీయ జనతా పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలనే అక్కసే కారణం. ఉదాహరణకు... బిల్డింగ్ పర్మిషన్ ఇచ్చేది ఒక కార్పొరేషన్ లో అయితే.. ఎన్ వోసీ తీసుకోవాలంటే కార్పొరేషన్ కు లేదా మరోచోటకు వెళ్లాల్సివస్తోంది. ఇది దుస్థితి. హైదరాబాద్ కోర్ సిటీని మజ్లిస్ పార్టీకి అప్పగించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ సర్కారులో నగర పాలన పూర్తిగా గాడి తప్పింది. హైదరాబాద్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీవ్రమయ్యాయి. చెత్త నిర్వహణ దారుణంగా ఉంది, తాగునీటి కొరత, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానం, ట్రాఫిక్ అస్తవ్యస్త పరిస్థితి?ఇవన్నీ ప్రభుత్వ వైఫల్యాలను స్పష్టంగా చూపిస్తున్నాయి జీహెచ్‌ఎంసీ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం తగిన నిధులు కేటాయించలేదు. మౌలిక సదుపాయాలపై సరైన శ్రద్ధ లేదు. పారిశుధ్యం, రోడ్లు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాయి. ఫలితంగా హైదరాబాద్ నగరం అభివృద్ధి పరంగా వెనుకబడుతోంది. కేంద్ర ప్రభుత్వం సాస్కి (రాజూవఇతిజీశ్రీ ంబబతిబబిజీనిఇవ బినీ ాబిజీబివబ టనీతీ అజీజూతిబిజీశ్రీ ఎనిలవబబిఎవనిబి) పథకం కింద తెలంగాణ పురపాలక శాఖకు రూ.650 కోట్ల వడ్డీలేని రుణాన్ని మంజూరు చేసిందని తెలిపారు. ఇది గత పదేళ్లలో రాష్ట్రానికి అందిన అత్యంత పెద్ద మొత్తాల్లో ఒకటి. ఈ మూలధన పెట్టుబడి నిధులు మునిసిపాలిటీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, రోడ్లు, పట్టణీకరణ, జియో ట్యాగింగ్, ఆస్తి పన్నుల డిజిటలైజేషన్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన వంటి సమగ్ర సంస్కరణలకు వినియోగించేందుకు ఉద్దేశించబడ్డాయన్నారు. 50 ఏళ్ల కాలపరిమితితో, వడ్డీలేమీ లేకుండా ఈ రుణం ఇవ్వడం ద్వారా కేంద్రం తెలంగాణ పట్టణాభివృద్ధికి విశ్వసనీయ మద్దతు అందిస్తోందన్నారు.. మొదటి దశలో రూ.650 కోట్లు విడుదల కాగా, సరైన వినియోగం ఆధారంగా త్వరలో మరో రూ.250 కోట్లు అందే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఓవైపు తెలంగాణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుంటే.. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం విభిన్నంగా వ్యవహరిస్తోంది. జీహెచ్‌ఎంసీని అవ్యవస్థితంగా మూడు ముక్కలుగా విభజించడం ద్వారా వ్యవస్థలను బలహీనపరుస్తోంది. ఇది ప్రజలకు తీరని అన్యాయం మాత్రమే కాకుండా, కేంద్రం ఇచ్చిన నిధుల సద్వినియోగానికి కూడా పెద్ద అడ్డంకిగా మారే ప్రమాదం ఉందన్నారు..ఈ మీడియా సమావేశంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి దేవకీ వాసుదేవరావు , బిజెపి సోషల్ మీడియా స్టేట్ కన్వీనర్ సుమిరన్ తదితరులు పాల్గొన్నారు.

# హమ్ బంజారా -- హమారా సంస్కృతి. వైభవంగా బంజారాల సంప్రదాయ 'ధూండ్' వేడుకలు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 03(భారత శక్తి) కుబీర్ మండలంలోని రంజిని తండాలో వైభవంగా బంజారాల సంప్రదాయ 'ధూండ్' వేడుకలు



కుబీర్ మండలంలోని రంజిని తండాలో బంజారా సమాజం ఘనంగా నిర్వహించిన సంప్రదాయ 'ధూండ్' వేడుకలు ఆ ప్రాంతంలో పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని మగపిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే ఈ ఆచారం బంజారాల సాంప్రదాయ జీవన విధానానికి ప్రతీకగా నిలిచింది.

తండాలో తెల్లవారుజాము నుంచే ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. రంగురంగుల సంప్రదాయ దుస్తుల్లో యువతీ యువకులు, పెద్దలు ఒకచోట చేరి వేడుకలకు శ్రీకారం చుట్టారు. డప్పుల మేళంతో ఆడిపాడుతూ తండా వీధులు కళకళలాడాయి. చిన్నారులపై ఆశీర్వాదాలు కురిపిస్తూ, వారి భవిష్యత్తు సుభిక్షంగా ఉండాలని పెద్దలు ప్రార్థనలు చేశారు.

'ధూండ్' కార్యక్రమం ప్రధానంగా మగబిడ్డల శ్రేయస్సు, ఆరోగ్యం కోసం నిర్వహించబడుతుంది. తండాలోని పెద్దలు సంప్రదాయ పద్ధతుల్లో పూజలు నిర్వహించి, ఆచారాలను పాటించారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ సంప్రదాయాన్ని యథావిధిగా కొనసాగించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తండావాసులు పేర్కొన్నారు.


వేడుకల సందర్భంగా గిరిజన మహిళలు ప్రత్యేక నృత్యాలతో అలరించారు. సంప్రదాయ ఆభరణాలు, చీరలతో సింగారించిన వారు డప్పుల తాళానికి కాళ్లు కదిపి తండాకు ప్రత్యేక శోభ తీసుకొచ్చారు. యువకులు కూడా ఉత్సాహంగా పాల్గొని సంస్కృతి పరిరక్షణకు తమ వంతు పాత్ర పోషించారు.

ఈ సందర్భంగా తండా పెద్దలు మాట్లాడుతూ, "హమ్ బంజారా -- హమారా సంస్కృతి అనే భావనతో మన ఆచారాలను, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించడం మా కర్తవ్యంగా భావిస్తున్నాం. ఆధునికత మధ్య కూడా మన మూలాలను మర్చిపోకుండా ఈ వేడుకలను నిర్వహిస్తున్నాం" అని తెలిపారు.

మొత్తానికి రంజిని తండాలో నిర్వహించిన 'ధూండ్' వేడుకలు బంజారాల సంస్కృతి వైభవానికి అద్దం పట్టగా, సమాజ ఐక్యతను చాటిచెప్పాయి. సంప్రదాయం, ఆనందం, ఐక్యత కలిసిన ఈ వేడుక తండాలో చిరస్మరణీయంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో చిన్నారులు పెద్దలు యువకులు అనే తేడా లేకుండా అందరూ కలిసి నుంచి జరుపుకున్నారు.

# జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ శుభాకాంక్షలు తెలిపిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 03 (భారత శక్తి) నిర్మల్ జిల్లా పోలీసు కార్యాలయంలో లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఆధ్వర్యంలో ఘనంగా హోలీ పండుగ



వేడుకలు జరిగాయి.ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా హోలీ వేడుకలను జరుపుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పోలీసు అధికారులతో కలిసి రంగులు చల్లుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. పరస్పర స్నేహభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచే హోలీ పండుగను సురక్షితంగా, పరస్పర గౌరవంతో జరుపుకోవాలని సూచించారు.

జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో సౌభ్రాతృత్వం, ఆనందం, ఐక్యత మరింత పెరగాలని ఆకాంక్షించారు. అలాగే పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

ఈ హోలీ వేడుకల్లో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల. తో పాటు, అడిషనల్ ఎస్పీ ఉపేందర్ రెడ్డి, భైంసా ఏ ఎస్పీ రాజేష్ మీనా , నిర్మల్ ఏ ఎస్పీ సాయి కిరణ్ , ఇన్స్పెక్టర్లు, ఆర్ ఐ లు,ఎస్ఐ లు, ఆర్ ఎస్.ఐ లు, సిబ్బంది ఉన్నారు.






# విరోష్ బాక్సులో ఏముంది

నటులు రష్మిక మందన్న, విజయ్ దేవరకొండ గత నెల 26న వివాహ బంధంతో ఒక్కటయ్యారు. వివాహానంతరం హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్‌తో పాటు ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై తదితర నగరాల్లోని పలు ఆలయాల్లో అభిమానులకు స్వీట్ బాక్సులు పంపిణీ చేశారు. ఈ బాక్సులకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానిని సంధ్యా రెడ్డి మిట్టా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన వీడియోలో 'విరోష్ స్వీట్ బాక్స్'లో నాలుగు రకాల మిఠాయిలు ఉన్నట్లు వెల్లడైంది. ప్రతి బాక్సులో నూతన దంపతుల ఫోటోతో పాటు వ్యక్తిగత సందేశం కూడా ఉంది. ఒక్కొక్కరికి ఒకటి కంటే ఎక్కువ బాక్సులు ఇచ్చినట్లు, అన్నప్రసాదం కూడా నిర్వహించినట్లు ఆమె తెలిపింది. ఉదయ్ పూర్ లోని ఐటీసీ మేమెంటోస్‌లో జరిగిన ఈ వివాహంలో తెలుగు, కొడవ సంప్రదాయాలు పాటించారు. రేపు హైదరాబాద్ లోని తాజ్ కృష్ణలో వైభవంగా రిసెప్షన్ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

# 12 కోట్ల పారితోషికం

దక్షిణాది చిత్ర పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా నంబర్ వన్ హీరోయిన్‌గా కొనసాగుతున్న నయనతార మరోసారి వార్తల్లో నిలిచారు. కన్నడ సూపర్‌స్టార్ యష్ హీరోగా తెరకెక్కుతున్న పాన్ ఇండియా చిత్రం టాక్సిక్‌లో ఆమె 'గంగ' అనే పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. మార్చి 19న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాలో నయనతార గన్ పట్టుకుని కనిపించిన ఫస్ట్ లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో హైప్ తెచ్చింది. ఫిలిం నగర్ వర్గాల సమాచారం ప్రకారం ఈ సినిమా కోసం నయనతార మొదట రూ.18 కోట్ల పారితోషికం డిమాండ్ చేయగా, నిర్మాతలతో చర్చల అనంతరం రూ.12 కోట్లకు అంగీకరించినట్లు తెలుస్తోంది. దాదాపు రూ.500 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కియారా అద్వానీ, రుక్మిణీ వసంత్ వంటి నటీమణులు ఉన్నప్పటికీ, నయనతార పాత్రే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని సమాచారం.



# మెమొరీస్ అప్‌లోడింగ్



'యానిమల్' సినిమాతో ఓవర్‌నైట్ స్టార్‌గా మారిన బ్యూటీ త్రిప్తి డిమ్రి.. ఇప్పుడు బాలీవుడ్‌లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్లలో ఒకరిగా నిలిచింది. ఆమె ఎంపిక చేసుకునే స్టోరీలు, నటనలోని వైవిధ్యం అభిమానులను విపరీతంగా అలరిస్తున్నాయి. ఇక తన అందచందాలతో యూత్‌ను ఊపేస్తున్న ఈ నయా నేషనల్ క్రష్ .. ఇప్పుడు సోషల్ మీడియానూ షేక్ చేస్తోంది. సంప్రదాయబద్ధమైన లుక్‌లో కనిపిస్తూనే, తనదైన స్టైల్‌లో కుర్రాళ్ల హార్ట్ బీట్ పెంచేస్తోంది. తాజాగా ఈ భామ పోస్ట్ చేసిన చీరకట్టు పిక్స్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలిచాయి. ఫ్యాషన్ డ్రెస్ లో ఎంత బోల్డ్‌గా కనిపిస్తుందో, శారీలోనూ అంతటి హొయలు ఒలికిస్తూ కుందనపు బొమ్మలా మెరిసిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్‌చేసిన ఈ ఫొటోలకు 'కాలం వీటిని జ్ఞాపకాలుగా మార్చేలోపు.. నా కథలో ఈ చాప్టర్‌ని అప్‌లోడ్ చేస్తున్న' అంటూ క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది త్రిప్తి. ఇక ఈ పిక్స్ చూసిన నెటిజన్లు 'స్టన్నింగ్ బ్యూటీ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. ఇక రెబల్ స్టార్ ప్రభాస్, సంచలన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న 'స్పిరిట్' సినిమాలో త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

## 'పెద్ది'పై ఆ వదంతులను నమ్మొద్దు.. క్లారిటీ ఇచ్చిన మేకర్స్



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'పెద్ది'. ఈ సినిమా ఫైనల్ రన్‌టైమ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లను నమ్మవద్దని చిత్ర బృందం అభిమానులకు విజ్ఞప్తి చేసింది. ముందుగా ప్రకటించినట్లే ఏప్రిల్ 30న సినిమాను గ్రాండ్‌గా విడుదల చేయడానికి అంతా సజావుగా సాగుతోందని స్పష్టం చేసింది. ఈ విషయంపై పబ్లిసిస్ట్ వంశీ శేఖర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "'పెద్ది' రన్‌టైమ్‌పై ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఎలాంటి వదంతులను నమ్మకండి. సినిమా ఫస్ట్ హాఫ్ మాత్రమే లాక్ అయింది. ఏఆర్ రెహమాన్ అందిస్తున్న నేపథ్య సంగీతం కూడా పూర్తయ్యే దశలో ఉంది. సెకండాఫ్ ప్రస్తుతం చివరి దశ షూటింగ్‌లో ఉండగా, ఎడిటింగ్ పనులు కూడా ఏకకాలంలో వేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అవీ పూర్తవుతాయి" అని ఆయన తెలిపారు. ఇదిలా ఉంటే.. కొద్ది గంటల క్రితం ఈ సినిమా నుంచి రామ్ చరణ్ ఇంట్రో సాంగ్ 'రై రై రా రా'ను విడుదల చేయగా, దీనికి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన ఈ ఫుల్ థ్రాటిల్ డ్యాన్స్ నంబర్‌ను ఆయనే స్వయంగా ఆలపించడం విశేషం. రామ్ చరణ్ తనదైన మాస్ ఎనర్జీ, గ్రేస్‌ఫుల్ స్టెప్పులతో అభిమానులకు విజువల్ ట్రీట్ ఇచ్చారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ, అనంత శ్రీరామ్ సాహిత్యం పాటకు మరింత ఊపునిచ్చాయి. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## తన జీవితంలో చోటుచేసుకున్న చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్న స్నేహ



తెలుగు వెండితెరపై తనదైన అభినయంతో హోమ్లీ ఇమేజ్‌ను సొంతం చేసుకున్న నటి స్నేహ, తన కెరీర్ ఆరంభంలో ఎదుర్కొన్న ఒక భయంకరమైన ప్రమాదం గురించి సంచలన విషయాలను పంచుకున్నారు. పెళ్లి తర్వాత సినిమాలకు కాస్త విరామం ఇచ్చిన ఈమె, అంతకుముందే ఒకానొక దశలో తన సినీ ప్రయాణం ముగిసిపోయిందని భావించినట్లు వెల్లడించారు. వరుస సినిమాలతో బిజీగా ఉన్న సమయంలో జరిగిన ఒక ఘోర ప్రమాదం తన జీవితాన్ని తలకిందులు చేసిందని, ఆ సమయంలో పడిన వేదనను గుర్తు చేసుకుంటూ ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. ఆ ప్రమాదంలో కాళ్లు, చేతులు, వీపు భాగానికి తీవ్రమైన గాయాలయ్యాయని స్నేహ తెలిపారు. కనీసం మంచం మీద నుండి లేచి నిలబడాలన్నా ఎనిమిది నెలల సమయం పడుతుందని వైద్యులు చెప్పడంతో, ఇక తను కెమెరా ముందుకు రావడం అసాధ్యమని అనుకున్నానని చెప్పారు. సరిగ్గా అదే సమయంలో దర్శకుడు కరు పళనియప్పన్ 'పార్థిబన్ కనవు' (తెలుగులో 'అంజలి ఐ లవ్యూ') కథతో ఆమెను సంప్రదించారు. తాను కదల్లేని స్థితిలో ఉన్నానని తెలిసినా, ఆ దర్శకుడు చూపిన నమ్మకం, ఇచ్చిన ప్రోత్సాహం తనలో కొత్త ఆశలు చిగురింపజేశాయని స్నేహ తెలిపారు.



# 50 లక్షలతో 120 కోట్లు తెచ్చిపెట్టిన సినిమా .. ఓటీటీలో!


**గుజరాతీలో తొలి 100 కోట్ల సినిమా**

**స్టార్స్ లేకుండా రికార్డు సృష్టించిన కంటెంట్**

**'సోనీలివ్' చేతికి స్ట్రీమింగ్ హక్కులు**

**ఈ నెల 6 నుంచి మొదలు కానున్న స్ట్రీమింగ్**

సాధారణంగా చాలా తక్కువ బడ్జెట్లో తెరకెక్కడం .. భారీవసూళ్లను రాబట్టడం మలయాళ ఇండస్ట్రీలో ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అయితే ఈ మధ్య కాలంలో తమిళ .. కన్నడ సినిమాలు ఆ బాటలోనే ముందుకు వెళుతున్న తీరు కనిపిస్తుంది. రీసెంటుగా గుజరాతి సినిమా కూడా ఇలాంటి ఒక రికార్డును తొలిసారిగా తన ఖాతాలో వేసుకుంది. ఆ సినిమా పేరే 'లాలో: కృష్ణ సదా సహాయతే'. ఈ మధ్య కాలంలో చుట్టుపక్కల సినిమా ఇండస్ట్రీలన్నీ మాట్లాడుకునేలా చేసిన సినిమా ఇది. గుజరాతీలో రూపొందిన ఈ సినిమా, క్రితం ఏడాది అక్టోబర్ 10వ తేదీన అక్కడ విడుదలైంది. రీవా రిచ్ .. శ్రుహాద్ గోస్వామి .. కరణ్ జోషి .. తదితరులు ఈ సినిమాలో నటించారు. అంకిత్ సఖియా దర్శకత్వం వహించిన ఈ సినిమాకి స్మిత్ జె సంగీతాన్ని అందించాడు. గుజరాతీలో ఈ సినిమా ఎలాంటి అంచనాలు లేకుండా విడుదలైంది. కేవలం 50 లక్షల బడ్జెట్‌తో నిర్మితమైన ఈ సినిమా, 120 కోట్లను వసూలు చేయడం విశేషం. గుజరాతీ ఇండస్ట్రీలో తొలిసారిగా 100 కోట్లను రాబట్టిన సినిమా ఇది. స్టార్ హీరోలు .. స్టార్ హీరోయిన్స్ లేని సినిమా. గ్రాఫిక్స్ గారడీలు కనిపించని సినిమా. అలాంటి ఈ సినిమా ఈ స్థాయి విజయాన్ని సాధించడం గురించి అంతా విశేషంగా చెప్పుకున్నారు. నిజానికి ఈ సినిమా ఎప్పుడు ఓటీటీకి వస్తుందా అని చాలా రోజులుగా వెయిట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ నుంచి ఈ సినిమాను స్ట్రీమింగ్ చేయనున్నట్టుగా 'సోనీలివ్' ప్రకటించింది. ఒక సాధారణ ఆటో డ్రైవర్ జీవితం .. కృష్ణుడి అనుగ్రహం కారణంగా ఎలా ప్రభావితమైందనేది కథ. ఓటీటీ వైపు నుంచి ఈ సినిమా ఏ రేంజ్ లో కనెక్ట్ అవుతుందనేది చూడాలి.



# పిల్లలకు బరువు సమస్య!



ఆరోగ్యంగా ఉండటం, త్వరగా వృద్ధాప్యం ముంచుకురాకుండా చూసుకోవటంలో చాలా అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. చిన్నప్పటి నుంచే తగినంత నీరు తాగటం, ఆహారంలో తక్కువ కేలరీలు తీసుకోవటం, పోషకాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవటం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయటం వంటివన్నీ ముఖ్యమే. పిల్లల్లో ఊబకాయం పెరుగుతున్న ప్రస్తుత రోజుల్లో ఇది మరింత అవసరం. పిల్లల ఆరోగ్యం, రోజువారీ వ్యవహారాలను ఊబకాయం గణనీయంగా దెబ్బతీస్తుంది. పిల్లల్లో అధిక బరువు, ఊబకాయానికి పలు అంశాలు కారణమవుతుంటాయి. చాలామందిలో ఒకటి కన్నా ఎక్కువ కారణాలూ కనిపిస్తుంటాయి. వీటిని గుర్తించి, పరిష్కరించాలి.

### ఫుడ్ హ్యాబిట్స్..

ప్రస్తుతం పిల్లల ఆహార అలవాట్లు మారిపోయాయి. అధిక కేలరీలు, తక్కువ పోషకాలతో కూడిన పదార్థాలు.. ఎక్కువ షుగర్ ప్రొడక్ట్స్ వాడకం పెరిగింది. ఇవన్నీ బరువు పెరిగేలా చేసేవే. పోషకాలు లేని జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్, తీపి పానీయాలు దీన్ని మరింత ఎక్కువ చేస్తున్నాయి.





### ఆటలు లేకపోవడం..

ఒకప్పటిలా పిల్లలు ఇప్పుడు ఆరుబయట ఆడుకోవటం తగ్గింది. ఉదయం బడికి వెళ్లటం, ఇంటికి రాగానే హోం వర్క్, ట్యూషన్లు.. లేదంటే ఫోన్లతో గడపటం. శారీరక శ్రమ లేకపోతే కేలరీలు ఖర్చు కావటమూ తగ్గుతుంది. ఫలితంగా బరువూ పెరుగుతారు.

### పేరెంట్స్ లైఫ్ స్టైల్..

పేరెంట్స్ లైఫ్స్టైల్ పిల్లలపై ఎఫెక్ట్ చూపిస్తుంది. ఇంట్లో పెద్దవాళ్లను చూసే పిల్లలు నేర్చుకుంటారు. అనారోగ్యకరమైన ఆహార అలవాట్లు, బద్ధకం పిల్లలకూ వస్తాయి.

### సైకాలజికల్ ఇష్యూస్..

పెద్దవాళ్లు తమ పిల్లలను ఇతరులతో పోల్చి తిట్టడం.. తీవ్ర ఒత్తిడి, ఆందోళనకు గురిచేస్తాయి. కొందరు భావోద్వేగాలను అణచుకోవటానికి అతిగానూ తినొచ్చు. ఇవన్నీ బరువు పెరగటానికి దోహదం చేస్తాయి. నివాస ప్రాంతంలో ఆరోగ్యకరమైన ఆహారం, ఆడుకోవటానికి తగినంత స్థలం అందుబాటులో లేకపోవటమూ పిల్లల బరువు మీద ప్రభావం చూపుతుంది.

### టీవీలు.. సెల్‌ఫోన్లు..

టీవీలు, ఫోన్ల మోజులో ఎంతోమంది పిల్లలు రాత్రి పూట చాలా సేపటి వరకు మెలకువగా ఉండిపోతున్నారు. దీంతో ఒంట్లో హార్మోన్లు అస్తవ్యస్తమవుతాయి. ఆకలి పెరుగుతుంది. ఎక్కువ తినటం వల్ల బరువు పెరుగుతారు. అనారోగ్యకరమైన ఆహారం, కూల్డ్రింక్స్ ప్రకటనలు పిల్లల తిండి అలవాట్ల మీద గణనీయమైన ప్రభావాన్నే చూపుతున్నాయి.






### సొల్యూషన్ ఇలా..

పిల్లలు అది కావాలి, ఇది కావాలని మారాం చేయటం నిజమే అయినా ఆరోగ్యకరమైన ఆహారం తినేలా ప్రోత్సహించాలి. పండ్లు, కూరగాయలు, నిండు గింజ ధాన్యాలు, పాలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి. మాంసాహారులైతే గుడ్లు, చేపలు, చికెన్ ఇవ్వచ్చు. తీపి పానీయాలు, తవుడు పూర్తిగా తీసేసిన ధాన్యాలతో చేసిన పదార్థాలు పరిమితం చేయాలి. ప్లేట్లో అన్నం, చపాతీ, కూరలు ఎంత మోతాదులో ఉండాలో నేర్పించాలి. ఆకలిని గుర్తించి, దానికి తగినట్టుగా తినటం అలవాటు చేయాలి. వీలైనప్పుడల్లా కుటుంబ సభ్యులంతా కలిసి భోజనం చేయాలి. దీంతో పెద్దవాళ్లను చూసి పిల్లలు నేర్చుకుంటారు. అనోన్య బంధాలూ ఏర్పడతాయి. ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలు, కంప్యూటర్లు చూసే సమయాన్ని పరిమితం చేయాలి. వీలైనంత ఎక్కువగా ఆరుబయట ఆడుకోవటానికి ప్రోత్సహించాలి. రోజుకు కనీసం గంట సేపైనా చురుకుగా ఉండేలా చూడాలి. బడిలోనూ వ్యాయామ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి. జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌కు బదులు ఇంట్లో తయారుచేసిన పోషకాలతో కూడిన చిరుతిళ్లు ఇవ్వాలి. పండ్లు, పెరుగు వంటి వాటినీ చిరుతిండిగా ఇవ్వచ్చు. అతి ముఖ్యమైన పానీయం నీరేనని గుర్తించేలా చేయాలి. సోడాలు, తీపి పానీయాలు, చక్కెర కలిపిన పండ్ల రసాలు వీలైనంత తగ్గించాలి. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలి. ఎత్తుకు తగిన బరువు పెరుగుతున్నారో లేదో చూసుకోవాలి. ఎక్కువగా బరువు పెరుగుతుంటే అప్రమత్తం కావాలి. అన్నింటికన్నా ముఖ్యంగా పిల్లలు కంటి నిండా నిద్రపోయేలా చూడాలి. మంచి అలవాట్లను ఆచరిస్తుంటే ప్రోత్సహించాలి. చాక్లెట్లు, బిస్కట్లు, చిప్స్ వంటివి కాకుండా ఇతరత్రా బహుమతులు ఇవ్వాలి.

# కట్ చేసిన పండ్ల రంగు మారుతోందా?

యాపిల్ లాంటి కొన్ని పండ్లను కోసినప్పుడు ఆ పండ్ల ముక్కలు రంగు మారుతాయి. అలా రంగు మారకుండా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో కావాలి. పండ్లు కోసినప్పుడు రంగు మారడానికి కారణం ఆక్సిడేషన్ ప్రాసెస్. ఈ ఆక్సిడేషన్ జరగకుండా ఆపగలిగితే పండ్ల ముక్కలు రంగు మారకుండా ఉంటాయి. అదెలాగో తెలుసుకుందాం.



- పండ్లను నీళ్ల మధ్యలో ఉంచి కోసినట్లయితే ఆక్సిడేషన్‌ను ఆపొచ్చు. దీనివల్ల పండ్ల ముక్కలు బ్రౌన్ రంగులోకి మారకుండా తాజాగా కనిపిస్తాయి.
- కోసిన పండ్ల ముక్కలను అల్లం నీటిలో వేస్తే కూడా రంగు మారకుండా ఉంటాయి. అల్లంలో ఉండే సిట్రిక్ యాసిడ్ ఆక్సిడేషను నిలిపివేస్తుంది.
- ఒక గిన్నెలో కొంచెం ఉప్పు వేసి అందులో పండ్ల ముక్కలను వేసి బాగా కలుపాలి. ఒక నిమిషం తర్వాత నీటితో క్లీన్ చేసి పక్కన పెట్టుకుంటే అవి రంగు మారకుండా ఉంటాయి.\
- గోరు వెచ్చని నీటిలో ఒక టేబుల్ స్పూన్ తేనె వేసి కలుపాలి. అందులో పండ్ల ముక్కలను వేసి, 30 సెకన్ల తర్వాత బయటకు తీయాలి. ఇలా చేస్తే సుమారు 8 గంటలపాటు పండ్ల ముక్కలు రంగు మారకుండా తాజాగా కనిపిస్తాయి.
- ఒక గిన్నెలో నీళ్లు పోసి ఒక స్పూన్ నిమ్మరసం వేసి బాగా కలపాలి. తర్వాత దానిలో పండ్ల ముక్కలను వేసి తీసినట్లయితే రంగు మారకుండా ఫ్రెష్‌గా ఉంటాయి.
- నిమ్మ రసం అందుబాటులో లేకపోతే పైనాపిల్ లేదా ఆరెంజ్ జ్యూస్ కూడా వాడొచ్చు. వాటిలో కూడా సిట్రిక్ యాసిడ్ ఉంటుంది.

# టోమాటో కెచప్ ఇంట్లోనే చేసుకుంటే పోలా?

ఇటీవల హైదరాబాద్ చుట్టుపక్కల కొన్ని హోటల్స్‌లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టిన సంగతి తెలిసిందే. కిచెన్ క్లీన్‌గా లేకపోవడం, ఎక్స్‌పైరీ డేట్ అయిపోయిన వాటితో ఫుడ్ ఐటమ్స్ తయారీ, పురుగులు, లేబుల్ లేని ఫుడ్, లైసెన్స్ లేని ఫుడ్ ఐటమ్స్ ఇలాంటి వాటిని గుర్తించి ఆయా హోటళ్లు, బేకరీలకు నోటీసులు జారీ చేశారు. అక్కడ ఎలాంటి ఫుడ్ ఐటమ్స్ కొనడం, తినడయం చేయొద్దని కూడా జనాలకు సూచించారు. ఇలాంటివి విన్నప్పుడు బయటి ఫుడ్ తినాలంటేనే భయం వేస్తుంటుంది. ముఖ్యంగా కొన్ని బేకరీల్లో కాలం చెల్లిన ఫుడ్ ఐటమ్స్ ఎక్కువగా అమ్ముతుంటారు. అందులో టోమాటో కెచప్(సాస్) ఒకటి. అలాంటివి బయటి తిని అనారోగ్యం కొని తెచ్చుకునే కంటే ఇంట్లోనే టోమాటో సాస్ తయారుచేసుకోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం.



### కావాల్సినవి:

టొమాటోలు – 2.5 కిలోలు; వెల్లుల్లి రేకలు-15; అల్లం– 3 అంగుళాల ముక్క; ఎండు మిర్- 6; కిస్‌మిస్-అర కప్పు; యాపిల్ సిడెర్ వినెగర్- అర కప్పు; ఉప్పు – టేబుల్ స్పూన్; చక్కెర- 6 టేబుల్ స్పూన్‌లు; సోడియం బెంజోయేట్ – పావు టీ స్పూన్ నీటిలో వేసి కరిగించినది.



### ఇలా చేయాలి..

టొమాటోలను క్లీన్‌గా కడిగి.. ఆరిన తర్వాత తొడిమలు తొలగించాలి. ఇప్పుడు టొమాటోలన్నింటినీ మీడియం సైజు ముక్కలుగా తరగాలి. వెల్లుల్లి రేకల పొట్టు వలిచి సన్నగా తరుక్కోవాలి. అల్లం కడిగి చెక్కు తీసి తరగాలి కిస్‌మిస్‌లు కడిగి పక్కన పెట్టుకోవాలి ఎండు మిర్చి తొడిమలు తీసి, మధ్యకు విరిచి గింజలను తొలగించాలి. మందపాటి పాత్రను స్టవ్ మీద పెట్టి టొమాటో ముక్కలు, అల్లం, వెల్లుల్లి ముక్కలు, ఎండు మిర్చి, కిస్‌మిస్, వినెగర్, ఉప్పు, చక్కెర వేసి గరిటెతో కలిసి మీడియం మంట మీద ఉడికించాలి. మధ్యలో కలుపుతూ టొమాటో ముక్కలు మెత్తబడే వరకు ఉడికించి పాత్రను దించేయాలి □వేడి తగ్గిన తరవాత మిక్సీలో వేసి మెత్తగా చేయాలి. ఈ మిశ్రమాన్ని పెద్ద చిల్లులున్న స్ట్రెయినర్‌లో వడబోయాలి. టొమాటో తొక్కలు, మెదగని గింజల వంటివి పైన నిలుస్తాయి. వడబోసిన ద్రవాన్ని బాణలిలో వేసి కొంత సేపు మీడియం మంట మీద ఉడికించాలి. దగ్గరవుతున్నప్పుడు సన్నమంట మీద ఉడికించాలి. టొమాటో ద్రవం కెచప్‌కు తగిన చిక్కదనం సంతరించుకోవాలంటే అరగంటకు పైగా ఉడకాలి. అడుగు పట్టకుండా మధ్యలో కలుపుతూ ఉండాలి. దించడానికి ముందు టీ స్పూన్ వేడి నీటిలో పావు టీ స్పూన్ సోడియం బెంజోయేట్ కలిపి కెచప్‌లో పోసి కలిపి స్టవ్ ఆపేయాలి. సోడియం బెంజోయేట్ కెచప్ నిల్వ ఉండడానికి దోహదం చేసే ప్రిజర్వేటివ్. కెచప్‌ను ఫ్రిజ్‌లో పెట్టుకుని వాడుకునే వాళ్లు సోడియం బెంజోయేట్ లేకుండా కూడా సాస్ చేసుకోవచ్చు. కెచప్ ఉడికేలోపు సాస్ నిల్వ చేయడానికి గాజు బాటిల్‌ని సిద్ధం చేసుకోవాలి. బాటిల్‌ని శుభ్రంగా కడిగిన తర్వాత వేడి నీటిలో ముంచి తీసి ఆరబెట్టాలి కెచప్ చల్లారిన తర్వాత సీసాలో వేసి గట్టిగా మూత పెట్టాలి. దీనిని స్నాక్స్‌లోకి తినవచ్చు లేదా భోజనానికి ముందు ఆకలి పెంచడానికి అప్పిటైజర్‌గా కూడా పని చేస్తుంది.




## జపాన్ అగ్రి బిజినెస్‌కు
# మహీంద్రా టాటా..

పోర్ట్‌ఫోలియో క్రమబద్ధీకరణలో భాగంగా జపనీస్ అగ్రిమెషనరీ బిజినెస్ నుంచి వైదొలగేందుకు నిర్ణయించుకున్నట్లు దేశీ ఆటో రంగ దిగ్గజం మహీంద్రా అండ్‌మహీంద్రా(ఎంఅండ్‌ఎం)వెల్లడించింది.వ్యూహాత్మక సమీక్ష ప్రభావంతో తాజా నిర్ణయం తీసుకున్నట్లు తెలియజేసింది. జపాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మిత్సుబిషీ మహీంద్రా అగ్రికల్చరల్ మెషీనరీ(ఎంఏఎం) బోర్డు వ్యవసాయ రంగ మెషీనరీ బిజినెస్ నుంచి తప్పుకునేందుకు అనుమతించినట్లు తెలియజేసింది. అయితే వీటికి సంబంధించిన విడిభాగాలు, ఉత్పత్తుల వారంటీ సర్వీసులను కొనసాగించనున్నట్లు పేర్కొంది. అక్కడి చట్టాల ప్రకారం ఎంఏఎం మూసివేత, లిక్విడేషన్ ప్రక్రియకు తెరతీయనున్నట్లు తెలియజేసింది.లాభదాయక స్థితిని సాధించేందుకు పలురకాల వ్యవస్థాగత చర్యలు చేపట్టినప్పటికీ నష్టాలు వాటిల్లుతూనే ఉన్నట్లు వెల్లడించింది. దీంతో బిజినెస్ దీర్ఘకాలిక నిర్వహణ, ఆర్థికంగా కొనసాగగలిగే పరిస్థితులపై పూర్తిస్థాయి



పరిశీలన చేపట్టాక భవిష్యత్‌లో నిలకడగా బిజినెస్‌ను కొనసాగించడం సవాలేనని నిర్ణయానికి వచ్చినట్లు వివరించింది. లిక్విడేషన్ ప్రక్రియ ముగిశాక నష్టాలకు ప్రమోటర్ గ్రూప్ ఫండింగ్‌ను చేపడుతుందని తెలియజేసింది. వెరసి 2027 తొలి అర్ధభాగంలో అగ్రికల్చరల్ మెషీనరీ తయారీ, అమ్మకాలను నిలిపివేయనున్నట్లు వెల్లడించింది.

## వార్ ఎఫెక్ట్.. సరఫరా గొలుసుపై
# ప్రభావం ఉండకపోవచ్చు: చంద్రశేఖరన్



పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఇజ్రాయెల్ అమెరికా, ఇరాన్ యుద్ధం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో తాజాగా టాటా గ్రూప్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ స్పందించారు. ప్రస్తుత యుద్ధ వాతావరణం ప్రపంచ సరఫరా గొలుసును పెద్దగా ప్రభావితం చేయబోదన్నారు. ఝార్ఖండ్‌లో జంషెడ్‌పుర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..పశ్చిమాసియాలో పనిచేస్తున్న తమ ఉద్యోగుల భద్రత కోసం పలు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ''అమెరికా ఇజ్రాయెల్, ఇరాన్ రూపంలో ఎదురైన భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచ సరఫరా గొలుసుపై ప్రభావం ఉండదనే భావిస్తున్నా. త్వరలోనే ఈ పరిస్థితులు సర్దుకుంటాయని ఆశిస్తున్నా. పశ్చిమాసియా నుంచి సున్నపురాయి వంటి ముడి పదార్థాలను టాటా స్టీల్ సేకరిస్తోంది. అక్కడ నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను కంపెనీ వెతుకుతోంది. ప్రస్తుతానికి సరిపడా నిల్వలు ఉన్నాయి. ఈ యుద్ధ వాతావరణం కంపెనీపై ఎలాంటి ప్రభావం చూపదు. కొన్ని రోజులు కంపెనీ కార్యకలపాలకు ఆటంకాలు ఎదురవ్వచ్చు. కానీ పరిస్థితులు సర్దుకున్నాక కంపెనీ సాధారణ స్థితికి చేరుకుంటుంది'' అని చంద్రశేఖరన్ అన్నారు.

# రూ.1.40 కోట్ల బెంజ్ కారు: దీని గురించి తెలుసా?

న్యూఢిల్లీ: మెర్సిడెస్ బెంజ్ తన లగ్జరీ ఎంపీవీ మోడల్ 'వి-క్లాస్' ఫేస్‌లిఫ్ట్ వెర్షన్‌ను అధికారికంగా విడుదల చేసింది. ఎక్స్ షోరూం ప్రారంభ ధర రూ.1.40 కోట్లుగా ఉంది. ఈ కారు బుకింగ్‌లు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. రూ.5 లక్షలతో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చు. ఈ మార్చి చివరి నుంచే డెలివరీలు మొదలుకానున్నాయి. 'మేక్ ఇన్ ఇండియా'పై కంపెనీ నిబద్ధతను తెలియజేస్తూ.., నేరుగా విదేశాల నుంచి దిగుమతి చేసుకోకుండా, మహారాష్ట్రలోని పుణెలో ఉన్నతన చాకన్ కర్మాగారంలోనేఅసెంబుల్ చేయనుంది. డిజైన్ విషయానికి వస్తే... ఏఎంజీ లైన్ ప్యాకేజీని జోడించడం వల్ల మరింత స్పోర్టీ లుక్ వచ్చింది. విశాలమైన క్యాబిన్, మసాజ్, వెంటిలేషన్ సీట్లు, 64-రంగుల యాంబియెంట్ లైటింగ్ వంటి ఫీచర్లు ఉన్నాయి. పెంపుడు జంతువులను కూడా తమ వెంట తీసుకెళ్లే సదుపాయం ఉంది. ఇందులో డీజిల్, పెట్రోల్ రెండు వెర్షన్లు అందుబాటులో ఉన్నాయి. వీ300 డీ డీజిల్ మోడల్ 237 హెచ్‌పీ పవర్‌ను జనరేట్ చేసే 2-లీటర్ టర్బో ఇంజిన్‌తో వస్తుంది. ఇక వీ300 పెట్రోల్ మోడల్ 231 హెచ్‌పీ పవర్‌ను ఇచ్చే 2-లీటర్ ఇంజిన్‌తో పాటు మైల్డ్-హైబ్రిడ్ టెక్నాలజీని కూడా కలిగి ఉంది. ఈ రెండు ఇంజిన్లకు 9-స్పీడ్ ఆటోమేటిక్



ట్రాన్స్‌మిషన్‌ను జత చేశారు. సేఫ్టీ కోసం మల్టిపుల్ ఎయిర్‌బ్యాగ్‌లు, 360-డిగ్రీ కెమెరా, అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్ వంటివి ఉన్నాయి. అబ్సిడియన్ బ్లాక్, హై-టెక్ సిల్వర్, ఆల్పైన్ గ్రే, సోడాలైట్ బ్లూ, క్రిస్టల్ వైట్ వంటి అద్భుతమైన రంగుల్లో ఇది అందుబాటులో ఉంది.

# పక్క దేశాలపై ఇరాన్ దాడులు ఎందుకు ?

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ ప్రపంచమంతా ఇరాన్ తీరును నిశితంగా పరిశీలిస్తోంది. అగ్రరాజ్యం అమెరికా, చిరకాల ప్రత్యర్థి ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో ఇరాన్.. తన క్షిపణులను నేరుగా వారిపై ప్రయోగించాల్సింది పోయి, ఇరాక్, కువైట్, బహ్రెయిన్ వంటి పొరుగు దేశాల వైపు మళ్లించడం అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారితీసింది. ఇది ఇరాన్ బలహీనతా? లేక వ్యూహాత్మక చర్యలో భాగంగా వేస్తున్న ఒక ఎత్తుగడా? అసలు పొరుగు దేశాలే ఇరాన్ టార్గెట్‌గా ఎందుకు అయ్యాయి? అనే అంశాలు చూద్దాం.



### మిత్రదేశాల ముసుగులో శత్రు స్థావరాలు

ఇరాన్ తన క్షిపణులను ఇరుగుపొరుగు దేశాల వైపు మళ్లించడానికి ప్రధాన కారణం.. ఆయా దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలు. బహ్రెయిన్, కతార్, కువైట్.. వంటి ప్రాంతాల్లో అమెరికాకు చెందిన భారీ నౌకాదళ, వైమానిక స్థావరాలు ఉన్నాయి. అమెరికా ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై దాడుల్లో ఈ స్థావరాలే వేదికలయ్యాయి. దాంతో నేరుగా వాషింగ్టన్‌పై దాడి చేయలేని ఇరాన్, అమెరికా ప్రయోజనాలను దెబ్బతీయడానికి పక్కనే ఉన్న ఈ లాజిస్టిక్ హబ్‌లను లక్ష్యంగా చేసుకుంది.

### ప్రాంతీయ ఆధిపత్యం

గతంలో ఇరాన్ తన పరోక్ష యుద్ధాన్ని (ప్రాక్సీ వార్) హమాస్, హిజ్బుల్లా ద్వారా నడిపించేది. కానీ 2024 25 మధ్య జరిగిన పరిణామాల్లో ఇజ్రాయెల్ ఈ గ్రూపులను తీవ్రంగా దెబ్బతీసింది. సిరియాలో అస్సాద్ ప్రభుత్వం కూలిపోవడం, హిజ్బుల్లా నాయకత్వం తుడిచిపెట్టుకుపోవడంతో ఇరాన్ కొంత బలహీనపడింది. దీంతో తన ఉనికిని చాటుకోవడానికి పొరుగున ఉన్న ఇజ్రాయెల్ అనుకూల దేశాలపై ఒత్తిడి పెంచడం ద్వారా ప్రాంతీయ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది.

### ఇంధన మార్కెట్ అతలాకుతలం

యుద్ధం కొనసాగితే ఇరాన్ ఆర్థికంగా తట్టుకోవడం కష్టం. అందుకే, గల్ఫ్ దేశాల్లోని చమురు మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను బ్లాక్ మెయిల్ చేసే వ్యూహాన్ని ఇరాన్ అమలు చేస్తోందని అభిప్రాయాలున్నాయి.

హోర్ముజ్ జలసంధి మూసివేత: ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన ఈ మార్గాన్ని మూసివేయడం ద్వారా అమెరికా, ఐరోపా దేశాలపై ఒత్తిడి తీసుకురావాలన్నది ఇరాన్ ప్లాన్. పొరుగు దేశాలపై దాడులు చేయడం ద్వారా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇస్తే తమ ఆర్థిక వ్యవస్థలు కూడా కుప్పకూలుతాయనే హెచ్చరికను ఇరాన్ పంపాలని చూస్తున్నట్లు కొందరు చెబుతున్నారు.

### అంతర్గత అశాంతి నుంచి దృష్టి మళ్లింపు

2026 జనవరి నుంచి ఇరాన్ తీవ్రమైన దేశీయ నిరసనలతో అట్టుడుకుతోంది. ఆర్థిక సంక్షోభం, కరెన్సీ పతనం వల్ల ప్రజల్లో వ్యతిరేకత పెరిగింది. బయటి దేశాలపై దాడులు చేయడం ద్వారా జాతీయవాదాన్ని రగిల్చి ప్రజల దృష్టిని అంతర్గత సమస్యల నుంచి మళ్లించాలని ఇరాన్ పాలకులు చూస్తున్నారు.

### అధికార మార్పు భయం

ప్రస్తుతం ఇజ్రాయెల్, అమెరికా ఇరాన్‌లో పాలన మార్పును లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతోన్న దాడులు కేవలం సైనిక స్థావరాల మీద మాత్రమే కాదు, కీలక నాయకత్వంపై కూడా జరుగుతున్నాయి. తమ మనుగడకు ప్రమాదం ఏర్పడినప్పుడు ఒక గాయపడిన సింహంలా ఇరాన్ తన పక్కనున్న చిన్న దేశాలపై విరుచుకుపడుతోంది. ఇది అమెరికాను చర్చల వైపు మళ్లించే ప్రయత్నం కూడా కావచ్చని కొందరి అభిప్రాయం.

# అదే ఆట.. అదే పోజు.. మూడు ఇన్నింగ్స్‌లూ సూపర్

**టీ20 ప్రపంచకప్ 2026లో భారత్ 'క్వార్టర్ ఫైనల్'లో విండీస్‌ను చిత్తు చేయడంలో సంజు శాంసన్‌దే కీలక పాత్ర. అజేయంగా 97 పరుగులు చేసి టీమ్‌ను గెలిపించాడు. ఆఖర్లో బౌండరీ కొట్టాక సంజు చేసిన విజయనాదం చూస్తే.. మరో ఇద్దరు స్టార్లను గుర్తుకుతెచ్చింది. మరి ఆ ప్లేయర్లు ఎవరు? అప్పుడు ఎలా గెలిపించారో ఓ లుక్కేద్దాం...**




### ఫస్ట్ బ్యాటర్ యువీ..

ఎంఎస్ ధోనీ నాయకత్వంలో టీమ్‌ఇండియా 2011 వన్డే ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. క్వార్టర్ ఫైనల్‌లో అత్యంత ప్రమాదకరమైన ఆస్ట్రేలియాతో టీమ్‌ఇండియా తలపడింది. ఐసీసీ టోర్నీలంటే చెలరేగిపోవడం ఆసీస్‌కు అలవాటు. కానీ, యువరాజ్ సింగ్ ముందు మాత్రం ఆ జట్టు పప్పులు ఉడకలేదు. 261 పరుగుల లక్ష్య ఛేదనలో సచిన్ (53), గంభీర్ (50) హాఫ్ సెంచరీల దెబ్బకు అలవోకగా విజయం సాధిస్తుందని అంతా భావించారు. అనూహ్యంగా స్వల్ప వ్యవధిలో వికెట్లు చేజార్చుకొని ఇబ్బందుల్లో పడిన టీమ్‌ఇండియాను సురేశ్ రైనా (34*)తో కలిసి యువరాజ్ (57*) ఆదుకొన్నాడు. చివరివరకూ క్రీజ్‌లో ఉండి జట్టును గెలిపించాడు. బ్రెట్ లీ, షాన్ టైట్, మిచెల్ జాన్సన్ వంటి పేసర్లను తట్టుకొని పరుగులు రాబట్టిన యువీ.. మ్యాచ్ ముగిసిన తర్వాత సింహనాదమే చేశాడు. తొలుత బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి ఆసీస్‌ను దెబ్బకొట్టి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

### ఈసారి కింగ్ కోహ్లీ..

ఛేజింగ్ కింగ్ అని విరాట్‌ను ఊరికనే అనరు. లక్ష్యం ఎంతైనా సరే.. అతడు బరిలోకి దిగాడంటే హాంఫట్ అయిపోవాల్సిందే. ఇప్పుడు విండీస్‌పై సంజు ఘనత సాధించాడు కానీ.. టీ20 ప్రపంచకప్‌ల్లో లక్ష్య ఛేదనకు దిగినప్పుడు అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్‌గా మొన్నటివరకూ విరాట్ కోహ్లీనే ఉన్నాడు. 2016లో ఆస్ట్రేలియా, 2021లో పాక్‌పై 82 పరుగులు చొప్పున చేసి అజేయంగా నిలిచాడు. 2016లోనూ భారత్ సెమీస్‌కు చేరుకోవాలంటే ఆసీస్ అనే అడ్డంకిని అధిగమించాల్సిన పరిస్థితి. అదికూడా ఈసారి ఆడినట్టే 'క్వార్టర్ ఫైనల్' లాంటిదే. 161 పరుగుల లక్ష్య ఛేదనలో విరాట్ కోహ్లీ (82: 51 బంతుల్లో) అదరహో అనిపించాడు. ఏడు బంతుల్లో 4 పరుగులు కొట్టాల్సిన సమయంలో ధోనీ స్ట్రైకింగ్‌లో ఉన్నాడు. కానీ, సింగిల్ తీసే అవకాశం వచ్చినా వద్దని కోహ్లీని ధోనీ వారించాడు. విన్నింగ్ షాట్‌గా బౌండరీ కొట్టి విరాట్ కోహ్లీ సంతోషంతో మైదానంలో అలా ఉండిపోయాడు.

### ఇప్పుడు సంజు..


ఓడితే ఇంటిముఖం పట్టాల్సిందే. అవతలి వైపు దూకుడుగా ఆడే విండీస్. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పిచ్‌పై భారత బౌలర్ల దెబ్బకు వెస్టిండీస్ 200లోపే పరుగులు చేయగలిగింది. అయితే, ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్‌లో లేదు. వన్‌డౌన్ వచ్చిన ఇషాన్ కిషన్ బ్యాటింగ్‌లో నిలకడలేదు. సూర్యకుమార్ కూడా త్వరగా పెవిలియన్‌కు చేరాడు. తిలక్ వర్మ కొన్ని మెరుపులు మెరిపించాడు. పాండ్య దూకుడు కొద్దిసేపే ఉంది. ఓ ఎండ్‌లో మాత్రం పాతుకుపోయిన ఓపెనర్ సంజు శాంసన్ (97*: 50 బంతుల్లో 12 ఫోర్లు, 4 సిక్స్‌లు) చివరివరకూ ఉండి జట్టును గెలిపించాడు.



# క్రీడలు

## ప్రపంచకప్ సెమీస్‌కు రిఫరీలు ఎవరంటే..

టీ20 ప్రపంచ కప్ 2026 సెమీస్‌కు మ్యాచ్ రెఫరీలుగా, అంపైర్లుగా ఎవరు వ్యవహరించనున్నారో ఐసీసీ వెల్లడించింది. జవగల్ శ్రీనాథ్, ఆండీ పైక్రాఫ్ట్‌లను కోల్‌కతా, ముంబయి వేదికగా మార్చి 4, 5 తేదీల్లో జరగనున్న మ్యాచ్‌లకు రెఫరీలుగా నియమించింది. ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్; వాంఖడే స్టేడియంలో టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ఈడెన్‌గార్డెన్స్‌లో జరగనున్న మొదటి సెమీఫైనల్ (దక్షిణాఫ్రికా vs న్యూజిలాండ్)కు శ్రీనాథ్ మ్యాచ్ రెఫరీ బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆన్‌ఫీల్డ్ అంపైర్లుగా రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్, అలెక్స్ వార్ఫ్ వ్యవహరించనున్నారు. నితిన్ మేనన్ థర్డ్ అంపైర్‌గా, రాడ్ టక్కర్ నాలుగో అంపైర్‌గా నియమితులయ్యారు. ముంబయిలోని వాంఖడే స్టేడియంలో గురువారం జరగనున్న రెండో



సెమీఫైనల్స్‌లో (టీమ్‌ఇండియా vs ఇంగ్లాండ్) పైక్రాఫ్ట్ రెఫరీగా వ్యవహరించనున్నాడు. క్రిస్ గఫానీ, అల్లాహుద్దీన్ పాలేకర్ ఆన్ ఫీల్డ్ అంపైర్లుగా విధులు నిర్వహించనున్నారు. ఆడ్రియన్ హోల్డ్‌స్టాక్ థర్డ్ అంపైర్‌గా, పాల్ రీఫెల్ ఫోర్త్ అంపైర్‌గా నియమితులయ్యారు.


# ఆ రెండు జట్ల మధ్య హోరాహోరీ పోరు తథ్యం: గావస్కర్

భారత్, ఇంగ్లాండ్ మధ్య సెమీస్ పోరు హోరాహోరీగా జరగనుందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ అన్నాడు. అయితే భారత్‌కే కాస్త విజయవకాశాలెక్కువ అని అభిప్రాయపడ్డాడు. బ్యాటింగ్ లైనప్, బుమ్రానే దానికి కారణమన్నాడు. 'ఇరు జట్లూ సమతూకంగా ఉన్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో బలంగా ఉన్నాయి. మిడిలార్డర్ కూడా బాగుంది. ఇంగ్లాండ్ జట్టులోని కొందరు ఆటగాళ్లకు ఐపీఎల్ ఆడిన అనుభవముంది. వారికి భారత్‌లోని పరిస్థితులపై అవగాహన ఉంది. అందుకే ఈ పోరు హోరాహోరీగా సాగనుంది' అని విశ్లేషించాడు. అలాగే బుమ్రా నైపుణ్యం గురించి కూడా మాట్లాడాడు. పవర్‌ప్లేలో బుమ్రాతో బౌలింగ్ చేయించాలని సూచించాడు. 'బుమ్రా పవర్‌ప్లేలో కనీసం రెండు ఓవర్లైనా బౌలింగ్ వేయాలి. జోష్ బట్లర్, ఫిల్ సాల్ట్, హ్యారీ బ్రూక్ వికెట్లను మ్యాచ్ ప్రారంభంలో తీయగలిగితే ఇంగ్లాండ్ వెన్ను విరిచినట్లవుతుంది. కానీ బుమ్రాతో అయిదు ఓవర్ల తర్వాత బౌలింగ్ వేయిస్తే పెద్దగా ప్రయోజనముండదు. ఎందుకంటే అప్పటికే బ్యాటర్లు కొన్ని బంతులు ఎదుర్కొని, క్రీజులో సెటిల్ అయి ఉంటారు' అని పేర్కొన్నాడు. అలాగే తిలక్ వర్మ



బ్యాటింగ్ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'తిలక్ వర్మ తెలివైన క్రికెటర్. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయగలడు. వెస్టిండీస్ మ్యాచ్‌లో సరైన సమయంలో పరుగులు రాబట్టి, సంజుశాంసన్ మీద ఒత్తిడి తగ్గించాడు. నం.3, 5, 6..ఇలా ఏ స్థానంలోనైనా బ్యాటింగ్ చేయగలడు' అని అన్నాడు. జోస్ బట్లర్ విషయంలో టీమ్‌ఇండియా అప్రమత్తంగా ఉండాలని గావస్కర్ హెచ్చరించాడు. 'అభిషేక్ శర్మలానే జోస్ బట్లర్ ప్రమాదకరమైన ఆటగాడు. అందుకే త్వరగా పెవిలియన్‌కు పంపడం చాలా కీలకం. అతడు ఎలా విధ్వంసం సృష్టించగలడో గత ఐసీసీ (ICC) ఈవెంట్లలో, ఐపీఎల్‌లో మనం చూశాం' అని సునీల్ గావస్కర్ పేర్కొన్నాడు. ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా గురువారం.. టీమ్‌ఇండియా, ఇంగ్లాండ్ మధ్య సెమీఫైనల్ పోరు జరగనుంది. అంతకు ముందు బుధవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ మధ్య మొదటి సెమీఫైనల్ నిర్వహించనున్నారు. సెమీస్‌లో గెలిచిన జట్లు.. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్రమోదీ స్టేడియంలో జరగనున్న తుదిపోరులో తలపడనున్నాయి.

## అభిషేక్ శర్మ.. మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి : టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్



టీమ్‌ఇండియా టీ20 స్పెషలిస్ట్ బ్యాటర్ అభిషేక్ శర్మ ప్రస్తుత పొట్టి ప్రపంచకప్‌లో ఫామ్ లేమితో ఇబ్బంది పడుతున్నాడు. అతడు ఆరు మ్యాచుల్లో కేవలం 80 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో మూడు డకౌట్లు, కేవలం ఒక హాఫ్ సెంచరీ మాత్రమే ఉంది. చావోరేవో తేల్చుకోవాల్సిన పరిస్థితుల్లో టీమ్‌ఇండియా.. వెస్టిండీస్‌తో ఆడిన మ్యాచ్‌లోనూ అతడు విఫలమయ్యాడు. 11 బంతుల్లో 10 రన్స్ మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ అభిషేక్ శర్మకు కీలకమైన సూచనలు చేశాడు. అతడి మైండ్‌సెట్ మార్చుకోవాలని, షాట్ సెలక్షన్‌పై దృష్టిపెట్టాలని సూచించాడు. 'మన వికెట్‌కు మనం విలువ ఇవ్వకుంటే.. అలాగే పేలవమైన షాట్లు ఆడతాం. అభిషేక్ ఇప్పటికే తక్కువ సమయంలో స్టార్ క్రికెటర్‌గా పేరు తెచ్చుకున్నాడు. ఒకవేళ అతడు సూపర్‌స్టార్‌గా కీర్తి సొంతం చేసుకోవాలంటే మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ ఆడాలి. జట్టును విజయపథంలో నడిపించాలి' అని మనోజ్ తివారీ అన్నాడు. అభిషేక్ ఫీల్డింగ్ గురించి కూడా మనోజ్ తివారీ మాట్లాడాడు. 'టీమ్‌ఇండియాలో స్థానం కోసం చాలా పోటీ ఉంది. అభిషేక్ వారందరికంటే ముందు ఉండాల్సిందే. ఫీల్డింగ్‌లోనూ అతడు రెండు క్యాచ్‌లను వదిలేశాడు. అతడి మైండ్‌సెట్‌లో మార్పు రావాలి' అని అతడు అన్నాడు.

*** అభిషేక్ బ్యాటింగ్‌లో లోపాలున్నాయి: ఇర్ఫాన్ పఠాన్**

అభిషేక్ బ్యాటింగ్‌లో టెక్నికల్ లోపాలున్నాయని టీమ్‌ఇండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ అన్నాడు. 'అభిషేక్ శర్మ హాఫ్ సెంచరీ చేసిన తర్వాత అదే రిథమ్ కొనసాగించి, పరుగులు చేస్తాడనుకున్నా.

# జిల్లా కలెక్టర్లూ..మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోండి

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : ప్రజా ప్రభుత్వ ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు ఉండాలన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన జోగులాంబ గద్వాల, కరీంనగర్, రాజన్నసిరిసిల్ల, వికారాబాద్, మెదక్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ తదితర జిల్లా కలెక్టర్లు మంగళవారం నాడు సచివాలయంలో రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారితో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గడిచిన రెండు సంవత్సరాలలో ప్రజా ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని, ఈ సంక్షేమ పథకాలను ప్రతి పేదవాడికి చేర్చవలసిన బాధ్యత కలెక్టర్లదేనని అన్నారు.

**ప్రజల అవసరాలను అర్థం చేసుకోండి**

సంక్షేమం, అభివృద్ధిని బ్యాలెన్స్ చేస్తూ ముందుకు తీసుకెళ్ళాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్ల పై ఎంతో ఉందని మంత్రి పొంగులేటి ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల అవసరాలను అర్థం చేసుకొని పని చేయాలని కలెక్టర్లకు దిశ నిర్దేశం చేశారు. ఐఏఎస్ అధికారుల కెరీర్ లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని చెప్పారు. ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని సూచించారు. ప్రజాపాలనలో ప్రజాకేంద్రంగా పాలన సాగాలని , ప్రజలకు మేలు చేసే పనులనే జిల్లా పాలకులుగా చేపట్టాలని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం రూపొందించిన పథకాలను అమలుచేసి అర్హులైన ప్రతిఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించవలసిన బృహత్తర బాధ్యత కలెక్టర్లదేనని ఒక టీమ్ లాగా అధికార యంత్రాంగం పని చేయాలని సూచించారు.

## టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుపై ప్రచారం... గాగ్ ఆర్డర్ ఇచ్చిన హైదరాబాద్ కోర్టు

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు హైదరాబాద్ కోర్టులో భారీ ఊరట లభించింది. తనపై జరుగుతున్న విషప్రచారాన్ని నిలిపివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయస్థానం గ్యాగ్ ఆర్డర్ జారీ చేసింది. ఈ విషయాన్ని బీఆర్ నాయుడు స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. తనపై ఎలాంటి ఆధారరహిత, దుష్ప్రచార కథనాలను ప్రసారం చేయకూడదని ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలను కోర్టు స్పష్టంగా ఆదేశించిందని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రచురితమైన లేదా ప్రసారమైన కథనాలను తక్షణమే తొలగించాలని కూడా ఆదేశాల్లో పేర్కొన్నట్లు వివరించారు. ఇదే సమయంలో గూగుల్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సైతం సంబంధిత కంటెంట్‌ను తమ సైట్ల నుంచి తొలగించాలని కోర్టు ఆదేశించినట్లు నాయుడు పేర్కొన్నారు. తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే ఏఐ, మార్ఫింగ్ వీడియోల ద్వారా తనపై దుష్ప్రచారం చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. "సత్యం చివరకు గెలుస్తుంది. ధర్మం వైపు నిలబడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

## ఇరాన్ యుద్ధం... ఢిల్లీ-లండన్ డైరెక్ట్ ఫ్లైట్ కు భగ్గుమంటున్న టికెట్ ధరలు!

మార్చి 03 (భారత శక్తి) :పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయ ప్రయాణికులపై, ముఖ్యంగా భారత్ నుంచి యూరప్ వెళ్లేవారిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న క్షిపణి, డ్రోన్ దాడుల కారణంగా ఆయా దేశాల గగనతలం ప్రమాదకరంగా మారింది. దీంతో ఢిల్లీ నుంచి లండన్‌కు వెళ్లే నాన్‌స్టాప్ (డైరెక్ట్) విమానాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి. దీని ప్రభావంతో విమాన టికెట్ ధరలు సామాన్యులే కాదు, సంపన్నులు కూడా భయపడే స్థాయికి, అంటే సుమారు రూ.7 లక్షల వరకు చేరాయి. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ దళాలు ఇరాన్‌పై దాడులు జరపడం, ప్రతిగా ఇరాన్ క్షిపణి దాడులకు దిగడంతో ఈ పరిస్థితి తలెత్తింది. భద్రతా కారణాల దృష్ట్యా ఎయిర్ ఇండియా మార్చి 9 వరకు తమ ఢిల్లీ లండన్ సర్వీసులను సస్పెండ్ చేసింది. ఆ తర్వాత లభించే టికెట్ల ధర రూ.6 లక్షల వరకు ఉంది. ఇక వర్జిన్ అట్లాంటిక్ విమానాలు మార్చి 10 వరకు అందుబాటులో లేకపోగా, ఆ తర్వాత టికెట్ ధర ఏకంగా రూ.7.59 లక్షల వరకు పలుకుతోంది. సాధారణంగా 9 నుంచి 10 గంటల్లో పూర్తయ్యే ఈ ప్రయాణం, ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సి రావడంతో ఒకటి లేదా మూడు స్టాప్‌లతో కలిపి 26 నుంచి 31 గంటల సమయం తీసుకుంటోంది. "లాంగ్ రూట్ల వల్ల ఇంధన ఖర్చులు, సిబ్బంది డ్యూటీ సమయం, నిర్వహణ భారం విపరీతంగా పెరిగాయి. సప్లై తగ్గిపోవడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి," అని ఏవియేషన్ కార్గో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్‌పర్సన్ డాక్టర్ వందనా సింగ్ వివరించారు. అత్యవసరంగా వెళ్లాల్సిన ప్రయాణికులు కతార్ ఎయిర్‌వేస్ (దోహా మీదుగా రూ.1.40 లక్షలు), ఎమిరేట్స్ (ముంబై నుంచి దుబాయ్ మీదుగా రూ.28 వేల ప్రారంభ ధర) వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రయాణాలను వాయిదా వేసుకోవడం లేదా యూరప్ గేట్‌వేల ద్వారా రైలు మార్గాలను ఎంచుకోవడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారు.

## తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే అత్యధికం..

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే మంగళవారం అత్యధిక విద్యుత్ వినియోగం నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు 18,139 మెగావాట్ల విద్యుత్ వినియోగించినట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. వేసవి కాలం సమీపించిన నేపథ్యంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ గరిష్ఠస్థాయికి చేరుకుంది. విద్యుత్ అధికారులతో మల్లు భట్టివిక్రమార్క భేటీ అయ్యారు. సమర్థంగా విద్యుత్ పంపిణీ చేస్తున్న సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భవిష్యత్ విద్యుత్ అవసరాలకు సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కాగా వేసవికాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. దీంతో గృహ, కార్యాలయాల్లో విద్యుత్ వినియోగం భారీగా పెరుగుతుంది. వ్యవసాయ రంగానికి కూడా విద్యుత్ వినియోగం పెరిగింది. దీనితో రాష్ట్రంలో రోజురోజుకు విద్యుత్ డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరగడం కూడా అధిక విద్యుత్ వినియోగానికి మరో కారణంగా చెప్పవచ్చు. రాష్ట్రంలో పరిశ్రమల అవసరాలకు కూడా విద్యుత్ వినియోగం అధికమవుతోంది.

## ముగిసిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ భేటీ.. సుదీర్ఘంగా చర్చలు జరిపిన నేతలు

అమరావతి, మార్చి 03 (భారత శక్తి) :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య ఉండవల్లిలోని సీఎం నివాసంలో సుమారు రెండు గంటల పాటు కీలక భేటీ జరిగింది. మంగళగిరిలో 'ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం' సందర్భంగా జరిగిన అటవీ శాఖ 'హనుమాన్' ప్రాజెక్టు ప్రారంభోత్సవం ముగించుకుని పవన్ నేరుగా సీఎం వద్దకు వెళ్లారు. ఈ సమావేశంలో ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, టీటీడీ వివాదాలపై చర్చ జరిగింది. రాష్ట్రంలో 'జల్ జీవన్ మిషన్' అమలుపై ముఖ్యమంత్రితో పవన్ చర్చించారు. ప్రతి గ్రామీణ కుటుంబానికి రోజుకు తలసరి 55 లీటర్ల స్వచ్ఛమైన మంచినీటిని అందించాలని వీరు నిర్ణయించారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేసిందని, కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్ళించిందని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేంద్రం ఈ మిషన్ గడువును 2028 వరకు పొడిగించిన నేపథ్యంలో, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. కేవలం నీటి సరఫరానే కాకుండా గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, నిర్వహణపై కూడా దృష్టి సారించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి చేస్తున్న ఆరోపణలు, వైరల్ అవుతున్న వీడియోల అంశం కూడా ఈ భేటీలో ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. టీటీడీ పవిత్రతను కాపాడటంతో పాటు, వస్తున్న ఆరోపణల వెనుక ఉన్న రాజకీయ కోణాలను వీరు విశ్లేషించినట్లు తెలుస్తోంది. అలాగే టీటీడీ ప్రసాదాల్లో నాణ్యత, భక్తుల సౌకర్యాలపై కూడా సమీక్షించారు. త్వరలో భర్తీ చేయాల్సిన నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు, రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై కూడా ఇరువురు నేతలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అరెస్టు.. చేతికి స్వల్ప గాయం!

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు అరెస్టు చేశారు. నార్సింగిలోని ఒక వెంచర్ వద్ద స్థానికులతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు. హైడ్రాకు రియల్ ఎస్టేట్ వ్యాపారుల అక్రమ వెంచర్లు కనిపించడం లేదా అంటూ ఆమె నిలదీశారు. హైడ్రా బుల్డోజర్లను పంపించే వరకు తాము ఆందోళన విరమించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ క్రమంలో అక్కడకు చేరుకున్న పోలీసులు కవితను అదుపులోకి తీసుకున్నారు. ఆమెను అదుపులోకి తీసుకుని పోలీసు వాహనాల్లో ఎక్కిస్తుండగా తెలంగాణ జాగృతి కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, కార్యకర్తలకు మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. కార్యకర్తలు 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. అక్రమ వెంచర్లను కూల్చడానికి హైడ్రా, రంగనాథ్ రావాలని వారు డిమాండ్ చేశారు. కవితతో పాటు పలువురు జాగృతి కార్యకర్తలను అరెస్టు చేసిన పోలీసులు నార్సింగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసే సమయంలో కవిత చేతికి స్వల్ప గాయమైంది.

## నేపాల్ ఎన్నికల ఎఫెక్ట్.. భారత్ సరిహద్దు 72 గంటల పాటు మూసివేత

మార్చి 03 (భారత శక్తి) :నేపాల్‌లో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా భద్రతా చర్యలలో భాగంగా భారత్‌నేపాల్ సరిహద్దును 72 గంటల పాటు మూసివేశారు. సోమవారం అర్ధరాత్రి నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయని, గురువారం అర్ధరాత్రి వరకు కొనసాగుతాయని నేపాల్ అధికారులు వెల్లడించారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ శక్తులు దేశంలోకి ప్రవేశించకుండా నిరోధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు. భారత్ లేదా నేపాల్‌లో ఎన్నికలు జరిగినప్పుడు సరిహద్దు పాయింట్లను మూసివేయడం ఇరు దేశాల మధ్య ఒక సంప్రదాయంగా వస్తోంది. ఈసారి కూడా 'ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ ప్లాన్ 2025'లో భాగంగా సరిహద్దును మూసివేయాలని నిర్ణయించినట్టు నేపాల్ సాయుధ పోలీసు దళం (ఏపీఎఫ్) అధికార ప్రతినిధి, డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట తెలిపారు. నిత్యావసర వస్తువుల రవాణా, సరిహద్దు ప్రాంతాల్లో చిక్కుకున్న విదేశీయులకు మాత్రం మినహాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. నేపాల్ పార్లమెంటులోని 275 స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీ ప్రభుత్వం 'జెన్ జడ్' ఉద్యమం కారణంగా కూలిపోయింది. అనంతరం ఆరు నెలల్లో ఎన్నికలు నిర్వహించే లక్ష్యంతో సుశీల కార్కీ నేతృత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడింది. ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు జిల్లాల్లో విదేశీ నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కూడా నిషేధం విధించారు. అనుమానిత వ్యక్తులు, గ్రూపులు దేశంలోకి చొరబడకుండా నిరోధించేందుకు భారత సశస్త్ర సీమా బల్ (SSB)తో కలిసి సమన్వయం చేసుకుంటున్నామని డీఐజీ విష్ణు ప్రసాద్ భట్ట వివరించారు. 'జెన్ జడ్' ఉద్యమ సమయంలో లూటీకి గురైన ఆయుధాలు ఇంకా లభ్యం కాకపోవడంతో మరింత అప్రమత్తంగా ఉన్నామని ఆయన పేర్కొన్నారు.



## గాడిదపై అల్లుడిని ఊరేగించడం.. ఇది హోలీ ఆచారమట..!

మార్చి 03 (భారత శక్తి) :దేశమంతటా రకరకాల రంగులతో హోలీ చేసుకుంటుంటే ఆ ఊర్లో మాత్రం కొత్త అల్లుడిని గాడిద మీద ఊరేగించి వేడుకలు చేసుకున్నారు. ఈ వింత ఆచారానికి మహారాష్ట్రలోనిబీడ్ జిల్లా విడ గ్రామం వేదికైంది. 90 ఏళ్లుగా ఇక్కడ ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారట. హోలీ పండుగకి వారం రోజుల ముందు ఆ గ్రామంలో యువకులంతా బృందంగా మారి కొత్త అల్లుళ్ల కోసం అన్వేషిస్తారు. కొత్త అల్లుడు దొరికిన తర్వాత అతడు పారిపోకుండా ఉండేందుకు నిరంతరం వెన్నంటే ఉంటారు. ఈ ఏడాది గాడిదపై ఊరేగింపు కోసం ఒక వ్యక్తి ఎంపికయ్యాడు. కైజీ ప్రాంతానికి చెందిన అతను పెళ్లి తర్వాత విడ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. హోలీ సందర్భంగా అతనికి రంగులు పూసి గాడిదపై ఊరేగించారు. అనంతరం కొత్త దుస్తులు, ఇతర కానుకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆ వ్యక్తి మాట్లాడుతూ.. ''గాడిదపై ఊరేగింపునకు ఎంపిక అవుతానని ఊహించలేదు. కానీ, స్థానిక సంప్రదాయాలను గౌరవించి వేడుకల్లో భాగంగా ఇందుకు అంగీకరించా'' అని తెలిపాడు. 1930ల్లో ఆనంద్‌రావ్ దేశ్‌ముఖ్ ఈ ఆచారాన్ని ప్రారంభించినట్లు స్థానికులు చెబుతుంటారు. హోలీ పండగ రోజున తన ఇంటికి వచ్చిన కొత్త అల్లుడు.. రంగులు పూస్తుంటే నిరాకరించాడట. దీంతో అతడిని ఒప్పించి రంగులు జల్లడమే కాకుండా.. ముస్తాబు చేసిన గాడిదపై కూర్చొబెట్టి ఊరంతా తిప్పారట. అదే ఆచారం కొనసాగుతూ వస్తోంది. అయితే, కొన్ని కారణాల వల్ల గతేడాది ఆ వేడుకను నిర్వహించలేదు. మళ్లీ ఈసారి సంప్రదాయాన్ని కొనసాగించడం విశేషం.

## యూట్యూబ్‌లోనూ ప్రధాని మోదీ హవా..

మార్చి 03 (భారత శక్తి) :ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకున్నారు. వీడియో షేరింగ్ ప్లాట్‌ఫామ్ యూట్యూబ్‌లో ఆయన చానెల్ 3 కోట్ల (30 మిలియన్ల) సబ్‌స్క్రైబర్ల మైలురాయిని దాటింది. దీంతో ప్రపంచంలోని ప్రస్తుత, మాజీ దేశాధినేతల్లో యూట్యూబ్‌లో అత్యధిక సబ్‌స్క్రైబర్లు కలిగిన నేతగా ఆయన తన స్థానాన్ని మరింత పదిలం చేసుకున్నారు. ఈ ఘనతతో డిజిటల్ కమ్యూనికేషన్‌లో మోదీకి ఉన్న పట్టు స్పష్టమవుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇతర నేతలతో పోలిస్తే మోదీ భారీ ఆధిక్యంలో ఉన్నారు. ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సోనారోకు కేవలం 66 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు మాత్రమే ఉన్నారు. ఇది మోదీ సబ్‌స్క్రైబర్ల సంఖ్యలో దాదాపు నాలుగో వంతు మాత్రమే. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పోలిస్తే ప్రధాని మోదీకి ఏకంగా ఏడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉండటం గమనార్హం. దేశీయంగా చూస్తే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ యూట్యూబ్ చానెల్ కన్నా మోదీ చానెల్‌కు సుమారు మూడు రెట్లు ఎక్కువ మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ (AAP), భారత జాతీయ కాంగ్రెస్ (INC) పార్టీల అధికారిక చానెళ్ల కన్నా కూడా మోదీ వ్యక్తిగత చానెల్ సబ్‌స్క్రైబర్లు నాలుగు రెట్లు అధికంగా ఉన్నారు. కొన్ని రోజుల క్రితమే (ఫిబ్రవరి 26న) ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో 10 కోట్ల (100 మిలియన్ల) ఫాలోవర్ల మార్క్‌ను అధిగమించారు. ఈ ఘనత సాధించిన తొలి ప్రపంచ నేతగా ఆయన రికార్డు సృష్టించారు. 2014లో ఇన్‌స్టాగ్రామ్‌లో చేరిన మోదీ, గత దశాబ్ద కాలంలో ప్రపంచ నేతల్లో అత్యంత చురుకైన, విస్తృతమైన ఫాలోయింగ్ ఉన్న ఖాతాను నిర్మించుకున్నారు. ఈ ప్లాట్‌ఫామ్‌లో రెండో స్థానంలో ఉన్న డొనాల్డ్ ట్రంప్‌కు 43.2 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా, మోదీకి ఆయన కన్నా రెట్టింపు ఫాలోవర్లు ఉన్నారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో (15 మిలియన్లు), బ్రెజిల్ అధ్యక్షుడు లూలా (14.4 మిలియన్లు), టర్కీ అధ్యక్షుడు ఎర్డోగాన్ (11.6 మిలియన్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. ఇతర సోషల్ మీడియా వేదికలైన 'ఎక్స్' (ట్విట్టర్) లో ప్రధాని మోదీకి 10.63 కోట్ల మంది, ఫేస్‌బుక్‌లో 5.4 కోట్ల మంది ఫాలోవర్లు ఉన్నారు. ఈ గణాంకాలు ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా యువతలో ప్రధాని మోదీకి ఉన్న విస్తృతమైన ఆదరణను, బలమైన సంబంధాలను తెలియజేస్తున్నాయి.

## 1.2 కోట్ల విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ పూర్తి

ఢిల్లీ, మార్చి 03 (భారత శక్తి) :భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ కీలక మైలురాయిని చేరుకుంది. దేశంలో ఉన్న లక్షకు పైగా పాఠశాలల్లో ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తయినట్లు అధికారికంగా వెల్లడించింది. గత ఏడాది నుంచి బయోమెట్రిక్ అప్‌డేట్ ను ఉడాయ్ ప్రారంభించింది. ఏడాదిపాటు ఈ కార్యక్రమం సాగనుంది. ఇందులో భాగంగా 7 నుంచి 15 ఏళ్ల విద్యార్థులకు ఉచితంగా ఆధార్ వివరాలను అప్‌డేట్ చేయనుంది. ఆరు నెలల్లో 1,03,000 పైగా పాఠశాలల్లో ఎంబీయూ చేపట్టింది. దాదాపు 1.2 కోట్ల విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్‌లను పూర్తిచేసినట్లు ఉడాయ్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఐదేళ్లలోపు చిన్నారులకు బాల ఆధార్ లేదా బ్లూ ఆధార్ జారీ చేస్తారు. ఫొటో, పేరు, పుట్టిన తేదీ, చిరునామా వివరాలతో ఈ గుర్తింపు కార్డును జారీ చేస్తుంటారు. ఆ సమయంలో ఫింగర్‌ప్రింట్ గానీ, ఐరిస్ బయోమెట్రిక్స్ గానీ సేకరించరు. నిబంధనల ప్రకారం ఐదేళ్లు దాటితే ఫింగర్‌ప్రింట్స్, ఐరిస్, ఫొటో అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీన్ని ఫస్ట్ తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్‌గా (MBU) పేర్కొంటారు. 5 నుంచి 15 ఏళ్ల మధ్య చిన్నారుల వివరాల అప్‌డేషన్‌కు ఏడాదిపాటు ఎలాంటి రుసుమూ చెల్లించాల్సిన అవసరం లేదు.

# కలెక్టర్లకు సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్: నెలకు 10 రోజులు ఫీల్డ్ విజిట్..

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐఏఎస్ అధికారుల పనితీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. సచివాలయంలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న సీఎం.. ప్రభుత్వ లక్ష్యాలను, అధికారుల బాధ్యతలను స్పష్టంగా వివరించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేసినప్పుడే ఐఏఎస్ ఉద్యోగానికి సార్థకత ఉంటుందని, ఆషామాషీగా ఆ పదవి దక్కదని గుర్తుచేశారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేస్తేనే కలెక్టర్లుగా కొనసాగుతారని తేల్చి చెప్పారు.

**నెలకు 10 రోజులు ఫీల్డ్ విజిట్ తప్పనిసరి**

ప్రభుత్వానికి అధికారులే కళ్లు, చెవులని సీఎం పేర్కొన్నారు. కలెక్టర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేయాలని సూచించారు. "కలెక్టర్లుగా మీరు క్షేత్రస్థాయిలో పర్యటించకపోతే ప్రజల సమస్యలు ఎప్పటికీ అర్థం కావు. కాబట్టి ప్రతీ కలెక్టర్ కనీసం నెలకు 10 రోజులైనా ఫీల్డ్ విజిట్ చేయాల్సిందే" అని సీఎం ఆదేశించారు.

మార్చి 6 నుంచి 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి సూచించారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు రాష్ట్రవ్యాప్తంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందులో ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేయాలి. గ్రామాలవారీగా సంక్షేమ పథకాల కోసం ప్రభుత్వం చేసిన ఖర్చు, లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో చదివి వినిపించాలి.

* **విద్యా వ్యవస్థ ప్రక్షాళన.. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో



మధ్యాహ్న భోజన పర్యవేక్షణకు ప్రతీ స్కూల్‌కు ఒక అధికారికి బాధ్యత అప్పగించాలి. ఆ అధికారి విద్యార్థులతో పాటే భోజనం చేయాలి. కలెక్టర్లు సైతం వారానికి ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలి. ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పాఠశాలల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలోని వంద నియోజకవర్గాల్లో.. నియోజకవర్గానికి ఒక మండల కేంద్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు చేయబోతున్నట్లు సీఎం ప్రకటించారు. ఆరుట్ల మోడల్‌లో అన్ని వసతులతో వీటిని నిర్మిస్తామని, ఇందుకు సంబంధించిన పూర్తి నివేదికను అందించాలని ఆదేశించారు.

* **వైద్యం, సివిల్ సప్లైస్ పైనా నజర్**

>> ఆరోగ్య రంగం: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తోంది. భవిష్యత్తులో అన్ని మెడికల్ కాలేజీలతో ప్రభుత్వ ఆస్పత్రులను ఇంటిగ్రేట్ చేయాలని భావిస్తున్నట్లు సీఎం తెలిపారు.

>> బోగస్ ఉద్యోగులు: ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు బోగస్ ఉద్యోగులను సృష్టించే అవకాశం ఉందని, కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి అలాంటి ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

>> మిల్లర్లపై ఉక్కుపాదం: మిల్లర్ల వద్ద నుంచి ధాన్యాన్ని వెనక్కి రాబట్టాల్సిన బాధ్యత పూర్తిగా కలెక్టర్లదేనని, మోసాలకు పాల్పడే మిల్లర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.

ఇసుక మాఫియాను ఉపేక్షిస్తే ఆన్‌స్పాట్ సస్పెన్షన్! అక్రమాలకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. "ఇసుక మాఫియా, అక్రమ మైనింగ్ పట్ల కఠినంగా వ్యవహరించాలి. వీటిని అరికట్టకపోతే సంబంధిత కలెక్టర్, ఎస్పీని అక్కడికక్కడే సస్పెండ్ చేస్తాం" అని హెచ్చరించారు. ప్రభుత్వం అధికారుల పనితీరును నిశితంగా గమనిస్తుందని, మంచి పనులు చేస్తే కచ్చితంగా అభినందిస్తుందని సీఎం భరోసా ఇచ్చారు. వార్షిక పర్ఫామెన్స్ రిపోర్ట్ ఆధారంగా అధికారుల పనితీరును మదింపు చేస్తామని, జూన్ నెలలో కలెక్టర్ల పనితీరుపై మరోసారి సమీక్షా సమావేశం నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# పాలన చేతకాకపోతే దిగిపో రేవంత్

* **దోపిడీ తప్ప ఏమీ తెలియదు**
* **రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చారు**
* **పరిపాలన చేస్తున్నావా? పరాచకాలు ఆడుతున్నావా?**
* **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ధ్వజం**



హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పాలన చేతకాకపోతే దిగిపోవాలని ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్ సూచించారు. ఇదేం రాజ్యం, ఇదేం ప్రజా పాలన అని మండిపడ్డారు. రెండున్నరేళ్ల పాలనలో రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డికి దోపిడీ తప్ప ఏమీ తెలియదని దుయ్యబట్టారు. ఇదొక దోపిడీ ప్రభుత్వం, బాధ్యతారహితమైన ప్రభుత్వమని విమర్శించారు. పరిపాలన చేస్తున్నావా? పరాచకాలు ఆడుతున్నావా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రవణ్ మాట్లాడుతూ విద్యా శాఖను ఎవరైనా చదువుకున్న వారికి ఇవ్వాలని హితవు పలికారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థను రేవంత్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండు కోర్సులకు ఒకటే ప్రశ్నాపత్రం..**

రెండు రోజుల క్రితం ఓ పత్రిక లో ఉస్మానియా యూనివర్సిటీకి సంబంధించి ఓ వార్త వచ్చిందని శ్రవణ్ గుర్తు చేశారు. ఉస్మానియా లో రెండు రకాల లా కోర్సులు ఉన్నాయని, ఒకటి ఐదేళ్ల లా కోర్సు, ఇంకొకటి మూడేళ్ల హానర్స్ కోర్సు ఉందని చెప్పారు. ఫిబ్రవరి 25న ఐదేళ్ల లా కోర్సు, ఫిబ్రవరి 27 న మూడేళ్ళ లా కోర్సు పరీక్ష జరిగిందని పేర్కొన్నారు. రెండు కోర్సులకు సిలబస్ ఒకటే అయినా ప్రశ్నా పత్రం ఒకటిగా ఉండకూడదన్నారు. ఐదేళ్ల లా కోర్సుకు హిస్టరీ ఆఫ్ కోర్ట్స్, లెజిస్లేచర్స్ అండ్ లీగల్ ప్రొఫెషన్స్ ఇన్ ఇండియా సబ్జెక్టుకు, మూడేళ్ల లా కోర్సుకు లీగల్ అండ్ కాన్స్టిట్యూషన్ హిస్టరీ ఆఫ్ ఇండియా సబ్జెక్టు పేపర్ ఒకటేలా వచ్చిందని ప్రశ్నించారు. రెండు రోజుల వ్యవధితో జరిగిన పరీక్షలకు ప్రశ్నాపత్రం ఒకేలా ఎలా ఉందన్నారు. ఒకటే పేపర్ ఇచ్చి తేలు కుట్టిన దొంగల్లా ఉన్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందనడానికి ఇంత కన్నా నిదర్శనం ఏమి కావాలని దుయ్యబట్టారు. ప్రశ్నా పత్రం కూడా సరిగా సెట్ చేయరాని వారు ఏం పాలిస్తారని ఎద్దేవా చేశారు. బంకర్ బెడ్ల కొనుగోలులో వంద కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని ఆరోపించారు. 60 కోట్ల రూపాయలకు రావాల్సిన బంకర్ బెడ్లను 160 కోట్లకు కొనుగోలు చేశారని మండిపడ్డారు. గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీలకు ఒకేషనల్ విద్యా సంస్థల టెండర్లు కట్టబెడుతున్నారని వాపోయారు.

**తప్పుల తడకగా విద్యా కమిషన్ నివేదిక..**

తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు తప్పుల తడకగా ఉందని దాసోజు ఆరోపించారు. గురుకులాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేయాలని విద్యా కమిషన్ సిఫార్సు చేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలో దాదాపు పది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ములు ప్రభుత్వం బాకీ పడిందని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ఇచ్చిన వెయ్యి కోట్లు ఎక్కడ అని ప్రశ్నించారు. అంబేద్కర్ పేరు మీద ఓవర్సీస్ స్కాలర్ షిప్ ప్రోగ్రామ్ కేసీఆర్ ప్రారంభించారని గుర్తు చేశారు. గ్రూప్ 1 లో అనేక తప్పులు జరిగాయని, కోర్టులో తీర్పు అనుకూలంగా వచ్చినంత మాత్రాన సత్తె పూసలు కారని దుయ్యబట్టారు.

**రాష్ట్రంలో ఎక్కడైనా ఇళ్లు కట్టారా..**

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్ల కాలంలో ఎక్కడైనా ఇళ్లు కట్టారా అని శ్రవణ్ ప్రశ్నించారు. గాంధీ విగ్రహం పేరు మీద ఇళ్ళు కూలుస్తున్నారని ధ్వజమెత్తారు. శారదా పీఠంకు నోటీసులు ఇచ్చి బుల్డోజర్లతో కూలుస్తామని అన్నారని, కానీ హరీష్ రావు వెళ్ళగానే శారదా పీఠం భూములు వెనక్కి తీసుకోవడం లేదని ప్రకటించారని చెప్పారు. ఖమ్మం వెలుగుమట్లలో పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చారని ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్హులకే పథకాలు అందాలి..
# యూరియా యాప్‌లో మార్పులు అవసరం

* **కలెక్టర్ల సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి**







హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : 99 రోజుల కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగమై రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ల కు ఆయన సూచనలు చేశారు. వార్డు సభ్యులు, సర్పంచులు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లందరికీ జిల్లా కేంద్రాల్లో ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయాలని సూచించారు. విధులు, బాధ్యతలపై వారికి అవగాహన కల్పించి రాత ప్రతులను అందించాలని ఆదేశించారు.

**సోలార్‌పై అవగాహన..**

సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు వ్యవసాయ పంప్ సెట్లకు బదులు సోలార్ పంప్ సెట్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సోలార్ మోటార్లతో కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని పేర్కొన్నారు. ఇళ్లపైన సోలార్ ప్లాంట్లు అమర్చుకోవడం.. సోలార్ విద్యుత్ వాడుకోవటంతో పాటు గ్రిడ్ కు కనెక్ట్ చేయడం వల్ల వచ్చే ఆదాయంపై గ్రామాల్లో విద్యుత్ శాఖ అవగాహన కల్పించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సభల్లో నూతనంగా ఇచ్చిన రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, 200 లోపు యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్ లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలన్నారు. వాటివల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలల సేవలు ప్రజలకు అందాలన్నారు. అనారోగ్యబారిన పడితే పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఇతర స్థానిక వైద్య సంస్థలు ప్రభుత్వ మెడికల్ కళాశాలలకే రిఫర్ చేయాలని తెలిపారు. మెడికల్ కళాశాలల్లో పరికరాలు, వైద్య విద్యార్థులు, వైద్యులు, ప్రొఫెసర్లు ఉన్నారని.. వారి సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

**అర్హులకే పథకాలు..**

ప్రతి ప్రభుత్వ పథకం లబ్ధిదారుల ముఖ గుర్తింపు చేపట్టాలన్నారు. అర్హులకే లబ్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఎట్టిపరిస్థితుల్లో అనర్హులను ప్రోత్సహించొద్దని ఆదేశించారు. ఆసరా పింఛన్లలో ముఖ గుర్తింపు చేపట్టడంతో 3 లక్షల మంది అనర్హుల పేర్లు తొలగించగలిగామని గుర్తుచేశారు. సాంకేతికతను సరైన విధంగా వినియోగించుకుంటే నష్టాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. రవాణా శాఖ సమాచారాన్నిఆన్‌లైన్లో పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల బస్సులు, ఇతర వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో పాటు లారీలు, ఇతర సరకు రవాణా వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహిస్తే మేలన్నారు. డ్రైవర్లు కలుసుకునే చోట్లనే శిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

**గుంతలకు వాట్సప్ నంబర్..**

రహదారులపై భారీ స్థాయిలో గుంతలు, ప్రమాదం జరిగే స్థలాల వివరాలు తెలుసుకునేందుకు వాట్సాప్ నెంబర్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ నంబర్‌కు వచ్చే సమాచారం ఆధారంగా మరమ్మతులు చేపట్టి సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. ఓఆర్ఆర్, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్ల వెంట చెత్తను డంప్ చేసే వాహనాలను పట్టుకొని జరిమానాలు విధించాలని ఆదేశించారు. అవసరమైతే కేసులు పెట్టాలని, దానికి ఓఆర్ఆర్ ఏజెన్సీని బాధ్యులను చేయాలని పేర్కొన్నారు.

**ప్రతి నెలా బిల్లులు..**

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ప్రతి నెలా బిల్లులు చెల్లించాలని చెప్పారు. పిల్లలకు పోషకాహారం అందించేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని స్పష్టం చేశారు. మూడు కార్పొరేషన్లతో పాటు నగరాలు, పట్టణాల్లోని వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లు, బాయ్స్, గర్ల్స్ హాస్టళ్ల వివరాలు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, డ్రగ్స్, ఈసిగరెట్ల వినియోగం జరిగితే ఆయా విద్యా సంస్థల యాజమాన్యాలు బాధ్యత వహించేలా చూడాలన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో సైకాలజిస్ట్ ఉండేలా చూడాలని సూచించారు. వ్యవసాయ శాఖ భూసార పరీక్షలు చేపట్టి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చేలా చూడాలని కోరారు. యూరియా యాప్‌లో గందరగోళం లేకుండా మార్పులు చేయాలని ఆదేశించారు. నానో యూరియా ఉపయోగాలను క్షేత్రస్థాయిలో వివరించాలని స్పష్టం చేశారు. ఇందుకు వ్యవసాయ శాఖ, పౌర సరఫరాల శాఖ పరస్పరం సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. కలెక్టర్లు తమ తమ జిల్లాల్లో పంటల వైవిధ్యతకు ఉన్న అవకాశాలపై నివేదికలు సమర్పించాలని సూచించారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయండి.. సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 03 (భారత శక్తి) : రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేత పత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. బడ్జెట్ సమావేశాలకు ముందే వైట్ పేపర్ విడుదల చేయాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. గత 12 ఏండ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.12 లక్షల కోట్ల నిధులు కేటాయించిందని.. అయినప్పటికీ రాష్ట్రంలో జీతాలు, రైతు భరోసా, సంక్షేమ పథకాల అమలు.. ఇలా ఏ పని చేయాలన్నా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని లేఖలో విమర్శించారు. సాస్కి పథకం కింద రాష్ట్రానికి రూ.10 వేల కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను కేంద్రం అందించిందన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా, ఖజానా ఖాళీ అని నెపం నెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలన్నారు. `2023 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో 6 ప్రధాన గ్యారంటీలతోపాటు 420 హామీలను గుప్పించింది. ఈ హామీలను నమ్మిన ప్రజలు కాంగ్రెస్‌కి అధికారాన్ని కట్టబెట్టింది. అనంతరం ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన మీరు, ఇచ్చిన హామీలను అమలు చేయమంటే రాష్ట్ర ఖజానాలో లంకెబిందెలకు బదులు ఖాళీ మట్టి కుండలు ఉన్నాయంటూ వ్యంగ్యంగా మాట్లాడుతూ ఇచ్చిన హామీల అమలునుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర ఖజానా గురించి ఇలా మాట్లాడిన మీరే, ఇటీవల ఒక సభలో మాట్లాడుతూ సోనియా గాంధీరాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి అవసరమైతే రూ.1000 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీనినిబట్టి రాష్ట్ర ఖజానా నిల్ కాంగ్రెస్ నాయకుల జేబులు ఫుల్ అన్న విషయం అర్థమవుతున్నది. 2014లో ప్రధాని మోదీ నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు తెలంగాణ అభివృద్ధికి అనేక రకాలుగా సహాయ, సహకారాలను అందిస్తున్నది. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలు, మరెన్నో మూలధన



పెట్టుబడులు మొదలైనవాటి రూపంలో గత 12 సంవత్సరాల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల నిధులను రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కేటాయించింది. అందులో రూ.2.5 లక్షల కోట్ల పన్నుల వాటా నిధులు, రూ.1.85 లక్షల కోట్ల విలువైన రహదారుల నిర్మాణం, దాదాపు రూ.36 వేల కోట్లకు పైగా రైల్వే బడ్జెట్ కేటాయింపులు, ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న మరో రూ. 50 వేల కోట్ల విలువైన రైల్వే పనులు, దాదాపు రూ.40 వేల కోట్ల ఉపాధి హామీ నిధులు, రూ.50 వేల కోట్ల ఉచిత రేషన్ బియ్యం పంపిణీ, గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు వివిధ ఆర్థిక సంఘాల సిఫారసుల ద్వారా అందిస్తున్న రూ.40 వేల కోట్లకు పైగా నిధులు, రూ.12 వేల కోట్లకు పైగా విలువైన విద్యుత్ ప్రాజెక్టులు, రూ.14 వేల కోట్లకు పైగా పీఎం కిసాన్ నిధులు, ఎరువుల సబ్సిడీ కోసం రూ.80 వేల కోట్లకు పైగా నిధులు, విద్య, క్రీడలకు రూ.21 వేల కోట్లకు పైగా నిధులు, ఆరోగ్య సంరక్షణకు దాదాపు రూ.9 కోట్ల నిధులు మొదలైనవి ఉన్నాయి. అంతే కాకుండా, కేంద్ర ప్రభుత్వం గత 12 ఏండ్ల కాలంలో దాదాపు రూ.2 లక్షల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, తెలంగాణ రైతుల నుంచి వరి ధాన్యాన్ని సేకరించింది. మరో రూ.60 వేల కోట్ల కనీస మద్దతు ధరను చెల్లించి, రైతుల నుంచి పత్తిని సేకరించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులను ఇవ్వడమే కాకుండా, వివిధ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సంస్థల ద్వారా దాదాపు రూ.10 లక్షల కోట్ల ఋణాలను కూడా రాష్ట్రానికి అందించింది. SASCI పథకం కింద 202021 నుంచి 202526 వరకు తెలంగాణకు రూ.10 వేల కోట్లకుపైగా వడ్డీ రహిత ఋణాలను అందించింది. ఈ ఋణాలతో రాష్ట్ర వ్యాప్తంగా మూలధన పెట్టుబడితో కూడిన కొన్ని వందల ప్రాజెక్టులు అమలుకు నోచుకున్నాయి. మురుగునీటి నాళాలు, రోడ్ల విస్తరణ, రైల్వే లైన్ల విస్తరణ, బ్రిడ్జిలు, ఫ్లై ఓవర్ల నిర్మాణం, దవాఖానలు, మెడికల్, నర్సింగ్ కాలేజీలు, సంక్షేమ, మైనారిటీ పాఠశాలలు, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు, జూనియర్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణం, పర్యాటక ప్రాంతాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఓఆర్ఆర్, ట్రిపుల్ ఆర్ మధ్య రేడియల్ రోడ్ల నిర్మాణం, గోదావరిమూసీ నది అనుసంధానం, మూసీ నది సుందరీకరణ, స్మార్ట్ సిటీ మిషన్ లో రాష్ట్ర వాటా నిధులు, వరదల వలన పాడైపోయిన నిర్మాణాల పునరుద్ధరణ, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజనలో రాష్ట్ర వాటా నిధులు వంటి అనేక ప్రాజెక్టులకు సాస్కి నిధులు ఖర్చు చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.